తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

బుధవారం 22.10.2025 | సంపుటి : 12 సంచిక : 91 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## మావోయిస్టులు అభివృద్ధిలో భాగస్వామ్యంకండి

## జనజీవనస్రవంతిలో కలవండి:సీఎం రేవంత్

- విధినిర్వహణలో ఎందరో పోలీసుల ప్రాణత్యాగం.. వారిని సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి రూ.కోటి పరిహారం, 300 గజాల ఇంటిస్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, పదవీవిరమణ వరకు జీతం చెల్లింపు
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా ఆటకట్టు..
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కో సారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సివచ్చినా పోలీస్ వెనుకడుగు వేయదని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహాల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్

మిగతా 2లో..



హైదరాబాద్ గోషామహాల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరుల కుటుంబాలకు మొమెంటోలు అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి



## హత్యకు గురైన కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన డీజీపీ

- అంకితభావంతో పనిచేసే పోలీసును కోల్పోయాం
- అన్ని విధాలా అండగా ఉంటాం :డీజీపీ శివధర్‌రెడ్డి
- పోలీసుల వద్ద ఆయుధాన్ని లాక్కుని రియాజ్ కాల్పులకు యత్నించాడు
- అతడి ఎన్‌కౌంటర్‌పై విచారణ జరుగుతోంది
- గాయపడ్డ ఆసిఫ్‌కు పరామర్శ

నిజామాబాద్(జనంసాక్షి): ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని కానిస్టేబుల్ ఇంటికి వచ్చిన డీజీపీ, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ఉన్నతాధికారులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఒక మంచి కానిస్టేబుల్‌ను కోల్పోయామన్నారు. ఇది పోలీస్ శాఖను తీవ్రకలవరానికి గురి చేసిందన్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్ ఘటనపై విచారణ జరుగుతోంది. విచారణ జరుగుతున్నప్పుడు కేసు గురించి మాట్లాడితే దర్యాప్తు అధికారిని ప్రభావితం చేసినట్లు సెప్టెంబరు నెల వేతనం ఎంత తీసుకున్నారో ఆ మొత్తాన్ని పదవీ విరమణ

మిగతా 2లో..



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పోటెత్తిన నామినేషన్లు

### మొత్తం 150కిపైగా నమోదు

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల గడువు ముగిసింది. మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు, రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) బాధిత రైతులు, ఓయూ, నిరుద్యోగ సంఘాల నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. 3 గంటల తర్వాత నుంచి గేటు లోపల ఉన్నవారికే నామినేషన్ వేసేందుకు అనుతిస్తున్నారు. దాఖలైన నామినేషన్లను రేపటి నుంచి ఆర్వో సాయిరాం పరిశీలించనున్నారు. అక్టోబర్ 24 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నారు.

### భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్

వార్త 2 లో

## ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు



### సీజన్‌లో మొత్తం 317 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసిన సీసీఐ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో

మిగతా 2లో..




## హెచ్1బీ వీసాలకు స్వల్ప ఊరట

### ఇప్పటికే అమెరికాలో చదువుతున్న వారికి ఫీజు మినహాయింపు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో ఉద్యోగం కోసం కలలు కనే వారికి ఊరట. హెచ్-1బీ వీసా ఫీజు విషయంపై ఆ దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఈ ఫీజు చెల్లింపుల విషయంపై అమెరికా పౌరసత్వం, వలస సేవల సర్వీస్ కీలక ప్రకటన చేసింది. హెచ్1బీ వీసా కోసం పెంచిన లక్ష డాలర్ల ఫీజు దేశం బయట నుంచి వచ్చే దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేసింది. యూఎస్‌సీఐఎస్ ప్రకటన ప్రకారం.. అమెరికాలో చదువుకొని, ఉద్యోగాల కోసం హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేసుకొనే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే, బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు మాత్రం ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీని ప్రకారం.. అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీయులు ముందుగా కొన్నేళ్లు అక్కడ చదవాల్సి ఉంటుంది.ఇక, సెప్టెంబరు 21న హెచ్1బీ వీసాపై ప్రకటన వెలువడిన తర్వాత దాఖలైన దరఖాస్తులకు మాత్రమే ఇది వర్తిస్తుందని తెలిపింది. ఈ ఫీజు చెల్లింపుల కోసం ఆన్‌లైన్ సేవలు ప్రారంభించినట్లు వెల్లడించింది. ఎఫ్-1 విద్యార్థి వీసా హోల్డర్లు హెచ్-1బీకి మారాలనుకునే వారితో పాటు, ఇప్పటికే చెల్లుబాటు అయ్యే హోదాతో యూఎస్‌లో ఉన్నవారికి ఈ లక్ష డాలర్ల ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఇప్పటికే యూఎస్‌లో ఉద్యోగం చేస్తూ, హెచ్1బీ వీసా కలిగి ఉన్నవారికి.. దాని రెన్యూవల్, సవరణలు వంటి వాటి కోసం దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. ఇక, విదేశాల్లోని ఉద్యోగుల కోసం హెచ్-1బీకి దరఖాస్తు చేసుకొనే సంస్థలు కూడా ఈ మినహాయింపులను అభ్యర్థించవచ్చు. కాకపోతే.. అమెరికా




మిగతా 2లో..

### రష్యా చమురు కొనుగోళ్లు ఆపకపోతే.. భారత్ భారీ టారీఫ్‌లు చెల్లించాల్సిందే..

- ట్రంప్ మరోసారి హెచ్చరిక
- అమెరికాతో ఒప్పందం చేసుకోకుంటే చైనాపై 155 శాతం సుంకాలుంటాయని వెల్లడి

2లో..

### ట్రంప్-పుతిన్‌ల భేటీ వాయిదా!

2లో..

### భారతీయులను నమ్మకూడదు

- వారిని ఎన్నటికీ మార్చలేం
- ఉన్నత నాయకత్వ స్థానాల్లో శ్వేత జాతీయులు మాత్రమే ఉండాలి.. విషం కక్కిన ట్రంప్ నామినీ

## నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది

### ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా మేఘా జాబ్ మేళా
### నిరుద్యోగ యువతీ,యువకులు సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి ఉత్తమ్

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పననే లక్ష్యంగా ఈ నెల 25 న హుజు ర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో మేఘా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందని ప్రభుత్వ పరంగా ఇప్పటికే 70 నుండి 75 వేల ఉద్యోగ నియామకాలు పూర్తి చేయడం తో పాటు తాజాగా గ్రూప్-1,గ్రూప్-2 ఉద్యోగ నియామకాల పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేశామన్నారు.అంతే గాకుండా లైసెన్స్ డ్ సర్వేవర్ లను నియమించ బోతున్నట్లు ఆయన వెల్లడించారు.25 న హుజుర్నగర్ లో నిర్వహించ తలబెట్టిన మేఘా జాబ్ మేళా జరపతలబెట్టిన విజ్ఞాన్ పాఠశాల, స్వర్ణవేదిక ఫంక్షన్ హాల్ లలో ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్,జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, జిల్లా ఎస్ పి నరసింహ తదితరులు మంత్రి వెంట పాల్గొన్నారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న నిరుద్యోగ సమస్య దేశానికి ఒక సవాల్ గా మారిందని ఆవేదన వ్యక్తం



మిగతా 2లో..

## దక్షిణాఫ్రికాలో కామారెడ్డి వాసి అనుమానాస్పద మృతి

కామారెడ్డి(జనంసాక్షి):దీపావళి రోజు దక్షిణాఫ్రికాలో తెలంగాణ వాసి మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ (32) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం దక్షిణాఫ్రికాకు వలస వెళ్లాడు. అక్కడ బోరింగ్ డ్రిల్లర్, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే సోమవారం నాడు చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో తెలంగాణలోని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

## రాముడి స్ఫూర్తితోనే ఆపరేషన్ సిందూర్

### ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలి : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):దీపావళిపర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు.

మిగతా 9లో..

## బస్తీదవాఖానా సుస్తీ వదలాలి

- పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పకోలేక పోతున్నారు
- దానం నాగేందర్ స్టార్‌ను క్యాంపెయినర్‌గా ఎలా ప్రకటించారు?
- ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు.

మిగతా 2లో..



## కేబినెట్‌లో జరగని విషయాలపై దుష్ప్రచారం

- దండుపాళ్యం బ్యాచ్ అంటూ విమర్శిస్తారా?
- హరీశ్ తీరుపై మండిపడ్డ మంత్రి అడ్లూరి



హైదరాబాద్(జనంసాక్షి):కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా అంటూ బిఆర్ఎస్ నేత హరీష్ రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫైర్ అయ్యారు. కేబినెట్లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై గత ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించిందని విమర్శించారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. పదేండ్లు మేమే రాజులం తామే మంత్రులం అన్నట్టు వ్యవహరించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దుయ్యబట్టారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు. కేబినెట్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చ చేయలేదని తాను ప్రమాణం చేస్తానని

మిగతా 2లో..

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

- ఎన్నుకున్న ఆ దేశ పార్లమెంట్
- శుభాకాంక్షలు తెలిపిన మోదీ



టోక్యో(జనంసాక్షి):జపాన్ తొలి మహిళా ప్రధానిగా అతివాద నేతగా పేరున్న సనే తకైచి ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం దేశంలోని తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకైచికి ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. పార్లమెంట్‌లో

మిగతా 2లో..

## నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం
# కృషిచేస్తోంది

చేశారు.తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎదురైన అతిపెద్ద సమస్య నిరుద్యోగ సమస్య మాత్రమే నని దీని పరిష్కారనికై తాను ప్రత్యేకంగా చొరవ తీసుకుని పరిశ్రమల శాఖాకు అనుబంధంగా ఏర్పాటైన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణా తో పాటు సింగరేణి కాలరీస్ యజమాన్యంతో సంప్రదించి భారీ స్థాయిలో మేఘా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇప్పటి వరకు ఈ మేఘా జాబ్ మేళాలో పాల్గొనేందుకు 205 పై చిలుకు కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకోగా 9,500 పై చిలుకు నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు తమ తమ పేర్లు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు.అటు కంపెనీల సంఖ్య ఇటు జాబ్ మేళాకు హాజరయ్యే వారి సంఖ్య ఇంకా పెరగవచ్చని ఆయన తెలిపారు.విశాఖ అస్బెస్టాస్ వంటి పేరెన్నికగన్న పరిశ్రమలతో తానే స్వయంగా మాట్లాడి అహ్వానించడంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని పరిశ్రమలు జాబ్ మేళాకు హాజరయి వారి వారి కంపెనీలలో ఖాళీలను పట్టి నియమకాలు జరిపేందుకు అంగీకరించాయన్నారు.పట్టణ ప్రాంతాల వారితో పోల్చి చూసినట్లయితే గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే లభిస్తున్నాయాన్నది గమనించిన మీదటనే ఈ మేఘా జాబ్ మేళా ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు.200 కు పై చిలుకు పరిశ్రమలు ఈ జాబ్ మేళాలో పాల్గొన బోతున్నందున గ్రామీణ ప్రాంతాలలో అవకాశాలు లేక ఉపాధి కోసం నిరీక్షిస్తున్న యువతీ,యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం ఒక యజ్ఞంలా పని చేయాలని ఆయన కాంగ్రెస్ క్యాడర్ కు,లీడర్ కు పిలుపునిచ్చారు.అదే సమయంలో నిరుద్యోగులకు ఊపాధి అవకాశాలు కల్పించేందుకు గాను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేఘా జాబ్ మేళాలో పాల్గొనేందుకు గ్రామీణ యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ తమ అర్హతలకు తగిన ఉద్యోగ అవకాశాలకై పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.ఎన్నో వ్యయప్రయసాల కొనర్చి ఉన్నత చదువులు చదివించిన తల్లి తండ్రుల కళ్ళలో వెలుగులు నింపేందుకు ఉద్దేశించ బడిన మేఘా జాబ్ మేళా నిరుద్యోగులకు ఒక వేదికగా మారనుందని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్బోధించారు.

## బస్తీదవాఖానాలో సుస్తీ వదలాలి

ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్ లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలను ప్రారంభించిందని చెప్పారు. 90 శాతం పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా తమకు 4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మహిళా డాక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చా÷-లకెట్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. నాలుగు ఐదు నెలలుగా బస్తీ దవాఖానాలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. బస్తీ దవాఖానల్లో మందు గోళీలు కూడా అందుబాటులో లేవన్నారు. ప్రజారోగ్యం అంటే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నదో దీనితో అర్థమవుతుందన్నారు.

## ట్రంప్-పుతిన్‌ల భేటీ వాయిదా!

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోసారి భేటీకి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే హంగరీలోని బుడాపెస్ట్ దీనికి వేదికగా నిర్ణయించారు. అయితే, ఈ సమావేశం వాయిదా పడనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇరుదేశాల అధ్యక్షుల సమావేశానికి ముందు.. అమెరికా, రష్యా విదేశాంగ మంత్రులు మార్కో రూబియో సెర్గీ లావ్రోవ్‌ల మధ్య సమావేశం జరగాల్సిఉంది. అయితే, ఇది నిరవధికంగా వాయిదా పడిందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అధ్యక్షుల సమావేశానికి సంబంధించి ఏర్పాట్లలో భాగంగా నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకు గాను వీరు భేటీ కావాల్సిఉందని రష్యా తెలిపింది. ఈ సమావేశం నిలిచిపోవడానికి గల కారణాలు స్పష్టంగా తెలియలేదు. ఈ క్రమంలోనే రూబియో, లావ్రోవ్‌లు సోమవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. యుద్ధానికి శాశ్వత పరిష్కారం ఇచ్చేందుకు.. రష్యా, అమెరికాల మధ్య సహకారానికి సంబంధించి ఈ భేటీ ప్రాముఖ్యతను రూబియో చెప్పినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. అయితే, ఉక్రెయిన్ వివాదం శాంతియుతంగా పరిష్కరించే విషయంపై వీరి మధ్య బేధాభిప్రాయాలు వెలువడినట్లు వర్గాలు తెలిపాయి.దీంతో ట్రంప్- పుతిన్‌లు వచ్చే వారం భేటీకి సంబంధించి రూబియో సిఫార్సు చేసేందుకు అయిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మంత్రులు ఈ వారంలో మళ్లీ మాట్లాడు కునే అవకాశం ఉందన్నారు. ఈ ఫోన్ కాల్‌పై క్రెమ్లిన్ స్పందించింది. ట్రంప్, పుతిన్‌ల భేటీకి సంబంధించి ఇరుదేశాల మంత్రుల మధ్య నిర్మాణాత్మకమైన చర్చలు జరిగాయని పేర్కొంది. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే అంశంపై ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. అవి ఫలించడం లేదు.



# మావోయిస్టులు అభివృద్ధిలో భాగస్వామ్యంకండి

కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు సీఎం నివాళు లు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఆ బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయిస్టులనూ కోరుతున్నానని సీఎం తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు.గ్రేహౌండ్స్ కమాండోలు.. టి. సందీప్, వి.శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్‌లు సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందారని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారని అన్నారు. మూడు రోజుల కింద నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారని గుర్తుచేశారు. భర్త ప్రమోద్ ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి రూ.16 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ వెల్ఫేర్ నుండి రూ.8 లక్షలు ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. 29-06-2008 న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజులరామారంలో 200 గజాల స్థలం కేటాయించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వాని కి గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించిందని ట్ తెలిపారు. అదేవిధంగా, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందిందని చెప్పారు. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలా పాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలంగాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. డ్రగ్స్ దందా వెనక ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దు అనే ఆదేశాలను జారీ చేశాం. ఒకప్పటితో పోలీస్తే నేరాల స్వభావం మారుతోంది.

సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి.మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు పత్రికల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి.టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెబుతున్న తీరు భేష్. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం.ఈ విభాగం అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది.సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని అన్నారు. తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి.కానీ నేడు పోలీస్ శాఖ చర్యల వల్ల శాంతి నెలకొంది. మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకుల ను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోయి దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణమన్నారు.హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం. విధినిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం.మెడికల్ సీట్ల లోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నాం. తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్ గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందన్నారు.

## కేబినెట్‌లో జరగని విషయాలపై దుష్ప్రచారం

మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంపై మాజీ మంత్రికి సవాల్ విసిరారు మంత్రి. 'సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా? హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపై ప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా? మా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి నేను ప్రమాణం చేస్తాను. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను. నువ్వు ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయ గలవా? ఏ శనివారం వస్తారో హరీష్ రావు చెప్పాలని, ఛాలెంజ్‌ను హరీష్ స్వీకరించాలన్నారు. కొండా సురేఖ బిడ్డ.. మా అందరికీ బిడ్డ లాంటిదే' హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమొక్రటిక్ పార్టీ- జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమితో.. తకైచికి భారీ మద్దతు లభించింది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. జపాన్ తొలి మహిళా ప్రధాని ఎన్నికైన సానే తకైచికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్-జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తకైచితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు

317 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసింది. ఈ నెల 24న నల్గొండ జిల్లాలో పలు సీసీఐ కేంద్రాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీం నెంబర్ 18005995779 ఏర్పాటు చేసినట్లు తుమ్మల పేర్కొన్నారు.

## భాజపా అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్

**హైదరాబాద్(జనంసాక్షి):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ ఆలయంలో దీపక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా షేక్‌పేట తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు చివరి రోజు కావడంతో అతను నామినేషన్ వేశారు.. మంగళవారం సాయంత్రంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది. ఉప ఎన్నికల్లో పోటీకి చివరిరోజులు పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 150కిపైగా నామినేషన్లు దాఖలవగా.. అభ్యర్థుల సంఖ్య 100 మార్క్‌ని దాటింది. మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్స్ వేశారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చివరిరోజున బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు.

## హత్యకు గురైన కానిస్టేబుల్ కుటుంబాన్ని
# పరామర్శించిన డీజీపీ

తేదీ వరకు ప్రతినెలా ఆయన కుటుంబానికి అందించాలని, 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పోలీసు భద్రత, వెల్ఫేర్ బోర్డుల నుంచి రూ.24 లక్షల పరిహారం, పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. నిజామాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, అతన్ని పట్టుకునే క్రమంలో మరొక యువకుడు ఆసిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆసిఫ్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా, ఆయన సాహసాన్ని ప్రశంసిస్తూ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మంగళవారం నాంపల్లిలోని మల్లారెడ్డి ఆసుపత్రిలో ఆయనను పరామర్శించారు .ఆసుపత్రిలో ఆసిఫ్‌ను కలసిన డీజీపీ శివధర్‌రెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుండి ఆరా తీశారు. డాక్టర్లు వివరించిన ప్రకారం ఆసిఫ్‌పై సర్జరీ పూర్తయిందని, ప్రస్తుతం ఆయన చేతి నరాలను సవ్యంగా కలిపి సాధారణ స్థితికి తీసుకురావడానికి చికిత్స కొనసాగుతున్నదని తెలిపారు. ఆసిఫ్ పరిస్థితి స్థిరంగా ఉందని డీజీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్‌రెడ్డి, ఆసిఫ్ చాలా ధైర్యంగా, నిజమైన పోలీసు స్ఫూర్తితో వ్యవహరించాడు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో ఆయన చూపిన సాహసం ప్రశంసనీయం. ఆయన వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. అంతేకాదు, ఆసిఫ్ ధైర్యాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గ్యాలంట్రీ మెడల్ కోసం సిఫార్సు చేస్తామని తెలిపారు. నిందితుడు రియాజ్ చేసిన దాడిలో ఆసిఫ్ రెండు చేతులకు లోతైన కత్తిగాట్లు అయ్యాయి. చేతి నరాలు కోసుకు పోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. మొదట స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఆయనను హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం మల్లారెడ్డి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. డాక్టర్లు ఆసిఫ్‌పై సర్జరీ విజయవంతంగా పూర్తయిందని, కొద్ది వారాల్లో ఆయన కోలుకుంటారని తెలిపారు. గత వారం జరిగిన ఈ ఘటనలో రౌడీషీటర్ రియాజ్‌ను నిజామాబాద్ పోలీసులు అక్టోబర్ 17న అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయంలో అతను సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌పై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్ర గాయాల కారణంగా కానిస్టేబుల్ ప్రమోద్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర పోలీస్ శాఖ, నిందితుడిని పట్టుకునేందుకు పెద్ద ఎత్తున దాడులు చేపట్టింది. చివరికి రియాజ్‌ను పట్టుకునే క్రమంలో ఆసిఫ్ ధైర్యంగా ఎదుర్కొని తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం రియాజ్‌ను పట్టుకొని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రియాజ్ మరోసారి పోలీసులు పై దాడికి పాల్పడి ఆయుధాలు లాక్కునేందుకు యత్నించాడు. ఆత్మరక్షణార్థం పోలీసులు జరిపిన కాల్పుల్లో రియాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తర్వాత పోలీస్ శాఖలో ఆసిఫ్ సాహసానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఒక సాధారణ వ్యక్తి అయినా పోలీసుల మాదిరిగా ప్రమాదంలో పాల్గొని నిందితుడిని పట్టుకునేందుకు సాహసం చేసినందుకు ఆయనను రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నట్లుగా, ఆసిఫ్ సాహసాన్ని గుర్తించి గ్యాలంట్రీ అవార్డుకు సిఫార్సు చేయడం ద్వారా ఆయనకు తగిన గౌరవం అందించనున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు లొంగిపోవాలని ఇప్పటికే సీఎం సూచించారు. తెలంగాణ నుంచి ఇంకా దాదాపు 65 మంది మావోయిస్టులు యాక్టివ్‌గా ఉన్నారు. వారిపై ఉన్న కేసుల విషయంలో సానుభూతితోనే వ్యవహరిస్తాం, ఎలాంటి వేధింపులు ఉండవని డీజీపీ తెలిపారు.

రియాజ్ పోలీసుల వద్ద ఆయుధాన్ని లాక్కుని కాల్పులకు యత్నించాడు: డీజీపీ శివధర్‌రెడ్డి నిజామాబాద్‌లో పోలీసుల కాల్పుల్లో నిందితుడు రియాజ్ మృతిచెందిన ఘటనపై తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించారు. రియాజ్ తప్పించుకుని పారిపోతూ పోలీసులపై మరోసారి దాడికి పాల్పడ్డాడని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు.. బాత్‌రూంకు వెళ్లి తిరిగి వస్తూ దాడికి తెగబడినట్లు తెలిపారు. "రియాజ్‌ను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. వారి దగ్గరున్న ఆయుధాన్ని లాక్కుని కాల్పులకు యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రియాజ్ చనిపోయాడు. ఆదివారం అతడిని పట్టుకునే క్రమంలో స్థానికుడు ఆసిఫ్‌పై దాడి చేశాడు. ఇవాళ మరో కానిస్టేబుల్‌ను గాయపరిచి పారిపోయేందుకు యత్నించాడు" అని డీజీపీ వెల్లడించారు.

గత్యంతరం లేని పరిస్థితుల్లో కాల్పులు

**గత్యంతరం లేని పరిస్థితుల్లోనే రియాజ్‌పై పోలీసులు**

కాల్పులు జరపాల్సి వచ్చిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. పోలీసులపై దాడి క్రమంలో ఈ ఘటన జరిగిందన్నారు. రియాజ్ మృతి గురించి సీపీ సాయి చైతన్య వివరాలను వెల్లడించారు. ఉదయం ఆసుపత్రిలో నిందితుడు రియాజ్ గొడవ చేశాడు. ఆసుపత్రిలో అద్దం పగలకొట్టి అందరిపై తిరగబడ్డాడు. విధుల్లో ఉన్న ఆసుపత్రి సిబ్బంది, పోలీసులపై రియాజ్ తిరగబడ్డాడు. గోల చేస్తున్న రియాజ్‌ను బెడ్‌పై పడుకోబెట్టే ప్రయత్నం చేశారు. కానిస్టేబుల్ దగ్గరున్న తుపాకీ లాక్కుని ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేశాడు. తుపాకీ కింద పడేయాలని ఆర్ఐ హెచ్చరించినా రియాజ్ వినలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే రియాజ్‌పై ఆర్ఐ కాల్పులు జరిపారు. ఆర్ఐ కాల్పులు జరపగానే రియాజ్ నేలపై పడిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నాం అని సాయి చైతన్య తెలిపారు. రియాజ్ తిరుగుబాటు తత్వానికి కానిస్టేబుల్ ప్రమోద్ హత్యే నిదర్శనమన్నారు. అతను మామూలు నేరస్థుడు కాదన్నారు.

## రష్యా చమురు కొనుగోళ్లు ఆపకపోతే..
## భారత్‌పై భారీ టారీఫ్‌లు చెల్లించాల్సిందే..

**వాషింగ్టన్(జనంసాక్షి):**రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీన్ని భారత్ తోసిపుచ్చినా.. ట్రంప్ మళ్లీ అదే పాట పాడారు. అంతేకాదు.. రష్యా చమురు కొనుగోళ్లు ఆపేంతవరకు న్యూదిల్లీ భారీ టారిఫ్‌లు చెల్లించక తప్పదని మరోసారి హెచ్చరించారు. తన అధికారిక విమానం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపేస్తామని భారత ప్రధాని నరేంద్రమోదీ నాతో స్వయంగా చెప్పారు" అని ట్రంప్ అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యలను భారత్ తిరస్కరించిన విషయాన్ని మీడియా ప్రశ్నించగా.. "ఒకవేళ భారత్ అలా చెప్పాలనుకుంటే (మోదీ-ట్రంప్ ఫోన్‌కాల్‌ను ఉద్దేశిస్తూ) మాత్రం.. వారు భారీస్థాయిలో టారిఫ్‌లు చెల్లిస్తూనే ఉంటారు. కానీ భారత్ అలా చేయబోదని నేను అనుకుంటున్నా" అని ట్రంప్ అన్నారు.శ్వేత సౌధంలో మళ్లీ మాటల యుద్ధం: పుతిన్ చెప్పిన దానికి ఒప్పుకోవాలని జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి గతవారం ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ క్రమంలో మోదీతో తాను మాట్లాడానని, మాస్కో నుంచి చమురు కొనుగోలు నిలిపివేస్తానని ప్రధాని తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై భారత్ స్పందించింది. ట్రంప్-మోదీల మధ్య అలాంటి సంభాషణ ఏదీ జరగలేదని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడటమే తమకు ముఖ్యమని పునరుద్ఘాటించారు.మరోవైపు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి లభించినట్లు తెలుస్తోంది. ఈ చర్చలకు సంబంధించి ఇరుదేశాల మధ్య వైరుధ్యాలు చాలా వరకు సద్దుమణిగాయని, త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం ఉందని భారత ప్రభుత్వ అధికారిక వర్గాలు వెల్లడించాయి. గతవారం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం వాషింగ్టన్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. కాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చైనాకు అమెరికాపై అపార గౌరవం ఉన్నందునే ఎక్కువ టారిఫ్‌లు చెల్లిస్తోందని పేర్కొన్నారు. చాలా దేశాలు అమెరికాను సద్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. చైనా మాత్రం అమెరికాను సద్వినియోగం చేసుకోలేకపోతోందన్నారు. అమెరికాతో ఒప్పందం చేసుకోకుంటే చైనాపై 155 శాతం సుంకాలు చెల్లించాలన్నారు. నవంబర్ 1 నుంచి చైనా పెరిగిన సుంకాలు చెల్లించే అవకాశం ఉందన్నారు. ఇక చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో రెండు వారాల్లో దక్షిణ కొరియాలో సమావేశం కానున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

## భారతీయులను నమ్మకూడదు

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఆఫీస్ ఆఫ్ స్పెషల్ కౌన్సిల్‌గా ట్రంప్ ప్రతిపాదించిన నామినీ పాల్ ఇంగ్రాసియా భారతీయులపై విషం కక్కారు. భారతీయులను ఉద్దేశించి పాల్ ఇంగ్రాసియా జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. పాల్ ఇంగ్రాసియా తోటి రిపబ్లికన్లతో చాటింగ్ చేస్తూ భారతీయులను నమ్మకూడదంటూ.. వారిని ఎన్నటికీ మార్చలేమని వ్యాఖ్యానించారు. దేశంలోని ఉన్నత నాయకత్వ స్థానాల్లో శ్వేత జాతీయులు మాత్రమే ఉండాలని పేర్కొన్నారు. నల్ల జాతీయుల విషయంలో తనకు అప్పుడప్పుడు నాజీ తరహా ఆలోచనలు వస్తుంటాయన్నారు. దీనికి సంబంధించిన చాట్ లీక్ అవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే భారతీయ-అమెరికన్, ప్రముఖ వ్యాపారవేత్త, రిపబ్లికన్ పార్టీ నేత వివేక్ రామస్వామిని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. నల్లజాతీయులను ఉద్దేశించి ఆయన చేసిన పలు విమర్శనాత్మక వ్యాఖ్యలు కూడా లీక్ అయ్యాయి. అమెరికా ఎన్నికలకు ముందు 2024 మేలో జార్జియాలో నియమించుకున్న ట్రంప్ ప్రచార సిబ్బందిని కేవలం మైనారిటీ ఓటర్లను ఆకర్షించడం కోసమే అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన చాట్స్ లీక్ అవడంతో పాల్ ఇంగ్రాసియాపై పలువురు నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

## హెచ్1బీ వీసాలకు స్వల్ప ఊరట

జాతీయ ప్రయోజనాలకు ఆ విదేశీయుడి పాత్ర ఎలా ఉందో వివరించే అధికారిక లేఖ ఆ సంస్థల వద్ద ఉండాలి. అతని హోదాకు కావాల్సిన అర్హతలు కలిగినవారు అమెరికాలో లేరని నిరూపించాలి. ఆ ఉద్యోగికి హెచ్-1బీ వీసా పొందేందుకు కలిగిఉన్న అర్హతలు కూడా ఆ సంస్థలు వివరించాలి. హెచ్-1బీ వీసాకు అప్లై చేసుకునేటప్పుడే ఈ మినహాయింపు అభ్యర్థనలు కూడా చేయాల్సి ఉంటుంది. ఈ ఫీజు మొత్తాన్ని దరఖాస్తుదారులు ఒకేసారి చెల్లించాల్సి ఉటుంది. దరఖాస్తు ఒకవేళ తిరస్కరణకు గురయితే.. అది తిరిగి చెల్లించబడదు. సెప్టెంబరు 21కి ముందు దాఖలైన, ఆమోదం పొందిన వాటికి అంతకుముందున్న నిబంధనలు మాత్రమే అమలవుతాయి. పెంచిన లక్ష డాలర్ల ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

# ఓటరు చేతిలో పాశుపతాస్త్రం సీ-విజిల్


- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయొచ్చు
- 100 నిమిషాల్లో పరిష్కారం
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం
- జూబ్లీ హిల్స్ ఎన్నికల నేపథ్యంలో సీ-విజిల్‌పై ఎన్నికల సంఘం ప్రచారం

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రలోభాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం, పోలీసులతో కలిసి అన్ని రకాల చర్యలు చేపడుతూ ఉంటారు. ఇక మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల సంఘం కూడా టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. ఈ క్రమంలోనే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు.. ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతులతో ప్రలోభపెట్టకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే ఎన్నికల అక్రమాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సీ విజిల్ యాప్‌ను తీసుకువచ్చింది. దీని ద్వారా దేశంలో ఏ మూలన ఉన్న పౌరుడు అయినా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

ఈ సీ విజిల్ యాప్ ద్వారా దేశంలోని ప్రతీ ఒక్క పౌరుడు తన ముందు జరిగే ఎన్నికల ఉల్లంఘనలు, అక్రమాలను నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఓటర్లను మభ్య పెట్టేందుకు రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడం, అభ్యర్థుల దుష్ప్రవర్తనపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను తీసి సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఎన్నికల అధికారులకు చేరుతుంది. ఈ ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో ఎన్నికల సంఘం అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటారు.

**ఎలా ఫిర్యాదు చేయాలి**

మన దగ్గర ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి సీ విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. అందులో మన వివరాలతో లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత ఎక్కడైనా డబ్బు, మద్యం, గిఫ్ట్‌లు పంపిణీ గానీ.. సరఫరా గానీ జరిగినట్లు గుర్తిస్తే.. వాటిని రహస్యంగా సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీయాలి. వాటిని సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి వివరాలు వెల్లడించాలి. 2 నిమిషాల నిడివి ఉన్న వీడియోలను కూడా అప్‌లోడ్ చేసే అవకాశం ఉంటుంది. ఫోటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో జీపీఎస్ ఆన్ చేసి ఉండాలి. అభ్యర్థులు, స్థానిక నాయకులు ఎవరైనా వచ్చి తమ పార్టీకే ఓటు వేయాలని డబ్బులు పంచేందుకు ప్రయత్నించినా ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా రాజకీయ పార్టీలకు చెందిన నేతలు ఎవరైనా ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినా ఫిర్యాదు చేయొచ్చు.



**సీవిజిల్ యాప్‌లో ఇలా కంప్లైంట్ చేయాలి**

అక్రమాలు జరుగుతున్న సీన్‌ను ఫొటో లేదా వీడియో తీయాలి. లొకేషన్ ఆన్ చేస్తే జీపీఎస్ యాక్టివేట్ అవుతుంది. ఫొటో లేదా వీడియో తీయగానే తేదీ, సమయం రికార్డవుతాయి. ఫొటో లేదా వీడియో తీయగానే స్క్రీన్ మీద ప్రివ్యూ కనిపిస్తుంది. ఏం తీశామన్న దానిని ఒకసారి చూసి చెక్ చేసుకోవాలి. అది ఏ రకమైన అక్రమం అనేదాని కోసం డౌన్‌లిస్ట్ చూడాలి. ఏ రకమైన అక్రమం అనేది క్లుప్తంగా రాయాలి. అప్‌లోడ్ చేసిన సమాచారం గురించి స్క్రీన్ మీద కన్ఫర్మేషన్ అడుగుతుంది. ఒకసారి పరిశీలించుకుని కన్ఫర్మ్ చేస్తే అది ఫార్వర్డ్ అవు తుంది. ఫార్వర్డ్ కాగానే సబ్మిట్ చేస్తే సక్సెస్ అని వస్తుంది. పంపిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు మెనూలోకి వెళ్లి స్టేటస్ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు.

**వేగంగా చర్యలు తీసుకుంటాం**



ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల అక్రమాలపై సీ-విజిల్ యాప్‌తోపాటు 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయొచ్చు.

- ఆర్ వి కర్ణన్, జిల్లా ఎన్నికల అధికారి

# పారదర్శకత పెంపు లక్ష్యంగా..

- గత ఐదు నెలల్లో భారత ఎన్నికల సంఘం కీలక చర్యలు




హైదరాబాద్, అక్టోబర్ 21 (జనంసాక్షి) : ఐదు నెలల వ్యవధిలో భారత ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చేయాలనే లక్ష్యంతో 30కిపైగా సరికొత్త కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ చర్యలు ఓటర్లకు మరింత సౌకర్యం కల్పించడం, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం, ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా చేపట్టబడ్డాయి. ఈ కార్యక్రమాలు ఓటర్ విద్య, సాంకేతికత వినియోగం, దివ్యాంగుల సౌకర్యం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు వంటి అనేక అంశాలను కలిగి ఉన్నాయి.

మొబైల్ డిపాజిట్ సౌకర్యం – ఓటు వేసేందుకు వచ్చే ఓటర్ల మొబైల్ ల డిపాజిట్ సౌకర్యాలకు చర్యలు చేపట్టనుంది. స్పష్టమైన ఓటర్ సమాచారం స్లిప్పులు – ఓటర్లకు తేలికగా అర్థమయ్యే విధంగా సమాచారం చేరేలా చర్యలు తీసుకోనుంది. రియల్‌టైమ్ ఓటర్ టర్నౌట్ అప్‌డేట్స్ – పారదర్శకతతో కూడిన సమాచారం అందించడానికి సమాయత్తం అయింది. రద్దీ తగ్గించడానికి ప్రతి కేంద్రంలో గరిష్టంగా 1,200 ఓటర్లు మాత్రమే అనుమతించనుంది. అన్ని ఎన్నికల సేవలు, ఫిర్యాదుల పరిష్కారం ఒకే వేదికలో లభించనున్నాయి. ఇవీఎం బ్యాలెట్ పేపర్ మార్గదర్శకాలు సవరణ – ఏకరూపత, స్పష్టత కోసం ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ స్టేషన్లలో వెబ్‌స్ట్రీమింగ్ – ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు నిర్వహించనున్నారు. ఉపఎన్నికల ముందు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ– తాజా ఓటర్ వివరాలు అందుబాటులో ఉండేందుకు నిర్వహించనున్నారు. ఈ అన్ని కార్యక్రమాలు భారత ఎన్నికల సంఘం స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక, సమగ్ర ఎన్నికల నిర్వహణకు అంకితభావంతో ఉన్నదనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ప్రతి అర్హత కలిగిన ఓటరికి గౌరవప్రదమైన, సులభమైన ఓటు హక్కు వినియోగం కోసం ఈ చర్యలు దోహదపడతాయి.

# జూబ్లీహిల్స్ ప్రచారం కోసం స్టార్ క్యాంపెయినర్లు

- 40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ
- జాబితాలో మాజీ సిఎం కెసిఆర్ పేరు




హైదరాబాద్, అక్టోబర్ 21 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్ కుమార్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు.. వారికి వాహనాల అనుమతికి పాస్‌లను మంజూరు చేశారు. ఈ ఎన్నికల ప్రచారం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయిన్ల జాబితాలో ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ జాబితాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు సైతం ఉన్నది. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ శ్రీనివాస్ యాదవ్, వీ ప్రశాంత్ రెడ్డి, జీ జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్ నిరంజన్ రెడ్డి ఉన్నారు. మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వీ శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ సైతం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎం కృష్ణ రావు, కేపీ వివేకానంద గౌడ్, డీ సుధీర్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, చింతా ప్రభాకర్ సైతం స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. ఎమ్మెల్సీల్లో దాసోజు శ్రవణ్, ముఠా గోపాల్, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టాటా మధుసూధన్, ఎల్ రమణా, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణు వర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ పేర్లు సైతం ఉన్నాయి.

# అయ్యా మంత్రి గారు! ఏమిటిది?

- మేం తలవంచుకొని బతకాల్నా..?
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల, అక్టోబర్ 21 (జనంసాక్షి) : 'అయ్యా.. మంత్రి గారు కాంగ్రెస్ పార్టీలో మా పరిస్థితి ఏమిటీ..? అసలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ఏమిటీ..? పార్టీ పిరాయింపుదారుల ముందు మేం తలవంచుకొని బతకాల్నా..? పిరాయింపుదారులు, వలసదారులు చెబితేనే పనులు చేస్తారా..? పనులు గానీ పదవులు గానీ ఇతరులకే కట్టబెడతారా.. ఎవరు ఈ గౌరిశంకర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్?' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వద్ద మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బీర్పూర్ మండల నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వ్యవహారశైలిపై మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం తెంచలేరన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ మా పరిస్థితి అజ్ఞాతవాసంతో ఉన్నట్టుగా ఉందన్నారు. బీర్పూర్ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ కమిటీ నియామకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**మరో పార్టీ నాయకులకు పదవులు కట్టబెడతారా..?**

దశాబ్దాల కాలం నుండి కాంగ్రెస్ పార్టీ జెండా మోసి, పార్టీలో విధేయతగా పనిచేస్తున్న కార్యకర్తలను కాదని జగిత్యాల నియోజకవర్గంలో పార్టీ ఫిరాయింపుదారులు చెప్పిన వారికి, మరో పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులు కట్టబెడతారా..? అంటూ నిలదీసారు. ఒక్క పెంబట్ల దేవాలయ కమిటీ తప్పా అన్ని దేవాలయాల కమిటీలు ఇతర పార్టీ నాయకులకు కట్టబెట్టారన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారిని కాదని పిరాయింపుదారులు చెప్పిన మాటలు వింటారా? ఇలా అయితే పార్టీలో మా పరిస్థితి ఏమిటీ అని ప్రశ్నించారు. పార్టీలో రాహుల్ గాంధీ అడుగుజాడల్లో నడుస్తున్నామనీ, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అంటూ ముందుకు సాగుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టాదారులమని, కౌలుదారులం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకువెళతామన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు హర్షణీయం

- తెలంగాణ రైతు ఐక్యవేదిక



హైదరాబాద్ (జనంసాక్షి) : మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 2400 రుపాయల మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను మార్క్ ఫెడ్ ద్వారా కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఆదేశాలు జారీ చేసి కోనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించడంతో మొక్కజొన్న రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. సంబంధిత అధికారులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో ఇదే అదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు, దళారులు, పౌల్ట్రీ నిర్వాహకులు గ్రామాల్లో రైతుల వద్ద నుంచి మొక్కజొన్నను మద్దతు ధర కంటే తక్కువ ధరకే 1900 నుండి 2100 రుపాయల వరకే దళారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నిట్ట నిలువునా దోపిడీకి గురవుతుండడంతో రైతుల ఇబ్బందులను, ఆర్థిక నష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్న కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 2400 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు నిర్ణయించడం హర్షనీయమని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు.

# సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

**రైతులకు కలెక్టర్ వినయ్ హామీ**



నిజామాబాద్, అక్టోబర్ 21 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. సకాలంలో ధాన్యం సేకరణ చేపట్టాలని అన్నారు. ద్దతు ధరలు చెల్లించి ధాన్యం సేకరించాలన్నారు. రైతులు కూడా తేమలేకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వికాస్ మహ, ఎమ్మార్వో విట్టల్ పాల్గొన్నారు. ఇదిలావుంటే ధర్పల్లి మండలంలోని వాడి, మద్దుల్ తండా, హోన్నజీపేట్, ఇందల్ వాయి మండలాల్లోని చంద్రాయన్ పల్లి, నల్లవెల్లి, గన్నారం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి వర్షం కురిసింది. ఈ వానకు కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కోత దశకు చేరిన వరి పంట నేలకొరిగింది. చేతికి అందిన పంట కాస్త వర్షానికి తడిసిపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కర్షకులు కోరుతున్నారు. తమను ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు.

# పోలీస్ క్రికెట్ టీమ్‌కు టైటిల్

హైదరాబాద్, అక్టోబర్ 21 (జనంసాక్షి) : ఛామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీ ని పోలీస్ క్రికెట్ టీం గెలుపొందింది. అక్టోబర్ 9,10 తేదీల్లో ఉప్పల్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం లో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో టాలి వుడ్ టీం పై పోలీస్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్ కు లభించిన ఐదు లక్షలు, రన్నర్ టీమ్ కు లభించిన 3 లక్షల రూపాయల నగదు బహుమతిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని పోలీసు సంక్షేమ నిధికి అందచేస్తూ ఈ చెక్కును రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ కు నేడు సచివాలయంలో నిర్వాహకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ క్రికెట్ టీమ్ సభ్యులతో పాటు, బీసీసీఐ, ప్రణవ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాములవాగు వంతెన పునరుద్ధరణ

- ప్రారంభమైన బస్సుల రాకపోకలు



కామారెడ్డి, అక్టోబర్21 (జనంసాక్షి) : ఇటీవల భారీ వర్షాలతో వచ్చిన వరదలకు కొట్టుకు పోయిన వంతెన పునరుద్ధరించారు. దీంతో వంతెనపై మళ్లీ రాకపోకలు ప్రారంభం అయ్యాయి. పాములవాగు వంతెన పనులు పూర్తి చేసి ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపునకు బస్సులను అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి బస్సులు వెళ్లే మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పాములవాగు వంతెన కొట్టుకపోయింది. దీంతో ఈ మార్గంలో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపేశారు. సీఎం రేవంత్ రెడ్డి వంతెనను సందర్శించి.. డైవర్షన్ రోడ్డు నిర్మించి రాకపోకలు పునరుద్ధరి స్తామని హామీ ఇచ్చారు. డైవర్షన్ రోడ్డు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఆర్అండ్‌బీ అధికారులు డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేయడంతో మంగళవారం నుంచి ఆర్టీసీ అధికారులు కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం బస్టాండ్ వరకు బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్వరంగా పనులు చేసినందుకు అభినందించారు.

# మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల నిర్మాణానికి కృషి చేస్తా..

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



వరంగల్ ఈస్ట్,అక్టోబర్ 21 (జనం సాక్షి) : వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఉర్సు దర్గా వద్దగల మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఘటన స్థలాన్ని సందర్శించారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ధ్వంసమైన విగ్రహ స్థానంలో మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే కాంస్య విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.అందుకు కావలసిన పనులు చేపట్టాలని స్థానిక మేస్త్రీని కోరారు. విగ్రహాల ఏర్పాటుకు కావలసిన ముడి సరుకులను తన సొంత ఖర్చులతో అందిస్తానని కమిటీ పూలే కమిటీ అధ్యక్షులు చీర భరత్ మరియు ఆడపు నగేష్ మిగతా కమిటీ సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది. అందుకుగాను విగ్రహాల ఏర్పాటుకు నిర్మాణం కొరకు మేస్త్రి ఖర్చులను సంబంధించిన పనిని ఉచితంగా చేపడతానని మేస్త్రి సైతం ముందుకు రావడం విశేషం.విగ్రహాల నిర్మాణం పనులను స్థానిక నాయకులు పర్యవేక్షిస్తారని ఏదైనా ఇబ్బందులు తలెత్తినట్టయితే వాటి పరిష్కారాన్ని సైతం కృషి చేస్తానన్నారు.బిసిల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే మరియు సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు బీసీలంతా ఐక్యంగా ఉండాలన్నారు.

# భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపంతో భర్త ఆత్మహత్య




గణపురం, అక్టోబర్ 21 (జనంసాక్షి) : తన భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెంది నగరంపల్లి గ్రామానికి చెందిన వంగ నరేష్ (34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్ఐ రేఖ అశోక్ కథనం ప్రకారం మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన మంగ నరేష్(34) అనే వ్యక్తి భూపాలపల్లి భాస్కర్ గడ్డకు చెందిన భాగ్యలక్ష్మీతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భాగ్యలక్ష్మీ తన ఇద్దరు పిల్లలతో కలిసి భూపాలపల్లిలోని తల్లి గారి ఇంటికి వెళ్లింది. దీంతో నరేష్ ఈ నెల 19న భార్యను ఇంటికి తిరిగి రమ్మని ఒప్పించేందుకు నరేష్ భూపాలపల్లికి వెళ్లగా. ఆమె కాపురానికి రానని చెప్పడంతో నరేష్ తిరిగి నగరం పల్లిలోని తన ఇంటికి వచ్చాడు. తిరిగి అదే రోజు నరేష్ పని ఉందని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. నరేష్ మూడు రోజుల నుండి సమాచారం లేకపోవడంతో ఆందోళన చెందిన అతని తల్లిదండ్రులు కొడుకు ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. కాగా, మంగళవారం బస్వరాజుపల్లి శివారు ఓ కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు నరేష్ మృతదేహం కనబడడంతో పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై రేఖ అశోక్, సిబ్బందితో కలిసి మృతదేహాన్ని బయటకు తీసి, పంచనామా నిమిత్తం భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రేఖ అశోక్ తెలిపారు.

# ఆర్థిక వనరులను దోచిపెట్టడాన్ని ఖండించండి

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటం పేరుతో ఇటీవల విశాఖపట్నంలో గూగుల్ సెంటర్ ఏర్పాటుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అనేక మినహాయింపులతో శంకుస్థాపన కార్యక్రమం సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోడీ చేయటం జరిగింది. గూగుల్ డేటా సెంటర్ రావడంతో నవ్యాంధ్రప్రదేశ్లో అనేక అనుబంధ సాఫ్ట్ వేర్ పరిశ్రమలు వస్తాయని చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఊదరగొడుతున్నారు. మోడీ- బాబు- పవన్ ఒకరిని మరొకరు పొగడ్తలతో ముంచెత్తుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఎన్డీఏ డబుల్ ఇంజన్ ప్రభుత్వ యొక్క కార్పొరేట్ దాసోహం ను, అమెరికా సంస్థ అయిన గూగుల్ కు దాసోహం అనటాన్ని తెలియజేస్తున్నది. 22 వేల కోట్ల రూపాయలు పైగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ మినహాయింపుల ద్వారా అమెరికా గూగుల్ కు ఇస్తున్నది . ఈ గూగుల్ కంపెనీ లో భాజపా క్రోనీ క్యాపిటలిస్ట్ అయిన ఆదాని కూడా భాగస్వామి అని తెలిసినది.ఆంధ్రప్రదేశ్ను గూగుల్, అదానీలకు అమ్మివేతను రాష్ట్ర ప్రజానీకం తిరస్కరించాలి!

“అభివృద్ధి” అనే ముసుగులో ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలను గూగుల్, అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాల చేతికి అప్పగించిన చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టిడిపి, భాజపా, జనసేన ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాల్సిన అవసరం ఉంది. ఈ చర్యను ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తీవ్రంగా ఖండించాలి. విశాఖపట్నంలో ₹87,520 కోట్ల విలువైన “గూగుల్ డేటా సెంటర్” అని ప్రకటించిన ప్రాజెక్ట్ ప్రజల విజయం కాదు ు ఇది కార్పొరేట్ దాస్యానికి ప్రతీక, ప్రజా సంపదను దోచుకునే ఘోర చర్య.




“డిజిటల్ ఆంధ్ర” అనే ప్రచార హోరులో దాగి ఉన్న నిజం ు కోట్ల రూపాయల పన్ను మినహాయింపులు, భూసబ్సిడీలు, విద్యుత్ రాయితీలు, నాయుడు ప్రభుత్వం 480 ఎకరాల భూమిని 25% తక్కువ ధరకు ఇవ్వడం, విద్యుత్ సుంక మినహాయింపు, 15 సంవత్సరాల విద్యుత్ సబ్సిడీలు, మరియు నిర్మాణ దశలో 100% SGST రీఇంబర్స్మెంట్ ు ఇవన్నీ కలిపి ₹22,000 కోట్లకు పైగా ప్రజా ధనాన్ని ఇప్పటికే కోట్ల లాభాలు పొందుతున్న అంతర్జాతీయ కంపెనీకి బహుమతిగా ఇవ్వడం జరిగినది. ఇది అమెరికా సామ్రాజ్యవాదులకు భారత భారత వర్గాలు జూనియర్ భాగస్వామిగా దాసోహం అనటంలో భాగమే.

సుమారు 10 లక్షల కోట్లు అప్పులో మునిగిపోయిన రాష్ట్రం **దేశంలోనే అత్యధిక ఆదాయ లోటుతో ఉన్న రాష్ట్రం** ఇంతటి భారీ సబ్సిడీలు విదేశీ మూలధనానికి ఇవ్వడాన్ని కూటమి ప్రభుత్వం ఏ సమాధానం చెప్పగలదు? రాయలసీమ రైతులు నీటి కొరతతో పోరాడుతుండగా, ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీలు బహిష్కరణకు గురవుతుండగా, గూగుల్ యొక్క ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ డేటా సెంటర్ రోజూ లక్షల లీటర్ల నీటిని యంత్రాలను చల్లబరచడానికి వృథా చేస్తుంది. ఈ గూగుల్ సెంటర్ను పర్యావరణానికి విఘాతం కలిగిస్తుందని అమెరికా ప్రభుత్వం తిరస్కరించింది. ఇదే చంద్రబాబు నాయుడు చెప్పే “స్మార్ట్ డెవలప్మెంట్” ప్రజల సంక్షేమం, పర్యావరణాన్ని కార్పొరేట్ దాహానికి బలి చేయడం.కావున ప్రజలుఈ టిడిపి పాలన, మోదీ ప్రభుత్వం, అదానీ వంటి దోపిడీదారుల మధ్య ఉన్న ప్రమాదకరమైన మైత్రిని అర్థం చేసుకోవాలి. విశాఖ గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్ బీజేపీ-టిడిపి - జనసేన కూటమి ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల రాజకీయా లకు చిహ్నం. ప్రజా మౌలిక సదుపాయాలు, ఉపాధి, గ్రామీణాభివృద్ధిని బలపరచాల్సిన స్థితిలో, వారు ఆంధ్రప్రదేశ్ను ముక్కలుగా కోసి బహుళజాతి కంపెనీలకు అమ్మేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం గూగుల్, అదానీతో కుదుర్చుకున్న ఒప్పందంలోని అన్ని వివరాలను వెంటనే ప్రజలకు వెల్లడించాలని, అన్ని రకాల సబ్సిడీలు, భూమి బదిలీలను నిలిపివేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ వనరులు ప్రజల సొత్తు లాభాల కోసం తహతహలాడే కంపెనీల సొత్తు కావు.

ఇట్టి పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువతను ఈ ద్రోహానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి పిలుస్తున్నది. మన భూమి, నీరు, వనరులను కార్పొరేట్ దోపిడీదారుల చెర నుండి తిరిగి సాధించడానికి ప్రజా ఉద్యమం నిర్మిద్దాం.

కార్పొరేట్ దోపిడీ నశించాలి !!

చంద్రబాబు నాయుడు యొక్క కార్పొరేట్ అనుకూల కూటమి పాలన నశించాలి !!

ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి !!

**మన్నవ హరిప్రసాద్,**
సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్. పొలిట్ బ్యూరో సభ్యుడు,

# పిల్లల్లో తిరుగుబాటు!

## బాధ్యత వహించాల్సిన పెద్దలెవరు?





ప్రపంచ వేదికలపై ఒక బాలిక చేసిన విమర్శలు.. నేటి బాల్యం కేవలం గౌరవాన్ని కోల్పోలేదని, సరైన మార్గదర్శకత్వం కోసం పోరాడుతోందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం గళమెత్తిన ఆ చిన్నారి, ప్రపంచ నాయకులను ఉద్దేశించి, “మీరు నా బాల్యాన్ని, కలలను దొంగిలించారు!” అని నిందించడం, పెద్దల బాధ్యతారాహిత్యంపై విసిరిన చారిత్రక సవాలుగా చూడాలి. ఈ ‘నిందించే వైఖరి’ చరిత్రలో కొత్తదేమీ కాదు. క్రీస్తు పూర్వం 2,700 ఏళ్ల నాటి కవి హెసియడ్ రచనల నుండే ‘యువతరం వినయం కోల్పోయింది’ అనే నింద ఉంది. కానీ ఈ తరం పిల్లలు తిరగబడుతున్నారంటే.. దానికి కేవలం క్రమశిక్షణ లోపం ఒక్కటే కారణం కాదు. మన పెంపక విధానాలలో, బాలల హక్కుల పరిజ్ఞానంలో ఉన్న లోపమే ప్రధాన సమస్య.

సంస్కరణ కావాలి: ప్రాచీన విశ్లేషణలు ఎలా ఉన్నా, ఆధునిక న్యాయ సూత్రాలు పెంపకంలో స్పష్టమైన హద్దులు విధిస్తున్నాయి. మన దేశ రాజ్యాంగం ప్రకారం, ప్రతి బిడ్డకు గౌరవంగా జీవించే హక్కు ఉంది. శిక్ష ద్వారా వారిలో భయాన్ని పెంచడం అనేది బాలల హక్కుల ఒప్పందానికి ఉల్లంఘన అవుతుంది. శారీరక దండన గౌరవాన్ని ఎప్పటికీ నేర్పదుబీ అది కేవలం హింసను ప్రేరేపిస్తుంది. పిల్లలలో అహంకారం, మొరటుతనం పెరగడానికి కారణాలు మన తప్పుడు పెంపక పద్ధతులే. అతి గారాబం కారణంగా.. ‘తమకు అన్నీ లభించాల్సిందే’ అనే ప్రమాదకరమైన ధోరణి వారిలో పెరుగుతోంది. మరోవైపు, తల్లిదండ్రులు ఆర్థిక ఒత్తిడిలో చిక్కుకుని, పిల్లల మానసిక అవసరాలను పట్టించుకోకపోవడం (నిర్లక్ష్యం) వారి భద్రతకు భంగం కలిగిస్తుంది.

ఉత్తమ మార్గం: పిల్లలలో అహంకారాన్ని తగ్గించి, వినయాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి ఉన్న ఏకైక ఉత్తమ మార్గం అధికారిక పెంపకము (నియంత్రణతో కూడిన వాత్సల్యం). ఇది ప్రేమ, నియమాలకు మధ్య సరైన సమతుల్యతను సాధిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలతో అపారమైన ప్రేమ, ఆప్యాయత చూపుతూనే, స్పష్టమైన నిబంధనలను తప్పనిసరిగా చూపాలి. తప్పు చేస్తే వారిని శిక్షించడం మానేసి, దాని పర్యవసానం ఏమిటో తార్కికంగా, సానుభూతితో వివరించాలి. దండన కన్నా, పరిణామం నేర్పించడమే ఇక్కడ అత్యంత ముఖ్యం. ఈ సమతుల్య పద్ధతి ద్వారా పెరిగే పిల్లలు ఉన్నతమైన స్వీయ-నియంత్రణ కలిగి, నిజమైన వినయంతో, బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు.

మార్పు ప్రజల నుండే ఆరంభం! గ్రెటా థన్బెర్గ్ లాంటి బాలికలు మనపై ఉంచిన సామాజిక బాధ్యత నుంచి మనం తప్పించుకోలేం. మన పిల్లల భవిష్యత్తును దొంగిలించే నాయకులుగా మనం ఉండకూడదు. పెంపకంలో న్యాయబద్ధతను, గౌరవాన్ని పాటించాలి. శిక్షను ఆయుధంగా ఉపయోగించడం ఆపి.. ప్రేమను, మార్గదర్శకత్వాన్ని వారి అభివృద్ధికి మార్గాలుగా మలచాలి. మన పెంపకం కేవలం విధేయతను మాత్రమే కాకుండా.. సమస్యలను విశ్లేషించి, పరిష్కరించే శక్తిని వారికి అందించాలి. ఈ సామాజిక చైతన్యం ద్వారానే, మన పిల్లలు రేపటి ప్రపంచానికి బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగగలుగుతారు. మార్పు మన నుండే ఆరంభం.

**ఫిరోజ్ ఖాన్,**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464



# నినదించిన ‘నో కింగ్స్’ ధిక్కారస్వరాలు




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక మరింతగా దుందుడుకు విధానాలతో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఆయన అనుసరిస్తున్న విధానాలు అన్ని రాచరికాన్ని తలపిస్తున్నాయని ప్రజలు ధిక్కారస్వరాలతో నినదిస్తున్నారు. ఈ తరుణంలోనే ట్రంప్ అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను, అప్రజాస్వామిక పాలనను ప్రతిఘటిస్తూ లక్షలాది ప్రజానీకం ‘నో కింగ్స్’ పేరుతో నినదిస్తూ ఈ నెల 18 నాడు తిరుగుబాటు జ్వాలలు రేకెత్తించడం అమెరికా చరిత్రలోనే మహోజ్వల పోరాటఘట్టంగా నిలిచిపోయింది. నిజానికి గతంలో ట్రంప్ పుట్టిన రోజు సందర్భంగా చోటుచేసుకున్న ‘నో కింగ్స్ డే’ ఆందోళనలకి కొనసాగింపుగానే తాజాగా ఈ ఆందోళనలు మరోసారి చోటుచేసుకున్నట్లుగానే గమనించవచ్చు.

దేశంలో హెల్త్ కేర్ నిధులలో కోత పెట్టడం, అమెరికాలో నివసిస్తున్న వలసదారులపై కఠిన చర్యలు చేపట్టి బలవంతంగా బయటికి తరమడం, మీడియాపై ఎడతెగని దాడులు చోటుచేసుకోవడం, తమను ఎదుర్కోలేని రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు బనాయించడం, పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు జరిపిన విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వ నిధులు ఇవ్వకుండా బెదిరించడం, డెమొక్రాట్ల పాలనలో ఉన్న ఆయా రాష్ట్రాలలో జాతీయ గార్డ్ దళాలను వినియోగించడం మరియు టారిఫ్ విధానాలు మొదలైనటువంటి ట్రంప్ ఈ అప్రజాస్వామిక చర్యలు ప్రజాగ్రహానికి కారణభూతమవుతూనే ఉన్నాయి. ఒక రకంగా ‘ట్రంప్ తీసుకున్న ఈ విధానపర చర్యలు రాచరికాన్ని తలపిస్తున్నాయి’ అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

అమెరికాలోని 50 రాష్ట్రాల్లోని అతి చిన్న పట్టణాల నుండి అతి పెద్ద నగరాలతో సహా 2600 ప్రాంతాలలో ఒకసారి నిర్వహించిన ఈ ఆందోళనలలో ఏకంగా 60 లక్షలకు పైగానే ప్రజలు కదం తొక్కి ఈ ఆందోళనల ద్వారా నిరసనకారులు సరికొత్త చరిత్ర సృష్టించారు. “అమెరికా నియంతల పరిపాలనలో లేదు. నియంతలకు అమెరికాలో ఎంతమాత్రం స్థానం లేదు. అమెరికా రాచరిక వ్యవస్థ కానేకాదు. ఇక్కడ ఎవరూ రాజులు లేరు. ట్రంప్ రాజు కాదు. ట్రంప్ రాచరిక పోకడలు నశించాలి. మేము అమెరికాను ప్రేమిస్తాం, కాని ట్రంపుని కాదు. ప్రజలే రాజులు. మేము ఎవరికి సేవకులం కాము. మాకు ప్రజాస్వామ్యం కావాలి. దేశంలో రాజ్యాంగం ఒక ప్రత్యామ్నాయం కాదు. అంతిమంగా రాజ్యాంగమే అత్యుత్తమైనది. మాకు రాజ్యాంగబద్ధ పాలన కావాలి” అంటూ ప్రజానీకం ధిక్కారస్వరాలతో నినదించారు. అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా ఈ నిరసనలు మిన్నంటడాన్ని కూడా ప్రత్యేకంగా గమనించవచ్చు.

నిజానికి ఈ నో కింగ్స్ ఆందోళనలకు ఏకంగా వైట్ హౌస్ ఒక్కసారిగా ఉలిక్కిపడడాన్ని గమనించవచ్చు. ట్రంప్ అనుకూలురు ఈ ప్రదర్శనలను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించిన తీరు ఏమాత్రం సహేతుకం కాదు. తాజా నిరసనలపై ట్రంప్ స్పందించి ‘వారు నన్ను ఓ రాజుగా భావించారు. కాని నేను రాజును ఏమాత్రం కాను’ అని వ్యాఖ్యానించారు. కాని యుద్ధ విమానంలో ట్రంప్ కిరీటం ధరించి విమానం నడుపుతున్నట్లుగా ఉండడమే కాకుండా కింద ఉన్న నిరసనకారుల మీదికి బురద జల్లుతున్నట్లుగా కృతిమ మేధ ద్వారా వీడియోని చిత్రీకరించి అంతిమంగా నిరసనకారులను తక్కువ చేసి చూపడం ఏమాత్రం సహేతుకం కాదు. అది ప్రజానీకాన్ని అవమానించడమే కాగలదు.

ఆయా పరిస్థితులను అన్నింటిని నిశితంగా గమనిస్తే ‘అమెరికాలో నిరంకుశ రాచరిక పాలన కొనసాగుతుంది’ అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులుగా వెలుగొందుతూనే ఉంటారు అనేది జగమెరిగిన నగ్నసత్యం. కాని అందుకు భిన్నంగా రాచరిక పోకడలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్న ట్రంప్ ఒంటెద్దు పోకడలకు ముకుతాడు వేయాల్సిన అవసరం నేడు ఉంది. ఈ దిశగా ప్రజానీకం మరియు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు మరింతగా ముందుకు ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అంతిమంగా ఈ ‘నో కింగ్స్ నిరసనలు అమెరికాలో పతనమవుతున్న ప్రజాస్వామ్య విలువలకు ప్రాణప్రతిష్ట చేశాయి’ అని నిర్ద్వందంగా చెప్పవచ్చు.

**జె.జె.సి.పి.బాబూరావు**
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690



## మానవతా దీప్తి ప్రసరించిన బౌద్ధమతం

# సమాజానికి నూతన దిశ!




భారతదేశ చరిత్రలో బౌద్ధమతం ఒక సుశక్తమైన ఆధ్యాత్మిక సాంస్కృతిక ఉద్యమంగా అవతరించింది. గౌతమ బుద్ధుడు బోధించిన ధర్మం మానవ జీవితానికి నూతన అర్థం ఇచ్చింది. ఆ కాలంలో సమాజం వర్ణ భేదాలతో, ఆచార వ్యవహారాలతో, మూఢనమ్మకాలతో చిక్కుకుపోయి ఉండగా బుద్ధుడు సత్యం అహింస కరుణ సమానత్వం వంటి విలువల ద్వారా మానవత్వానికి మార్గదర్శకత్వం అందించాడు. ఆయన చెప్పిన బోధనలు సామాజిక ఆర్థిక రాజకీయ నైతిక రంగాలలో గాఢమైన ప్రభావం చూపి భారత సమాజ నిర్మాణాన్ని మలిచాయి. బుద్ధుడి ప్రధాన బోధన సత్యాన్వేషణ. ఆయన మానవుడిని జ్ఞాన మార్గంలో నడిపించమని సూచించాడు. ప్రతి మనిషి తన ఆత్మవికాసం కోసం కృషి చేయాలని, స్వయంగా అన్వేషణ చేయాలని ఉపదేశించాడు. ఈ తాత్విక దృక్పథం ఆ కాలంలో ప్రబలిన అజ్ఞానాన్ని చిదిమి మానవుడి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆయన వర్ణ భేదాలను తిరస్కరించి ప్రతి వ్యక్తి సమానుడని ప్రకటించాడు. జన్మకంటే కర్మే మానవుడి విలువ అని చెప్పడం సామాజిక న్యాయ సూత్రానికి పునాది వేసింది.

బౌద్ధమతం మహిళల స్థితిని కూడా మెరుగుపరిచింది. స్త్రీలకు విద్యాధికారం, భిక్షుణి సంఘంలో భాగస్వామ్యం లభించింది. ఆ కాలంలో స్త్రీలను తక్కువగా చూడడం సాధారణమై ఉండగా బౌద్ధ ధర్మం వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛను ప్రసాదించింది. సమాన హక్కుల ఆలోచన బౌద్ధ సంస్కృతిలో మొదలైంది. ఈ భావన తర్వాతి తరాల మహిళా విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచింది.

అశోక చక్రవర్తి బౌద్ధ ధర్మాన్ని ఆచరించి ప్రజాహితం కేంద్రీకృత పాలనకు నూతన దిశ ఇచ్చాడు. యుద్ధం వదిలి శాంతి ధర్మం స్వీకరించిన అతను బుద్ధుడి విలువలను రాజ్య పాలనలో ప్రతిబింబించాడు. అశోకుని ధర్మ శాసనాలు నైతిక పరిపాలనకు ఆదర్శంగా నిలిచాయి. రాజు ప్రజల సేవకుడని భావన బౌద్ధ ప్రభావంతోనే వ్యాపించింది.బౌద్ధమతం విద్యా రంగానికీ అపూర్వ సేవ చేసింది. నాలందా, తక్షశిల, విక్రమశిల వంటి విశ్వవిద్యాలయాలు ప్రపంచ విద్యార్థులను ఆకర్షించాయి. అక్కడ బౌద్ధ తత్వం మాత్రమే కాక గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, వైద్యశాస్త్రం వంటి అనేక శాస్త్రాలు బోధించబడ్డాయి. విద్య అందరికీ హక్కు అనే భావన సమాజంలో స్థిరపడింది. జ్ఞానం ద్వారా మానవుడు విముక్తి పొందగలడనే ఆలోచన విద్యా సమానత్వానికి బాట వేసింది.బౌద్ధమతం కళాసాహిత్య రంగానికీ కొత్త ఊపిరి నింపింది. సాంచీ, భారహుట్, అమరావతి వంటి శిల్ప కట్టడాలు బౌద్ధ ధర్మాన్ని ప్రతిబింబిస్తూ సౌందర్య స్ఫూర్తిని కలిగించాయి. జాతక కథలు మానవ నైతికతను సులభంగా వివరించి ప్రజలకు మార్గదర్శనం చేశాయి. సాంస్కృతిక రంగంలో బౌద్ధ భావజాలం మానవతా పరమైన దృక్పథాన్ని వ్యాప్తి చేసింది.

బౌద్ధమతం ప్రపంచవ్యాప్తంగా మానవ సమానత్వాన్ని విస్తరించింది. చైనా, జపాన్, థాయ్లాండ్, శ్రీలంక, మయన్మార్ దేశాలలో బౌద్ధధర్మం సామాజిక ఐక్యతకు ఆధారమైంది. అహింసా సూత్రం ప్రపంచ శాంతి ఉద్యమాలకు ప్రేరణగా మారింది. మానవుల మధ్య విభేదాలు తొలగించి పరస్పర గౌరవం పెంపొందించడం బౌద్ధమతం ఇచ్చిన ప్రధాన పాఠం. బౌద్ధ తత్వం మానవ సమాజాన్ని నైతికత, కరుణ, సత్య నిష్ఠా అనే మూల్యాలపై నిలబెట్టింది. ఆధ్యాత్మిక విముక్తి మాత్రమే కాక సామాజిక సమతా భావనను కూడా బోధించింది. బౌద్ధమతం ప్రభావం వల్ల భారతదేశం సాంస్కృతిక పరంగా సమతా భావం గల దేశంగా రూపుదిద్దుకుంది. బుద్ధుడి ధర్మ చక్రం తిరిగినప్పటి నుండి మానవ చరిత్రలో కరుణకు, న్యాయానికి, సమానత్వానికి కొత్త దశ ప్రారంభమైంది. సమాజ అభివృద్ధి అంటే ప్రతి మనిషి విలువను గుర్తించడం, ప్రతి జీవిపై ప్రేమ చూపించడం, ఆత్మ జ్ఞానంతో జీవించడం అని బౌద్ధమతం నేర్పించింది. ఈ ఆత్మస్ఫూర్తి నేటికీ మానవతకు మార్గదర్శక జ్యోతి.

**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం



## మద్యపానం నా నిరసన



నేను చూసాను మద్యం మత్తులో
మతి చెడి గతి తప్పిన జీవులను
నేను విన్నాను మందు తప్పతాగి
మానవత్వం మసిచేసిన వార్తలను

ఉదయం లేవగానే సురాపానీయం
ఎక్కడా దొరుకుతుందనే ఆరా తీస్తారు
మధ్యాహ్నం మత్తు లో మునిగి
తిరిగి సాయంత్రమయ్యిందో లేదో
బీరు బ్రాందీ విస్కీ సారాయి బ్రాండు
మరేదయినా సరే నడిరేయి దాక
తాగి తాగి గార్ధభంలా ఇంటికోస్తారు

కష్టాల పేరనోకసారి సంతోషాల
సెలబ్రేటి పేర మరోసారి
విందు వినోదాల పేర
ఇంకోకసారి
బతుకంతా తాగి తాగి
ప్రమాద తీరం చేరుకున్నా
ఇంకా ఫుల్ హాఫ్ క్వాటరంటూ
లెక్కలు వేస్తునే వుంటారు

నిత్యం సాగే ఈ దిన చర్యలో
మొదలు మద్యపానీయ మనీకై
ముందు వెనుకాడుతారు తీరా
మందు కోంచెం దిగిందో లేదో
జూదం లో ఓడుతున్న ధర్మరాజులా
నీ సర్వస్వం తాకట్టు పెట్టేస్తారు
సిన్మాలలో చూసి అదేదో
హీరోయిజానికీ సింబాలిసమనీ
భ్రమలో పడుతున్నారు గానీ
ఇది మిమ్మల్నీ బాధల నుంచి
మురిపిస్తుందనీ ఆశిస్తున్నారు గానీ
ఇది మిమ్మల్నీ మరో లోకం లోకీ
తీసుకెళ్లుతుందనీ ఊహిస్తున్నారు
గానీ అదీ మిమ్మల్నీ వాస్తవాలకు
దూరం చేస్తుందనీ తెలుసుకోలేకున్నారు
దాని కరస్పర్శ కై పరితపిస్తున్నారు
గానీ అదోక కబంధహస్తమనీ
తెలుసుకోలేకున్నారు

మద్యము ఒక మధురపానీయమనీ
ఎవరు చేశారు ఈ దుర్భోధలు
నేటి యువ తరానికి
మందు తాగితేనే బాధలన్ని
మాసిపోతాయనీ ఏ శాస్త్రంలో వుంది
మీరు తాగే మధువే సురాపానీయమనీ
ఏ పురాణం లో వుంది
ముందు వెనుక చూడకుండా
మద్యం తాగమనీ
ఏ ధర్మం మీకు బోధించింది

అన్నీ తెలిసి కూడా నిస్సిగ్గులా
మీరింకా బేతాళుడిలా మద్యంనే
జలగలా పట్టుకు వేలాడుతున్నారు
రోజుకొక్కసారి తాగిన మీ
దాహం చల్లరాదు అసలు
తాగడం కోసమే పుట్టినట్లు
ఇంకా ఎవరైనా తాగిపిస్తారనీ
ఆత్రుత తో ఎదురు చూస్తారు
ఆఫ్ ట్రాల్ ఈ తాగుటకై
ఆరాటపడే మీరు పరాన్నజీవులు
తాగిన తర్వాత ఎంత కైనా
తెగించే నీచాతి నీచులు
మందు బాటిల్ ఇస్తే చాలు
ముందు వెనుక లేక
నీతి న్యాయం ధర్మం
అన్నీ తాకట్లు పెట్టేస్తారు
ఆఫ్ ట్రాల్ ఈ మందు కై
మిమ్మల్నీ నమ్ముకున్న వారిని
సైతం వంచన చేసే
మీలాంటి దుర్మార్గులున్నంత కాలం
ఈ దేశం ఇలాగే తగలడుతుంది
తాగుబోతులంతా ధర్మరాజులంటారా
అందుకేనేమో ఇల్లు గుల్ల చేసి
తాకట్టు పెట్టేస్తారు తాగుబోతులంతా
నిజాలు మాట్లాడేస్తారంటారు
సరేలే మేము మీలా అనాలోచితం
సర్వం సమర్పించే సత్య
హరిశ్చంద్రులం కాకపోవడమే బాగుంది
ముందు తాగకముందే
నీకు నీవే మహారాజువి
మితిమీరి తాగిన తర్వాత
దానికీ మీరొక్క బానిసలే
కాలే కడుపుకు కాసింత
గంజీ కావాలేను గానీ
ఎన్ని శీతల పానీయాలున్నా
ఎన్ని ఆరోగ్య టానిక్ లున్నా
మీకు బీరు బ్రాందీలాంటి
అల్కహాల్స్ యే అమృత పానీయాలు
అవునులే పంది బురద మెచ్చు
గానీ పన్నీరు మెచ్చునా ...?
బార్లలలో భారీ భారీ గా తాగి
తాగి నడివీధుల్లో వేలంవెర్రీ గా
చిందులేసే మీకు ఎవరు
ఏమనుకుంటున్నారనే
పట్టింపు లాంటివేమీ లేవు
నీ కుటుంబం ఏమైపోతుందన్న
ధ్యాస అస్సలు లేనే లేదు
నీ కావలిసింది కేవలం
ఆ కాలం తీరిన పానీయం మాత్రమే
ఈ కాలం లో ఎవరికీ లేదంటు
వాదిస్తారు గానీ నేను మాట్లాడేదీ
మానసిక ప్రశాంతత కై కోంత
మందు సేవించే వారి గురించి గాదు
నేను వ్యతిరేకించేదీ విందు
వినోదాలలో మితంగా తాగే
వారిని గురించి కానే కాదు
కేవలం అతి గా తాగి తాగి
నియంత్రణ కోల్పొయే వారి గురించే
కేవలం తాగుడికీ బానిసలా మారి
జీవనం సాగించే కోద్దిపాటి వారి గురించే
కానీ ........అదీ నీవు కాదనీ
ఒట్టేసి చేప్పగలవా మిత్రమా.!
మద్యమాంసాలు ముట్టకుండా
మాసమైన ఉండగలననీ
బాస చేయగలవా నేస్తమా ...! ?

మిమల్నినేవరైనా తాగుబోతులంటే
మీకు బాగా కోపం వస్తుంది
మద్యం పై ఎవరైనా వ్యతిరేకిస్తే
మీకు అసహనమోస్తుంది
తాగడం ఇష్టం లేదనీ
నిక్కచ్చిగా వేల్లడిస్తారు
తాగుడికీ బానిసలం కాదనీ
బుకాయిస్తారు గానీ తీరా
దావతులంటే చాలు
ఎంత దూరమైన వెళతారు
నిజానికీ మీకార్థం కాదు
ఆ మద్యవ్యూహం లోంచి
ఇంకా వెనక్కు రాలేకపోతున్న
అభిమన్యులు మీరనీ....!

ఈ మద్య పానం ఇంతటితో
ఆగిపోతే ఇంత మాట్లాడాలిసిందేముందీ
అదీ పాను గుట్కా గంజాయి
ధూమపానంలా మారి
మానవత్వంనే మట్టుబెడుతుంది
చేప్పా పెట్టకుండా ఊప్పోంగే
సంద్రం లా రెప్పపాటులోనే
మానవత్వ సామ్రాజ్యాన్ని కబళిస్తుంది

నిజం చెప్పు.....!
మీ కళ్ల ముందు జరిగే
మద్యం ఆగడాలు
మీకేప్పుడు కనపడనే లేదా
నిజం చెప్పు......!
నిత్యం సాగే వార్తలలో
మద్యం చేసే విషాదాలు
మీరేప్పుడు చదవనే లేదా...!
నిజం చెప్పు.....!
కనీసం ఒక్కసారైనా
ఆ వ్యసనపరులు చేసే
వికృత చేష్టాలు వినలేదా
నిజంగా మీకవన్నీ తెలిస్తే
ఆ పాత కాల్పుల గుర్తులు
పునరావృత్తము కానీయకు...!

ఎప్పుడు మయూర నాదం లా
వుండే మీ మాటలు
మదమెక్కిన మత్తేభ ఘీంకారంలా
ఎలా మారిందో తేలుసా..!
ఎప్పుడు ప్రశాంతంగా
కనిపించే మీరు
ఉన్నట్టుండీ ! ఉన్మాది లా
ఎందుకయ్యారో తెలుసా.!

నిన్నటిదాకా సహృదయుడిలా
మన్ననలు పోందిన మీరు
హఠాత్తుగా నీ ఔనత్యాన్ని
ఎలా కోల్పోయారో మీకు తెలుసా

మీ అలవాటు వ్యసనం గా
మారడం వల్లనేననీ
ఇప్పటికైనా తెలుసుకో...!
మల్లెలా స్వచ్ఛంగా
పరిమళించాలిసిన మీరు
మద్యం మత్తులో పడి
వికృత చేష్టలతో భ్రష్టు పట్టకు
సీతాకోక చిలుకలా పరిమాణం
చేందాలిసిన మీరు ఇంకా
గోంగళీ పురుగులా పరిభ్రమణం చెందకు
ఎన్ని తలలు ఎరలైనా
ఈ ప్రభుత్వాలకీ తమ
బుట్ట నింపుకోవటమే కావాలి
ఒకరు అనీ చేప్పేదీ ఏమిటి..!
ఎన్నో ఎండ్లుగా ఎన్నో తరాలుగా
ఎందరి జీవితాలను ఎడారులుగా
మార్చివేస్తున్నా కూడా
ఎందరి జీవితాలను
భగ్నం చేసినా కూడా
ప్రభుత్వాలకీదే కాసులు
రాల్చే కల్పవృక్షము
విపత్తు నిర్వహణంటూ విభజించి
ప్రమాదాలను అంచనా వేసే
ఈ సర్కారులు ఏ వరద లో
ఏంత మందిని కోల్పోయాం
ఏ తుఫాను వల్ల ఎంత నష్టం
వచ్చిందనీ లేక్కలు వేస్తారు గానీ
ఇంతకు ఇంత ప్రాణ నష్టం
అస్తి నష్టం అంతకు మించి
సామర్ధ్యం నష్టం కలిగించే
ఈ మధు విపత్తు గురించి
ఇసుమంతైనా చింతలేదు
ఇంత మంది ఈ విలయానికీ
పడి చస్తున్నా ప్రభుత్వానికీ
ఏమాత్రం పట్టింపు లేదు

ఇప్పుడైనా ఇక నైనా
ఈ సర్కారులు ఈ మద్య వరదకీ
నాణ్యమైన ఆనకట్టలు నిర్మించకుంటే
ఇక నైనా మద్యపరిమితులు
విధించి అధార్ కార్డు తో
అనుసంధానం చేయకుంటే
ఈ మానవాళి మునుపేన్నడు
చూడనీ వినని రుగ్మతలను
కనాలిసి వస్తుందీ.........!
తస్మాత్ ......! జాగ్రత....!

**ఐ.చిదానందం**

# పారదర్శకంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహించాలి

- సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్
- ఎన్నికల సన్నద్ధతతను పరిశీలకులకు వివరించిన డిఈఓ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**హైదరాబాద్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక "స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా" జరిగేలా చూడాలని సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్ ఎన్నికల అధికారులకు సూచించారు. బేగంపేట టూరిజం ప్లాజాలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్స్) హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ ఆఫీసర్ పి. సాయిరామ్, వివిధ నోడల్ అధికారులు, సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ లను కలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఈఓ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్ ఉప ఎన్నిక ఏర్పాట్లపై సమగ్ర పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు.

ఎన్నికల షెడ్యూల్ :
- నియోజకవర్గ ప్రొఫైల్, పోలింగ్ స్టేషన్ ల ఏర్పాట్లు
- సిబ్బంది మోహరింపు, శిక్షణా కార్యక్రమాలు
- ఎన్నికల సామగ్రి కొనుగోలు, రవాణా ఏర్పాట్లు
- ఈసీఐ ఐటీ కార్యక్రమాలు, స్వీప్ అవగాహన కార్యక్రమాలు
- శాంతి భద్రతలు, వల్నరెబిలిటీ మ్యాపింగ్ గు, భద్రతా ప్రణాళిక
- ఈవీఎంల నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు
- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమలు
- ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు
- బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లు, ఈటిపిబీఎస్ ఏర్పాట్లు
- మీడియా సమన్వయం, కమ్యూనికేషన్ ప్రణాళిక, ఫిర్యాదుల పరిష్కార విధానం

పై అంశాలను జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ పరిశీలకులకు వివరించారు. ఎన్నికల ఏర్పాట్లు పట్ల పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ రంజిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు జనరల్ డ్యూటీగా భావించవద్దు. ఇది గురుతర బాధ్యత. ప్రతి అధికారి, సిబ్బంది నిష్పాక్షికంగా, నిజాయితీగా, నిబద్ధత తో విధులు నిర్వహించాలని అన్నారు. ప్రతి దశలో నిష్పాక్షికంగా వ్యవహరించాలి. తటస్థంగా ఉంటూ స్వే చ్ఛాయుతంగా పారదర్శకంగా ఉంటూ ఎన్నికలు జరి గేలా అందరూ కృషి చేయాలన్నారు. నిబంధనలకు విరు ద్ధంగా తరలిస్తున్న నగదు, లిక్కర్, ఇతర వస్తువుల స్వాధీ నం పై పరిశీలకులు వివరాలు అడిగారు. గత శాసన సభ ఎన్నికలలో స్వాధీనం చేసుకున్న నగదు వివరాలను అడిగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రూ.90 లక్షలు స్వాధీనం కాగా, ఈ బైఎలక్షన్‌లో ఇప్పటివరకు రూ.2 .25 కోట్లు స్వాధీనం అయ్యాయి" అని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. సాధారణ పరిశీలకులు స్పంది స్తూ.. ఎంసీసీ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీ విజిల్ ఫిర్యాదులను సమయానుకూలంగా పరిష్కరించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి మాట్లాడుతూ బైఎలక్షన్ ప్రాధాన్యత దృష్ట్యా ఈసీఐ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అన్ని పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలి" అని సూచించారు. శాంతియుత, పారదర్శక ఎన్నికల కోసం ప్రతి అధికారి, సిబ్బంది కలసి పనిచేయాలి" అని చెప్పారు. వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని వారి ఖాతాల్లో జమ చేసేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్స్) హేమంత్ కేశవ్ పాటిల్, జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఏఎస్పీ, ఎంసీసీ నోడల్ ఆఫీసర్ నర్సింహా రెడ్డి, ఈఆర్వో రజనీకాంత్ రెడ్డి, వ్యయ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి,మీడియా కమ్యూనికేషన్ నోడల్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ పీఆర్వో మమిండ్ల దశరథం, పరిశీలకుల నోడల్ ఆఫీసర్ విల్సన్ హాజరయ్యారు.

# పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది





## సైబరాబాద్ పోలీస్ బాస్ అవినాష్ మహంతి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** సమాజ శ్రేయస్సు కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిత్యం కత్తి మీద సాములా ఎంతో ఒత్తిడితో కూడుకున్నది పోలీసు ఉద్యోగ బాధ్యత అని... అలాంటి పోలీసు విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి అమరవీరులుగా మారిన పోలీసు అధికారుల సేవలు ఈ సమాజంలో ఎప్పటికీ మరువలేనివని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. అక్టోబర్ 21 మంగళవారం జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని పలువురు పోలీసు అమరవీరులను సంస్మరించుకొని వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంస్మరణ ర్యాలీలో కమిషనర్ గాడ్ ఆఫ్ ఆనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి సంజీవ్ తో సిపి కలిసి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 2025 వ సంవత్సరంలో 191 అంది పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులుగా మారడం జరిగిందని తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వారోత్సవాలలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో లింగ అసమానతలు, గ్రౌండ్ లెవెల్ పోలీసింగ్ వ్యవస్థ పటిష్టత, మాదకద్రవ్యాల నిరోధకలమాదకద్రవ్యాల నిరోధనలో పోలీసుల పాత్ర తదితర అంశాలనుగూర్చి వ్యాసరచన పోటీని నిర్వహించి విద్యార్థులతో పాటు వివిధ అంశాలలో ప్రతిభ ను కనబరిచిన పోలీసు అధికారులకు బహుమతుల ప్రధానం గావించడం జరిగింది. ఇందులో భాగంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలను కనబరిచినందుకు ఆమనగల్ ఎస్సై కేహను మంత రెడ్డి, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఫహీము ద్దీన్, ఆర్మ్డ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తదితరుల కుటుంబాలను పోలీసు అధికారులు శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ డిసిపిలు కోటిరెడ్డి, కే సురేష్ కుమార్, రితిరాజ్, యోగేష్, బి.రాజేష్, సాయి శ్రీ, ముత్యం రెడ్డి, సృజనకర్ణం, సాయి మనోహర్, రంజన్ రతన్ కుమార్, శోభన్ కుమార్,అడిషనల్ కమిషనర్లు, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# 'మైత్రి-25' పేరుతో ఆర్ట్, లిటరరీ, కల్చరల్ ఫియస్టా

## ఘనంగా నిర్వహించిన ప్రీమియా అకాడమీ




**ఖైరతాబాద్, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** నగరంలోని విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృ తిక అవగాహనను పెంచే లక్ష్యంతో ప్రీమియా అకా డమీ ఇటీవల 'మైత్రి–25' పేరుతో ఆర్ట్, లిటరరీ, క ల్చరల్ ఫియస్టాను ఘనంగా నిర్వహించినట్లు ప్రీ మియా అకాడమీ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ సిం ధూరి రెడ్డి మంగళవారం నగరంలో విడుదల చేసి న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడు తూ ఒక్కొక్క అడుగుతో భవిష్యత్తుకు బాటలు అనే థీమ్‌తో జరిగిన ఈ వేడుకల్లో నగరంలోని వివి ధ పాఠశాలల నుంచి 300 మందికి పైగా విద్యార్థు లు పాల్గొన్నట్లు తెలిపారు. కళలు,సాహిత్యం, నృ త్యం, థియేటర్ వంటి రంగాల్లో తమ ప్రతిభను చా టేందుకు ఈ కార్యక్రమం విద్యార్థులకు చక్కటి గ్లో బల్ వేదికగా నిలిచిందన్నారు. ఇందులో భాగంగా ఆర్ట్, లిటరేచర్, మ్యూజిక్, డ్యాన్స్, థియేటర్‌లలో మొత్తం 20 రకాల పోటీలు జరిగాయన్నారు.టేల్స్ ఎక్రాస్ బోర్డర్స్, ఐకాన్స్ ఇన్ ది స్పాట్‌లైట్, ఫెస్టివ్ ఫుట్‌స్టెప్స్, గ్లోబల్ బీట్స్, మీనింగ్‌ఫుల్ మూవ్స్ వంటి ఆసక్తికరమైన అంశాలు ఆకట్టుకున్నాయని తెలిపారు.పాల్గొన్న విద్యార్థులు ఒక్కో దేశ సంస్కృ తిని ప్రతిబింబిస్తూ, ప్రీమియా అకాడమీ ప్రాంగణా న్ని వైవిధ్యంతో కూడిన ఒక చిన్న ప్రపంచ గ్రామం గా తీర్చిదిద్దారని చెప్పారు. ఇది విద్యార్థుల్లో భిన్న సంస్కృతులపై అవగాహనను, స్నేహ భావాన్ని పెంపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి, ఫ్యాషన్ డిజైనర్ సిమ్రత్ కౌర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఫైన్ ఆర్ట్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఆమె లైఫ్ ఆఫ్ పై వంటి హాలీవుడ్ చి త్రాలకు వీఎఫ్ఎక్స్ ఆర్టిస్ట్‌గా చేసిన కృషిని వివరిం చి, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు. విద్యా ర్థులను కేవలం చదువులకే కాకుండా ప్రపంచ పౌ రులుగా తీర్చిదిద్దడానికి సృజనాత్మక వ్యక్తీకరణ ఎంత ముఖ్యమో ఈ 'మైత్రి 2025' నిరూపించిం దని తెలిపారు.

# తప్పిన పెను ప్రమాదం

## ఊడిపోయిన చక్రాలు.. కాంట్రాక్టర్ పై మండిపడ్డ ప్రజలు



**చేర్యాల అక్టోబర్ 21 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో సిద్దిపేట – జనగాం జాతీయ రహదారిపై ప్రగతి స్కూల్ దగ్గర ప్రమాదకరమైన గుంతలతో డిసిఎం వాహనం వెనుక చక్రాలు ఊడిపోయాయి. డిసిఎం చక్రాలు ఉడిపో వడంతో ఒక్కసారిగా రోడ్ పై పెద్ద శబ్దం రాడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటనలో డ్రైవర్, క్లీనర్ చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనులు గత రెండు సంవత్సరాల నుండి జరుగుతున్న ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడం, రోడ్డుపై వేసిన బ్రిడ్జ్ పై తార్ వేయకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి, ఇదే స్థలంలో ఇంతకు మునుపు ప్రయాణికులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేయించాలని లేనిపక్షంలో ప్రయాణికుల ప్రాణాలకు కాంట్రాక్టర్, ఎన్.హెచ్ అధికారులు బాధ్యులవుతారని హెచ్చరించారు.

## నిరుద్యోగ యువతకు
# వివిధ కంపెనీలలో జాబ్ మేళా

### జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రియాంక

**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 21 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో శిక్షణ మరియు ఉపాధి కల్పించుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 11:00 గంటల నుండి 2:00 గంటల వరకు ఐ డి ఓ సి లోని ఎఫ్– 30/1 కలెక్టరేట్ నందు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే నిరుద్యోగులు 18 నుండి 35 సంవత్సరాల వయసు కలిగి, విద్యార్హత ఎస్ఎస్సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలని అన్నారు.జాబ్ మేళాలో ఎంపికైన నిరుద్యోగులకు శిక్షణ అనంతరం కర్నూలు, గద్వాల, ఐజ లోని పుష్కల్ ఆగ్రోటిక్ లిమిటెడ్, బజాజ్ చేతక్ ఈ.వి.షో రూం కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలిపారు.ఈ అవకాశాన్ని జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రియాంక కోరారు.

# మంజీరలో స్నానానికి వెళ్ళి ఇద్దరు మృతి

- మృతుల్లో పదవ తరగతి విద్యార్థి
- అందురు చూస్తుండగానే ప్రమాదం



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మహిళా అంత్యక్రి యలకు వెళ్ళి.. మంజీరలో స్నానం చేసేందుకు ఇద్దరు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మెదక్ మండలం పేరూర్ లో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు పేరూర్ కు చెందిన చింతకింది అంజమ్మ మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటిక వద్ద అంత్యక్రియలు నిర్వహించగా అక్కడే ఉన్న మంజీరా నదిలో స్నానం చేసేందుకు పదవ తరగతి విద్యార్థి హరి కృష్ణ (16)తో పాటు అదే గ్రామానికి చెందిన చింతకింది భీమయ్య(48)ఇద్దరు కలిసి వెళ్ళారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా నదిలో పుష్కలంగా నీరు చేరింది. నీటి లోటు గ్రహించిన ఇద్దరు నది మద్యలోకి వెళ్లి స్నానం చేందుకు వెళ్ళారు. అక్కడ లోతుగా గుంతలు ఉండడం తో అందులో మునిగిపోయారు. నది మద్యలోకి వెళ్ళడం మూలంగా ప్రమాదం జరిగిన వెంటనే ఎక్కడికి వెళ్లేందుకు అక్కడే ఉన్నవారికి సాద్యం కాలేదు. దీనితో ఊపిరాడక ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు వెళ్లి అందరితో కలిసి స్నానం చేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదని మృతుడి కుటుంబుకులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఒడ్డుకు తీసి పోస్టుమార్థం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# పోలీసుల బలిదానం దేశానికి గర్వకారణం

- అమరవీరుల త్యాగం చిరస్మరణీయం
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 21 (జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం అని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు.ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించే పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్, ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల బలిదానం దేశానికి గర్వకారణమని కొనియాడారు. పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవని సమాజంలో భద్రత, శాంతిని కాపాడటంలో పోలీసులు నిరంతరం పోరాడుతున్నారని ఆయన అన్నారు. దేశ సరిహద్దుల్లో 1959లో జరిగిన చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 10 మంది వీరుల స్మారకార్థం ఈ రోజును జరుపుకోవడం మనందరి బాధ్యత అని వారి ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఎంతో ఆదర్శమన్నారు. జిల్లా పరిపాలనలో పోలీస్ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని, జిల్లా ప్రజల తరపున అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... దేశ అంతర్గత భద్రతను కాపాడుతూ, చట్టాన్ని అమలు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వీర పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదుని, ప్రజలకు సేవ చేసే మహత్తర అవకాశంగా భావించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మన జవాన్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిది. వారి నిస్వార్థ సేవ మరియు త్యాగాలు జిల్లా పోలీసులకు నిత్య స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన "జాతీయ ఐక్యత దినోత్సవం" అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి సంధార్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోలో విద్యార్థులకు, పోలీస్ అధికారులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు మొదలగు వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చెయ్యాలని జిల్లా ఎస్పి కే. నారాయణ రెడ్డి కోరారు. పోలీస్ పరేడ్ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, అదనపు ఎస్పి బి.రాములు నాయక్ జిల్లా లోని పోలీస్ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల గౌరవ వందనం మద్య జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు.ఇట్టి కార్యక్రమం వికారాబాద్ డిఎస్పి లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ , బాల కృష్ణ రెడ్డి , డిసిఆర్బి డిఎస్పి జానయ్య , డిటిసి డిఎస్పి శ్రీనివాసులు ,ఆర్ డిఎస్పి వీరేష్ ఇన్స్పెక్టర్ లు,ఆర్ఐలు, ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలతో పాటు
# వ్యాపారాలను ఎంచుకోవాలి

### న్యూ డిగ్రీ సెక్రెటరీ గోపీచంద్ మెరుగు



**మొయినాబాద్ అక్టోబర్ 21 (జనంసాక్షి) :** ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు పరిశ్రమలు ఉద్యోగాలతో పాటు ఆర్థిక ఆగంగా అభివృద్ధి చెందుతూ పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా అభివృద్ధి చెందాలని న్యూఢిల్లీ సెక్రెటరీ గోపీచంద్ మెరుగు అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూ పరిధిలో గల అరిస్టాటిల్ పీజీ కళాశాలలో 170 మంది ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల ప్రధా న కార్యక్రమాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.శ్రీనివాస్ రెడ్డి అధ్య క్షతన నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా గోపీచంద్ మెరుగు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ముందుగా కళాశాలలో పట్టాలు అందజేసి ఆయన మాట్లాడుతూ..పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే పలు వురికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన వారు అవుతా రని సూచించారు. జాతీయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించవచ్చునని అన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ భద్రతతో కూడిన నాయకత్వ లక్షణాలు ఉన్న ప్పుడే విజయాన్ని సాధిస్తారని తెలిపారు. కళాశాలలో సాధించడంలో అభినందనీయమన్నారు. గర్వించదగ్గ విషయమని తెలిపారు.

# జనజీవన స్రవంతిలోకి నలుగురు మావోయిస్టులు

- ములుగు జిల్లా ఎస్పీ ముందు లొంగిపోయిన నలుగురు మావోయిస్టులు



**ములుగు బ్యూరో, అక్టోబర్21 (జనంసాక్షి):** ములుగు జిల్లా పోలీసులు చేపట్టిన "పోరు కన్నా ఊరు మిన్న–మన ఊరికి తిరిగి రండి" అనే అవగాహన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అందిస్తున్న పునరావాస సదుపాయాల గురించి తెలుసుకొని నక్సలిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశ్యంతో నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు అజ్ఞాత సాయుధ దళ సభ్యులు (ఇందులో ఇద్దరు మహిళలు,ఇద్దరు పురుషులు) మంగళవారం రోజున ములుగు జిల్లా ఎస్పీ డా. శబరిష్ పి. సమక్షంలో జనజీవన స్రవంతిలో కలవడం జరిగింది. జనజీవన స్రవంతిలో కలిసిన ఈ న లుగురు అజ్ఞాత మావోయిస్టులకు సరెండర్ పాలసీలో భాగంగా తెలం గాణ ప్రభుత్వం నుండి ప్రతి ఒక్కరికీ రూ.25,000 చొప్పున పునరావాస నిమిత్తం నగదు రివార్డును జిల్లా ఎస్పీ అందజేశారు.ఈ సంవత్సరం జనవరి 2025 నుండి ఇప్పటివరకు ములుగు జిల్లాలో మొత్తం 84 మ ంది నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ హొదాల్లో ఉన్న సభ్యులు స్వచ్ఛందంగా ములుగు పోలీసుల సమక్షంలో జనజీవన స్రవంతిలో కలి శారు. వారిలో డివిసిఎంఎస్ ముగ్గురు సభ్యులు,ఏసీఎం 11 మంది సభ్యులు, 60 మంది పార్టీ సభ్యులు, ఒకరు ఆర్పిసి, డిఏకెఎ మ్ఎస్/ కెఏఎంఎస్ఎస్ 02, సిఎన్ఎం 07 మంది ఉన్నారు.వీరందరికీ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తగిన సదుపాయాలు మరియు ఆర్థిక సహాయం అందించడం మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలవమ ంటూ విజ్ఞప్తి చేస్తూ వివిధ పద్ధతుల్లో మాధ్యమాల ద్వారా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు సమాచారం అందించడం జరుగుతుంది.

# అల్కాపురిలో ఘోర రోడ్డు ప్రమాదం

## బాలుడు మృతి




**రాజేంద్రనగర్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో అక్టోబర్ 20న సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రవి కుమార్ (33) తన భార్య అనుష, కుమార్తె ఆవిష్క (5), కుమారుడు కుషాణ్ జోయల్ (2)తో కలిసి మోటార్సైకిల్‌పై వెళుతుండగా, వేగంగా వస్తున్న టాటా నెక్సాన్ కారు (టిఎస్ 09 ఏఇటిఆర్ (2860) వెనుక వైపు నుండి బైకు ను ఢీకొట్టడంతో బాలుడు కుషాణ్ జోయల్ (2) కింద పడిపోయాడు. ఆ తర్వాత వేగంగా వెళుతున్న కారు బాలుడి పైనుంచి దూసుకుపోయింది. దీంతో తీవ్ర గాయాలు అయిన బాలుడ్ని స్టార్ హాస్పిటల్‌లో చేర్పించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులకు స్వల్ప గాయాల య్యాయి. ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# అరకొరగా రాయితీ విత్తనాల పంపిణీ

- ఐదు ఎకరాలున్న ఒకే బస్తా అందజేత
- తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన రైతులు, కౌలు రైతులు





**న్యాల్ కల్, అక్టోబర్ 21, (జనంసాక్షి) :** ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన అధిభారీ వర్షాలతో రైతులు, కౌలు రైతులు ఖరీఫ్ సీజన్ లో సాగుచేసిన పంటలకు అపార నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో సాగుచేసిన పలు పంటల పెట్టు బడులు సైతం చేతికి అందే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం రభి సీజన్ లో నైనా శనగ పంటను సాగు చేసుకుందామనుకునే రైతులకు శనగ విత్తనాల కొరత అధికంగా వేధిస్తోంది. ప్రైవేట్ మార్కెట్ లో శనగ విత్తనాలను కొనుగోలు చేసేందుకు క్వింటాలు శనగ ధర రూ:7500కు పైగా ఉండడంతో.. రైతులు అధిక సంఖ్యలో రాయితీపై పంపిణీ చేస్తున్న శనగ విత్తనాలపై ఆశలు పెట్టుకున్నారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మండలానికి కేవలం (390, 25 కేజీల బస్తాలు) అరకొరగా విత్తనాలు రావడంతో.. ఐదు ఎకరాలు ఉన్న రైతుకు కేవలం 25 కేజీలు గల ఒక శనగ బస్తాను మాత్రమే అందజేయడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం న్యాల్ కల్ లోని రైతు వేదికలో రూ: 3000 ధర ఉన్న శనగ విత్తనాలను 50 శాతం రాయితీపై రూ:1500 చొప్పున పంపిణీ చేశారు. రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న మండలంలోని రైతులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో న్యాల్ కల్ లోని రైతు వేదిక పంపిణీ కేంద్రానికి తరలివచ్చారు. వందల సంఖ్యలో ఉన్న రైతులు, పలు వాహనాలతో పంపిణీ కేంద్రం, ఆవరణ సందడి సందడిగా మారింది. ఉదయం నుండి సాయంత్రం వరకు రైతులకు 1(5 ఎకరాల లోపు), 2 (ఐదు ఎకరాల పైబడిన రైతాంగానికి) చొప్పున 25 కేజీల సామర్థ్యం గల శనగ విత్తనాల బస్తాను పంపిణీ చేశారు. మంజీరా నది పరివాహక ప్రాంతం, సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న రైతాంగానికి సైతం కేవలం 1,2 బస్తాలను మాత్రమే పంపిణీ చేయడం ఏమిటని బాధిత రైతులు వాపోయారు. అవసరం మేరకు రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేయాలని పలువురు రైతులు, కౌలు రైతులు వ్యవసాయ అధికార దృష్టికి తీసు కువెళ్లారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం : ఏఓ**

మండలంలోని రైతాంగానికి 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా 390 (25 కేజీలు) బస్తాలు మాత్రమే వచ్చాయని, ఈ మేరకు ఐదు ఎకరాల లోపు ఉన్న రైతాంగానికి ఒక బస్తా, ఐదు ఎకరాల పైబడిన రైతాంగానికి 2 బస్తాలు చొప్పున పంపిణీ చేశాము. రైతుల విజ్ఞప్తి మేరకు శనికి విత్తనాల కొరత సమస్యను జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఏఓ అభినాష్ వర్మ తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 22 అక్టోబర్ 2025

# ఉదండాపూర్ భూసేకరణ అక్రమాలు బయటపెడతాం

- జరిగిన అక్రమాలపై మరోసారి ఫిర్యాదు చేస్తాం
- గైరాన్, భూదాన్ భూముల పేరిట కూడా అక్రమాలు
- ప్రస్తుతం 23 మంది అక్రమార్కులకు నోటీసులు
- ఫిర్యాదులు నేరుగా లేదా 9392017899 నెంబర్ కు వాట్సాప్ ద్వారా పంపాలి
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ



**జడ్చర్ల, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** ఉదండాపూర్ ప్రాజెక్టులో భాగంగా గతంలో చేసిన భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలన్నీ బయటపెట్టి, బాధ్యులైన ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకొనేలా చూస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించి కొంతమందికి ప్రస్తుతం నోటీసులు వచ్చాయని, వారితో పాటుగా భూములు లేకపోయినా గైరాన్, భూదాన్ భూములపై కూడా పరిహారాలు దిగమింగిన వారందరినీ బయటికి లాగుతామని హెచ్చరించారు. ఈ అక్రమాలకు సంబంధించిన బాధితులు, ప్రజలు కూడా తమ వద్ద ఉన్న సమాచారం కూడా తనకు అందించాలని కోరారు. ఉదండాపూర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పరిహారాల చెల్లింపులో భారీ అవినీతి జరిగిందని, అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని తాను గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసానని మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్ రెడ్డి గుర్తు చేశారు. ఉదండాపూర్ భూసేకరణ పరిహారాల చెల్లింపులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అలా జరిగి ఉంటే అందుకు ఆధారాలు చూపాలంటూ అప్పట్లోనే బీఆర్ఎస్ నాయకులు చెప్పారని తెలిపారు. అయితే ఇదే విషయంగా పోలేపల్లి సర్వే నెంబర్ 554 సర్వే నెంబర్ లో భూములు లేకపోయినా ఎకరానికి రూ.12 లక్షలు చొప్పున అక్రమంగా పరిహారాలు పొందారనే విషయంగా రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఈ ఒక్క సర్వే నెంబర్ మీదనే 23 మంది వ్యక్తులు అక్రమంగా రూ.3.84 కోట్ల రుపాయల పరిహారాన్ని దండుకున్నారని గుర్తించారని వెల్లడించారు. ఈ విషయంగా రెవెన్యూ అధికారిణి పద్మజ నిగ్గు తేల్చిన నిజం ఆధారంగా ప్రస్తుతం 23 మందికి నోటీసులు జారీ చేస్తున్నారని, వారు దిగమింగిన కోట్లాది రుపాయల మొత్తాన్ని రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద వసూలు చేయడానికి చర్యలు చేపట్టారని వివరించారు. ఉదండాపూర్లో జరిగిన అనేక అక్రమాలలో ఇది ఒకటి మాత్రమేనని, ఇంకా బయటకు రావాల్సిన అక్రమాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. ఒకరి పేరిట ఉన్న పట్టా భూముల పరిహారాన్ని మరొకరి ఖాతాలోకి బదిలీ చేయడం, అసలు పట్టాదారులకు మొండి చేయి చూపడం మాత్రమే కాకుండా గైరాన్, భూదాన్ లకు సంబంధించిన భూముల పేరిట కూడా అక్రమార్కులు కోట్లు దండుకున్నారని విమర్శించారు. జరిగిన ఈ అక్రమాలన్నింటినీ బయటకు తీసుకొస్తామని, అక్రమార్కులపై చర్యలు తీసుకొనేలా చూస్తానని ప్రకటించారు. ఈ అక్రమాలన్నీ అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతల అండదండలతో, అప్పుడు పని చేస్తున్న రెవెన్యూ అధికారులే చేసారనే విషయం తన దృష్టికి వచ్చిందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. అప్పట్లో జడ్చర్ల తహసీల్దార్ గా పని చేసిన లక్ష్మీనారాయణ, ఆర్.ఐ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోనే ఈ అక్రమాలు యథేచ్ఛగా జరిగాయనే ఆరోపణలు కూడా తనకు ప్రజల ద్వారా వచ్చాయని తెలిపారు. పోలేపల్లిలో సర్వే నెంబర్.554 లోజరిగిన అక్రమాలపై 23 మంది ప్రైవేటు వ్యక్తులతో పాటుగా అప్పటి తహసీల్దార్, ఆర్ఐలకు కూడా షోకాజ్ నోటీసులు వచ్చాయని తనకు తెలిసిందన్నారు. ఉదండాపూర్ భూసేకరణలో అధికారులు, బీఆర్ఎస్ నేతల అక్రమాల కారణంగా నష్టపోయిన బాధితులు, వీటికి సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు కూడా జరిగిన అక్రమాలకు సంబంధించిన వివరాలను తనకు అందించాలని అనిరుధ్ రెడ్డి కోరారు. తమకు తెలిసిన సమాచారాన్ని క్లుప్తంగా కాగితాలపై రాసి తనకు నేరుగా అందజేయాలని, తాను అందుబాటులో లేకపోతే తన క్యాంపు కార్యాలయంలో ఉండే పీఆర్వోకు నేరుగా లేదా వాట్సాప్ నెంబర్. 9392017899 ద్వారా గానీ సమాచారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఉదండాపూర్ అక్రమాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని తాను ప్రభుత్వానికి మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు అనిరుధ్ రెడ్డి వివరించారు.

## క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



**వీపనగండ్ల, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో వీపనగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్ 5 క్రికెట్ క్రీడలు ను వివిధ పార్టీల నాయకులు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా జరిగే పాముకాటు గంగమ్మ జాతర విపిఎల్ సీజన్ 5 గ్రామ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ క్రీడలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ గోదల బీరయ్య, కాంగ్రెస్ నాయకులు ఎస్ రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ముంత మల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విపిఎల్ సీజన్ 5 క్రికెట్ లీగ్ నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువతకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచి చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు ప్రతి దీపావళి గంగమ్మ జాతర సందర్భంగా ఈ క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. క్రీడాకారులు స్నేహపూర్వకంగా మానసిక ఉల్లాసంతో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదయ్య, పాము నాగులు, నిర్వాహక సభ్యులు మునిగొండ గోపి, మధుగని అంజి, రాఘవేందర్ రెడ్డి, భత్తుల కిట్టు, దాసు, చాపల సాయిబాబు, దామోదర్, బాలకృష్ణ, మండ్ల బాబు, క్రీడాకారులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు రక్షించాలని వినతి



**వీపనగండ్ల, అక్టోబర్ 22 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండలం పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాకు గురవుతున్నాయని భూములను రక్షించి గ్రామంలోని ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించాలని తహసిల్దార్ వరలక్ష్మికి గ్రామ ప్రజలు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని కొన్ని వర్గాలకు చెందినవారు ప్రభుత్వ భూములను తమ వారసత్వ హక్కుగా భావిస్తూ అనుభవిస్తున్నారు ఆరోపించారు. మండల తహసిల్దార్ వెంటనే కబ్జాకు గురవుతున్న భూములను చట్టపరంగా రక్షించాలని అన్నారు. బిజ్జా జగదీష్ తిరుపతయ్య, నాగరాజు, కేశవులు, సహదేవ్, వి నరేష్, బాపనపల్లి నాగరాజు, శశికపూర్ తదితరులు వినతి పత్రం అందించారు.

# నల్లకుంట నుండి వచ్చిన వర్షపు నీళ్లను తొలగిస్తాం

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నల్గొండ రోడ్ లోగల శివజ్యోతి నగర్, ముత్యాలమ్మ దేవాలయం పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న జనావాస ప్రాంతాలను పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్ సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి సందర్శించారు. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నల్లకుంట పూర్తిగా నిండడంతో నల్లకుంట నుండి నీళ్లు జాలువారి జనావాస ప్రాంతాల్లోకి చేరాయి. ముత్యాలమ్మ బజార్, శివజ్యోతి నగర్ ఏరియాలలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం తోపాటు నూతనంగా వేసిన సిసి రోడ్డు ఎత్తు ఉండడంతో నల్లకుంట నుండి వచ్చిన నీళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో అక్కడ నివాసముంటున్న ప్రజలు నల్లకుంట నుండి వచ్చిన నీళ్లతో భయాందోళనకు గురవుతున్నారు. కుంట కట్టను పూర్తిగా పరిశీలించిన అనంతరం పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్ మాట్లాడుతూ శివజ్యోతి నగర్, కుంటకట్ట ఏరియాలో నివాసముంటున్న ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుంటకట్ట నుండి వచ్చిన జాలు నీళ్లను, చెత్తను పూర్తిగా తొలగిస్తామని భవిష్యత్తులో కూడా నీళ్లు నిలువ ఉండకుండా పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతానికి నిలిచిన నీళ్లను తాత్కాలికంగా బయటికి వెళ్ళేటట్లు సీసీ రోడ్డు మధ్య నుండి సంపులను ఏర్పాటు చేస్తామన్నారు. నిలిచిన నీళ్లు పూర్తిగా తొలగిన తర్వాత మళ్లీ ఒకసారి పూర్తిగా పరిశీలించి శాశ్వతంగా డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు. నల్గొండ రోడ్ లో ప్రధాన రహదారి వెంటఉన్న వ్యాపారస్తులు నీళ్లను రోడ్లపైకి రాకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వ్యాపార లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. నూతనంగా ఇండ్ల నిర్మాణం చేసుకునే వాళ్ళు గ్రామ పంచాయతీ అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ స్థలాలను, రహదారులను కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎక్కువ ఫ్లోర్లను నిర్మిస్తే కూల్చేస్తామన్నారు.



## అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. మంగళవారం గట్టు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు,సిబ్బంది పనితనం, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన మార్గదర్శక సూచనలు ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సహజ ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని, గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్,చెక్ అప్ వంద శాతం పూర్తిచేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై శ్రద్ధ చూపి,హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్యూబర్క్లోసిస్, మధుమేహం, రక్తపోటు స్క్రీనింగ్ టెస్టులు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగులపై ప్రత్యేక దృష్టి పెట్టి,వారికి మెరుగైన, సౌకర్యవంతమైన వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని ఆయన సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలోని స్టెరిలైజేషన్ రూమ్ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని రిజిస్టర్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందిస్తున్న సేవల రోగులు సంతృప్తికరంగా ఉన్నాయని తమ భావాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్య ప్రకాష్,వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** ఖరీఫ్ 2025-26 సీజన్ కు సంబంధించి ఏర్పాటు చేయబోయే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు బుధ, గురువారాల్లో ధాన్యం కొనుగోళ్లపై పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ తన ఛాంబర్ లో పీపీసీల ఏర్పాటు, పీపీసీల ఇన్చార్జిలకు శిక్షణకు సంబంధించి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సీజన్ కు సంబంధించి ఏర్పాటు చేయబోయే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు ధాన్యం కొనుగోళ్లపై పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓ ల ఆధ్వర్యంలో పీపీసీ ల ఇన్చార్జి లకు ఎఫ్ ఎ క్యూ ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని గుర్తించడం, తేమ శాతాన్ని నిర్ధారించడం, సన్న దొడ్డు రకాలను గుర్తించడం వంటి అంశాలపై సరైన అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ పంట వచ్చే సమయానికి అనుకూలంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా గత సీజన్లో ఏర్పాటుచేసిన సన్న దొడ్డు ధాన్యం కేంద్రాల వివరాలను పరిశీలించి ఈసారి ఏర్పాటు చేయబోయే కేంద్రాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, డి సి ఓ రాణి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీసు అమరవీరులకు ఘనమైన నివాళి ఘటిస్తూ వారి స్మృతిలో పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఎస్పీ కె.నరసింహతో కలిసి పోలీసు అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, వారి సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో అమరులైన కానిస్టేబుల్ లింగయ్య, హోంగార్డు మహేశ్వర్ కుటుంబాలకు 200 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని కేటాయించి వారికి పట్టా అందించారు. జిల్లాలో అమరులైన హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్, కానిస్టేబుల్ లింగయ్య, హోంగార్డు మహేశ్వర్ పిల్లలకు చదువుల ఖర్చులకు గాను జిల్లా కలెక్టర్ నిధుల నుండి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా శాంతిభద్రతల రక్షణ ప్రజల రక్షణలో విధులు నిర్వర్తిస్తూ అసాంఘిక శక్తుల చేతుల్లో అమరులైన 191 మంది పోలీసు జవాన్లను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల బాధ్యత రోజురోజుకు పెరుగుతుందన్నారు. బాధ్యతలకు అనుగుణంగా పోలీసు సిబ్బంది కూడా అన్ని పరిస్థితులకు ఎదురు నిలుస్తూ జిల్లాలో పోలీసు సిబ్బంది బాధ్యతగా విధులను నిర్వర్తిస్తున్నారని అన్నారు. దేశంలో,రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా జీవించాలంటే పోలీసు సిబ్బంది,పోలీసు విధులకు సహకరిస్తూ వారి కుటుంబాలు కూడా త్యాగాలు చేస్తున్నాయని అన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలు చీరస్మరణీయం అన్నారు. పోలీస్ సిబ్బంది ప్యాషన్ తో పనిచేస్తున్నారని, ప్రజలకు ఎల్లప్పుడూ రక్షణ కల్పించడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లాలో ఉన్న పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ సహకారాలు అందించడానికి ఎస్పీతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లాలో నేరస్తుని దాడిలో అమరుడైన కానిస్టేబుల్ ప్రమోద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రజల తరఫున జిల్లా పోలీస్ శాఖ తరపున ఘనమైన నివాళి ఘటిస్తున్నానని తెలిపారు. నేటి ప్రశాంత సమాజం పోలీసు అమరవీరుల ప్రాణాల త్యాగ ఫలితమేనని అన్నారు. శాంతిభద్రతలను కాపాడుటలో పోలీసులు 24 గంటలు నిర్విరామంగా పనిచేస్తూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నక్సలైట్ల ప్రభావం తగ్గడంలో, తగ్గించడంలో పోలీసుల వీరోచిత కృషి,పోలీసుల ప్రాణ త్యాగ ఫలితమే అన్నారు. ప్రభుత్వ సహాయంతో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మున్ముందు కూడా శాంతి భద్రతలను కాపాడటంలో ప్రాణాలను సైతం లెక్క చేయక పని చేస్తామన్నారు. గుండెలు పిండేసే సంఘటనను సైతం లెక్క చేయక అసాంఘిక శక్తులు తో పోరాడి కుటుంబాలను సైతం వదిలి వీరోచిత పోరాటం చేశారని అన్నారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31 వరకు నిర్గహించే పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు అందరూ భాగస్వామ్యమై అమరవీరులకు నివాళులు అర్పించాలని కోరారు. స్మృతి పరేడ్ కమాండర్ గా ఆర్ఎస్ఐ అశోక్ వ్యవహరించగా, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి 191 మంది పోలీస్ అమరుల పేర్లను స్మరించారు. పోలీసు కళాబృందం వారు సాంస్కృతిక కార్యక్రమాలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నర్సింహ చారి రవి, ఏవో మంజు భార్గవి, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, సిఐలు శివశంకర్, రాజశేఖర్, నాగేశ్వరరావు, నరసింహారావు, వెంకటయ్య, రామకృష్ణా రెడ్డి, ప్రతాప్, అధ్యక్షులు రామచందర్ గౌడ్, అర్ఎస్సైలు ఎం.అశోక్, కె.అశోక్, సురేష్, సాయిరాం, రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే నిజమైన విజయం

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన గ్రూప్-1 విజేత సబిరెడ్డి సుదీప్ రెడ్డి ఇటీవల వెలువడిన ఫలితాల్లో డీఎస్పీ( డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్) హోదాకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సుదీప్ రెడ్డి ,జిల్లా ఎస్పీ రావుల గిరిధర్,ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, భవిష్యత్తు సేవల కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవ ప్రజల నమ్మకాన్ని గెలుచుకునే సదవకాశం. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, క్రమశిక్షణతో, సేవాభావంతో ప్రజలకు సేవ చేయడం ద్వారానే నిజమైన గౌరవం లభిస్తుంది. పోలీసు అధికారిగా మీరు రాబోయే కాలంలో ప్రజలలో విశ్వాసాన్ని నెలకొల్పి, శాఖకు గౌరవం తీసుకురావాలని కోరుకుంటున్నాను. అలాగే యువత కష్టపడి సాధించిన విజయాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మనం చేసే ప్రతి నిర్ణయం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తుంది కాబట్టి, బాధ్యతతో పని చేయాలి. మీ విజయాలు మరిన్ని యువతకు ప్రేరణగా నిలవాలని భవిష్యత్తు సేవల కోసం శుభాకాంక్షలు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది, సబి రెడ్డి వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల స్తూపం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమరులైన పోలీసుల ముఖ చిత్రాలతో ఏర్పాటు చేయడం తెలంగాణలోనే ప్రథమంగా ఉండటం విశేషం. స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్చాలతో స్తూపం వద్ద నివాళులు అర్పించారు. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య అమరవీరులను మనస్ఫూర్తిగా స్మరించుకున్నారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం, దేశ రక్షణలో విధి నిర్వహణమే ముఖ్యంగా అసువులు బాసిన 191 మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్రావు చదువుతూ వినిపించారు. మొదటగా ఉన్నతాధికారులు అందరూ కలిసి స్తూపం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి శోక్ శస్త్ర శ్రద్ధాంజలి ఘటించి, ద్వారా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన మరియు పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తాందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఎస్పీ లు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని తెలియజేశారు. పోలీసులు నిస్వార్థమైన సేవలను అందిస్తారని వారికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకుంటూ వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయాలని వారి కుటుంబ సభ్యులను సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని తెలియజేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నందు 50 మంది పోలీసు అధికారులు సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది యొక్క కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. అసువులు బాసిన పోలీసు ప్రతి ఒక్కరి స్ఫూర్తి బాటలో జిల్లా పోలీసు యంత్రాంగం కొనసాగుతుందని తెలియజేశారు. జిల్లాలోని అమరవీరులను, వారి త్యాగాలను స్మరించడానికి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లా హెడ్ క్వార్టర్స్ నందు వారి ముఖ చిత్రాలతో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు అదనపు ఎస్పి ఆపరేషన్ బి సురేందర్ రావు,డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, కమతం ఇంద్ర వర్ధన్, డిఎంహెచ్వో నరేంద్ర రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, ఆర్టీసీ ఆర్ఎం భవాని ప్రసాద్, రెండవ బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరులు ప్రజల గుండెల్లో ఉంటారు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో,అక్టోబర్ 21 (జనం సాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయం నిలిచిపోతారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 191మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గోన్న వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు,వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా.సత్య శారద , స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి వరుణ్ రెడ్డి,ఎన్ సి సి గ్రూప్ కమాండర్ కర్నల్ సచిన్ అన్నారావు, కర్నల్ రవి,డిసిపి అంకిత్ కుమార్, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, ప్రభాకర్ రావు శ్రీనివాస్, బాలస్వామి,రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఈ. వి శ్రీనివాస్ రావుతో పాటు ఏ.సి.పిలు, ఇన్స్ స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్. ఐలు పోలీస్ . అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాగుచ్చాలు వుంచి నివాళులు అర్పించిన పిదప, ఆర్.ఐ స్పర్జన్ సారధ్యంలో సాయుధ పోలీసులు 'శోక్ శస్త్ర చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సేవకోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు మహానుభావులని, పోలీసు అమరవీరుల చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ, ప్రజల శ్రేయస్సు కోరకు పాటుపడాలని, ప్రజల్లో మంచి పేరు రావాలంటే చిత్తశుద్ధి, నీతి, నీజాయితీతో పనిచేయాల్సి వుంటుందని పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే వుంటారని, వారు మన మధ్య లేనకున్నా మనం వారిని స్మరిస్తునే వుంటామని, అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవల్సిన భాధ్యత మనందరిపై వుందని, వారికి ఎలాంటి సమస్య వున్న వారికి పోలీస్ విభాగం తరుపున పూర్తి సహకారం అందజేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి మిషన్ హస్పటల్ వరకు నిర్వహించిన ర్యాలీలో శాసన సభ్యులు, పోలీసులు, అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళాబృందం సభ్యులు పాల్గోని పోలీసు అమరవీరులకు జోహర్లు అర్పించారు.



# నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించిన ఐజీ ఎస్ చంద్రశేఖర్ రెడ్డి

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్21 (జనంసాక్షి) :** మల్టీ జోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆయనకు పూలమొక్క అందజేశారు. అనంతరం జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, పోలీస్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ జిల్లా పోలీస్ అధికారులతో సమావేశమై, అడిషనల్ ఎస్పీలకు, ఏ ఎస్పీ లకు,ఇన్స్పెక్టర్లకు వివిధ అంశాలపై దిశానిర్దేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతిభద్రతలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల భద్రత కోసం పోలీసులు అహర్నిశలు కృషి చేస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు.

# పివిటీజి ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ



- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నెరడిగొండ అక్టోబర్21 (జనంసాక్షి):** మండలంలోని చించొలి గ్రామంలో మంజూరు అయిన 48 పివిటిజి ఇండ్ల మంజూరు పత్రాలను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లబ్ధిదారులకు అందజేశారు.గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలందరికీ ఇండ్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో శేఖర్ నాయకులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ జంగు రాథోడ్ సురేందర్, అనిల్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి సుజీల్ కేమ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ - 2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

- ఈ నెల 25న ముగియనున్న సర్వే
- జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్




**మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 21(జనం సాక్షి):** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ - 2047 సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారని జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ - 2047 సిటిజన్ సర్వేను చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుందని, ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున **www.telangana.gov.in/telanganarising** అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సిందిగా అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పోలీస్ అమరవీరులకు ఘననివాళి



**ములుగు బ్యూరో,అక్టోబర్21(జనం సాక్షి):** విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసి అమరులైన పోలీసులకు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి అమరవీరుల కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీస్ అధికారులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మనం పోలీస్ ఫ్లాగ్ డే ను గంభీరంగా పాటిస్తున్నాము.ఈరోజు మన దేశశాంతి భద్రత కోసం ప్రజల రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించుకునే రోజు 1959 అక్టోబర్ 21 రోజు లడాకులోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా దళాల దాడిలో పదిమంది ధైర్యవంతులైన భారతీయ పోలీసులు సరిహద్దులను కాపాడుతూ వీరమరణం పొందారు ఆ ఘటన స్మారకార్థంగా ప్రతి సంవత్సరం ఈరోజు దేశవ్యాప్తంగా పోలీస్ ఫ్లాగ్ డే ని నిర్వహిస్తాము.ఈరోజు మనం తలవంచు ఆ వీరుల త్యాగానికి నివాళులు అర్పిస్తున్నాము.వారి పేర్లు స్మారక స్థూపాలపై చెక్కబడి ఉంచవచ్చు కానీ వారి ఆత్మ వారి ధైర్యం వారి సేవ మనందరిలో సజీవంగా ఉన్నాయి.పోలీస్ సేవ అనేది ఉద్యోగం కాదు అది ఒక బాధ్యత,త్యాగం మరియు ప్రజాసేవ పట్ల అంకితభావం.ప్రతి పోలీస్ అధికారి విధులకు బయలుదేరినప్పుడు భద్రత కోసం కృషి చేయడానికి తమ ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రజల భద్రత కోసం కృషి చేయడానికి సిద్ధంగా ఉంటాడు.ఇదే మన వృత్తి యొక్క మహత్యం.ములుగు జిల్లా సవాళ్లతో కూడిన అడవి ప్రాంతాలు మావోయిస్టు ప్రభావిత మండలాలు మరియు దూర గ్రామాలు ఉన్నప్పటికీ మావోయిస్టు ప్రజలతో మండలాలు మరియు దూర గ్రామాలు ఉన్నప్పటికీ మన సిబ్బంది ధైర్యంగా నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నారు.శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నిరోధం వరదలు మరియు అత్యవసర పరిస్థితులలో ప్రజలకు సహాయం చేయడంలో ములుగు పోలీసులు నిరంతరం ముందంజలో ఉన్నారు.ఈ రోజు మనం పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిలబడి త్యాగాన్ని స్మరించి వారి పరంపరను కాపాడటానికి మనం అందరం ప్రతిజ్ఞ చేద్దాం.మన బాధ్యతలను నిజాయితీ క్రమశిక్షణ,కరుణ మరియు నైతిక భావంతో నిర్వర్తిద్దాం ఎందుకంటే మన అమరులు విలువల కోసం తమ ప్రాణాలను అర్పించారు.మన అమరుల కుటుంబాలకు మనస్ఫూర్తిగా మన గౌరవం మరియు సానుభూతి.మీ త్యాగం అమూల్యం. పోలీస్ విభాగం ఎల్లప్పుడూ మీతో తోడుగా ఉంటుంది.ఈరోజు మన బలం ఐక్యతలో ఉన్నది మన శక్తి నిజాయితీలో ఉన్నదని మన ధ్యేయం ప్రజాసేవలో ఉన్నదని గుర్తు చేస్తున్నది మన అమరుల త్యాగం మనకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజల భద్రత కోసం అదే ధైర్యం అదే అంకితభావంతో సేవ చేయడానికి మనం ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. జైహింద్" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.ఆ తరువాత ములుగు డిఎస్పి రవీందర్ 2024 సంవత్సరం నుండి 2025 వరకు దేశవ్యాప్తంగా ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల వివరాలను తెలియజేస్తూ వారికి స్మరిస్తూ నివాళి అర్పించారు.తదనంతరం జిల్లా ఎస్పి పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛంతో నివాళులు అర్పించారు. అదే విధంగా అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లా పోలీస్ యంత్రాంగం, అందరూ పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించారు. తదనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ పోలీస్ శాఖ తరపున బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులు, డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్, ములుగు డిఎస్పి రవీందర్,సిఐలు శ్రీనివాస్ దయాకర్, సురేష్,రమేష్,ఆర్యలు స్వామి,సంతోష్ తిరుపతి,వెంకటనారాయణ,ఎస్సైలు ఆర్ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- ఎమ్మెల్యే గండ్ర, ఎస్పీ కిరణ్ ఖరే
- భూపాలపల్లిలో ఘనంగా పోలీసు అమరుల స్మారక దినోత్సవం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పోలీసు అమరువీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్ ఖరే లు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్మృతి పరేడ్, రక్తదానం, పోలీసు అమరుల త్యాగానికి నివాళులు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా పోలీస్ అధికారి కిరణ్ ఖరేలు హాజరై మాట్లాడుతూ దేశానికి సేవ చేస్తూ ప్రాణత్యాగం చేసిన నిజమైన వీరులను స్మరించుకునే రోజు ఇదని, వారి త్యాగం ఎప్పటికీ మరచిపోలేనిదని అన్నారు. పోలీసు అమరవీరులు దేశానికి చేసిన సేవ అనితర సాధ్యం అని, వారి త్యాగం వల్లనే సమాజం శాంతియుతంగా కొనసాగుతోందని అన్నారు. ప్రతి రోజు వారి సేవలను స్మరించుకుంటూ మరింత నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారికి ఎస్పీ ధైర్యం చెప్పి సత్కరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే, ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ స్వయంగా రక్తదానం చేయడం ద్వారా ఇతరులను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపిఒ సిబ్బంది, పోలీస్ సంఘం అధికార ప్రతినిధి యాదిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 21, (జనంసాక్షి) :** విధి నిర్వహణలో పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామ గుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డి సి పి కరుణాకర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి హాజరై అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు . అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగాలకు వెనుకాడకుండా సేవలు అందించే పోలీసులు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల రక్షణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు ఆచరించిన మార్గం స్ఫూర్తితో ప్రజల శ్రేయస్సుకు కృషి చేయాలని, చిత్తశుద్ధి, నీతి, నిజాయితీతో పని చేయాలని, పోలీసు అమరుల త్యాగాలు మరువలేమని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పోలీసు అమరుల కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వారికి ఎలాంటి సమస్య రాకుండా అండగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డి సి పి (అడ్మిన్) శ్రీనివాస్, మంచిర్యాల ఎ. సి. పి. ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏ ఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, సి పి ఓ, స్పెషల్ పార్టీ, ఏ. ఆర్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**పాలకుర్తి, అక్టోబర్ 21(జనంసాక్షి) :** వరితో పాటు వేరుశనగా, ఇతర ప్రత్యన్మయ పంటలను సాగు చేసి ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆహార భద్రత పోషణ పథకం లో బాగంగా వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేం ద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వ ఆహార భద్రత పోషణ పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతులలో గుణాత్మక మార్పులు రావాలని కోరారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు అవలంబించుకోవాలన్నారు. నూనె గింజల సాగు ఉత్పత్తిని పెంచేందుకు రైతులు వేరుశనగా పంటను సాగు చేయాలని దీంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సూచించారు. రైతులు తాము పండించిన వరి. పత్తి పంటలను మార్కెట్ అమ్ముకోవడానికి ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. తద్వారా రైతులు తాము పండించిన పంటలను జిల్లాలోని 12 కొనుగోలు కేంద్రాలలో ఎక్కడైనా అమ్ముకోవచ్చునన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ పథకాన్ని సమర్థవంతం గా వినియోగించు కోవాలని అన్నారు.

## మత్స్యకారుడి వలకు చిక్కిన భారీ బొచ్చ చేప..!



**పి.ఏ.పల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలం అక్కంపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నందు మత్స్యకారుడు కూరాకుల చిన్న ముత్యాలు కు మంగళవారం భారీ బొచ్చ చేప వలకు చిక్కింది.ముత్యాలు చేపలు పట్టడానికి వెళ్లగా ఏకంగా 30 కిలోల బరువు ఉన్న బొచ్చ చేప వలలో పడడంతో అతని ఆనందానికి అవధులు లేవు.అరుదైనా చేప వలలో పడడంతో స్థానికులు,తోటి మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.వలలో పడిన చేపను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. 30 కిలోల బరువు ఉన్న చేపను 6000 వేల రూపాయలకు ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు.ఇలాంటి చేప చాలా అరుదుగా వలలో పడుతుందని వారు అంటున్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులు తీసుకువెళ్లిన నాలుగు ఆటోలు సీజ్



**హాలియా, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమితికి మించి కూలీలను ఎక్కించుకున్న నాలుగు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. ఆటోలకు ఇన్సూరెన్స్, లైసెన్స్ లేకుండా నడుపుతున్నట్లు గుర్తించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి భద్రంగా ప్రయాణించాలన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భవ్యశ్రీ లక్ష్మీకి ఘన సన్మానం



**అశ్వరావుపేట, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో సత్తా చాటి నేషనల్ కి సెలెక్ట్ అయిన స్థానిక రిపోర్టర్ కేశిబోయిన వీరాంజనేయులు రమాదేవి దంపతుల కుమార్తె భవ్యశ్రీ లక్ష్మీ ని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఇలాంటి విజయాలు ఎన్నో సాధించాలని తల్లిదండ్రులకు, అశ్వారావుపేట కు ఇంకా మంచి పేరు తీసుకు రావాలని కోరుతున్నాము అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ ప్రెసిడెంట్ సత్యవరపు బాలగంగాధర్, రీజనల్ చైర్మన్ బోగవల్లి రాంబాబు, కోశాధికారి కుమార్ రాజా, మాజీ అధ్యక్షులు జల్లిపల్లి దేవరాజు, శీమకుర్తి సుబ్బారావు, బొమ్మ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్యశాలలో ఉత్తమ సేవలు అందాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**రేగోడ్, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా రేగోడు మండలంలోని పశువైద్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలు గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. పశువులకు అందిస్తున్న టీకాలు, నులిపురుగుల నిర్మూలన తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాలయంలో అందించే సేవలపై ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. మంగళవారం గట్టు మండలంలోని ఆలూరు గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన ఇండ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు.ఇంటి నిర్మాణం పనులలో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ సెక్రటరీ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుని ఇల్లు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక మట్టి అందించే విధంగా కృషి చేయాలని అధికారులకుసూచించారు. లబ్ధిదారులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్లను నిర్మించడానికి అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు.లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వ నిధులను ఎప్పటికప్పుడు డబ్బులు వారి ఖాతాకు జమ చేయాలని కలెక్టర్ తెలిపారు. టెక్నికల్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పనులను పూర్తి చేసే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని అన్నారు.జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల నుండి ఇళ్ల నిర్మాణానికి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకొని, పనులను వేగంగా పూర్తి చేయాలని,దశలవారీగా డబ్బులు ఖాతాలో వెంటనే జమ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ



చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక

- చదువుతో పాటు క్రీడలలో రాణిస్తున్న విద్యార్థి

**పి.ఏ.పల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** ఈ నెల 16న మెదక్ జిల్లా పఠాన్ చెరువులో జరిగిన 69వ ఎస్జిఎఫ్ అండర్ 14 కబడ్డీ క్రీడలలో నల్గొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రమావత్ గణేష్ కబడ్డీ క్రీడలో రాణించి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు.ఛత్తిష్ ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనబోతున్నాడు.నల్లగొండ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ జిల్లాను ద్వితీయ స్థానంలో నిలిపి అద్భుతంగా రాణించిన గణేష్ జిల్లా బెస్ట్ రైడర్ అవార్డు సైతం పొందాడు.గత సంవత్సరం 68వ ఎస్ జి ఎఫ్ క్రీడల లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యి జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు.ఇటీవల నిజామాబాద్ జిల్లా ముగ్పాల్‌లో జరిగిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో జిల్లాను తృతీయ స్థానంలో నిలపడంలో తన వంతుగా పాత్ర పోషించాడు.యువకుడు నల్గొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం అంగడిపేట తండా చెందిన రమావత్ గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పి.ఏ.పల్లిలో విద్య అభ్యసిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి



చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, నర్సిరెడ్డి జీవన్ కుమార్, వెంకటమ్మ,శ్రీను, బాలకృష్ణ,హరికృష్ణ, వెంకటేశ్వర్లు, యాదయ్య, నాగమణి,నియమత్,సువర్ణ, సరిత,సృజన,అప్రోజ్, అంజయ్య, గణేష్‌ను వీరికి కోచ్ గా ఎన్నో మెలుకువలు నేర్పినందుకు సిహెచ్ యల్లయ్య , తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్నేహితులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



**మల్దకల్, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** కె.టి దొడ్డి మండలంలోని పాగుంట వెంకటాపురం గ్రామంలోనిలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలుజాతర సందర్భంగా మంగళవారంగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.దేవాలయంలో ఎమ్మెల్యేకి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యేను ఆలయ ఈఓ పురేందర్ శాలువాతో సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పాగుంట జాతర ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా నిర్వహించాలిని,జాతరకు వచ్చే వివిధ ప్రాంతాలలోని భక్తులకు, ప్రజలకు అన్ని వసతులను కల్పించాలి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు,మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్,జెడ్పిటిసి రాజశేఖర్,మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు,సింగిల్ విండో డైరెక్టర్ రఘుకుమార్ శెట్టి,మాజీ సర్పంచ్ ఆంజనేయులు,పార్టీ నాయకులు ఉరుకుందు, యుగంధర్ గౌడ్,వెంకటన్న గౌడ్,శేఖర్ రెడ్డి,నవీన్ రెడ్డి, శ్రీధర్,చంద్రశేఖర్,రాజేష్, గోపాల్ రెడ్డి,ఈవో పురేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** నవమాసాలు మోసిన తల్లి తన చిన్నపిల్లలకు చిన్న గాయమైతే తట్టుకోలేని కన్నతల్లి తన చేతులతోనే వారికి మరణ శాసనం రాసింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న తన ఇద్దరు పిల్లలను దీపావళి పండుగ పూట అతికిరాతకంగా చంపి తాను ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో జరిగింది. దీపావళి పండుగను అన్ని ప్రాంతాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రజలందరూ ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకుంటున్న రోజు విషాద ఘటన జరిగింది. భర్తతో కుటుంబ కలహాల కారణంగా ఇద్దరు అమాయక పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు చుట్టుపక్కల వారు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా జనగాల గ్రామానికి చెందిన కుంచాల రమేష్ నాగలక్ష్మి కుటుంబం గత మూడు సంవత్సరాల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి ఒక కిరాయి ఇంట్లో నివాసం ఉంటూ మేస్త్రి పని చేసుకుంటున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె అవంతిక (9), కుమారుడు భవన్ సాయి (7). చాలాకాలంగా తన భర్త కుంచాల రమేష్ తో భార్య నాగలక్ష్మి కి అంతర్గత గొడవలు జరుగుతున్నాయి. భార్యాభర్తల గొడవలు తారస్థాయికి చేరడంతో భర్త ఇంటి నుండి కోపంతో బయటికి వెళ్లిపోయాడు. అనంతరం తన భార్య నాగలక్ష్మికి ఫోన్ చేసి నేను చనిపోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసాడు.



చాలాసేపు భర్త ఫోన్ కోసం ప్రయత్నించిన భార్య క్షణికావేశంతో తను చనిపోవాలని భావించింది. తాను చనిపోతే తన పిల్లలను ఎవరు చూసుకుంటారని ఆలోచించి అభంశుభం తెలియని ఇద్దరు పిల్లలను కూడా తనతో పాటు తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది. తన ఇద్దరు పిల్లలను గొంతు నలిపి అతికిరాతకంగా చంపేసి ఆ తర్వాత తాను ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం చాలా సమయం అయినా తలుపులు తీయకపోవడంతో పొరుగింటి వాళ్లకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తీసి చూస్తే దారుణం వెలుగులోకి వచ్చింది. మృతురాలు తండ్రి పెద్ద రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నవీన్ కుమార్ తెలిపారు.

## మధిరకు దక్కనున్న మరో గౌరవం..!

- వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డినీ వరించునున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి..?



**మధిర, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** మధిర ప్రాంతం ఎంతో రాజకీయ చైతన్యాన్ని కలిగి రాష్ట్రంలోనే విభిన్న పరిస్థితులు కలిగిన ప్రాంతంగా చరిత్ర ఉంది. ఇంతటి చరిత్ర కలిగిన మధిర నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ద్వారా మరో అరుదైన గౌరవం దక్కబోతుంది. మధిర మండలం మడపల్లి గ్రామానికి చెందిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి భట్టి విక్రమార్క ముఖ్య అనుచరుడిగా విశ్వసనీయతకు నిబద్ధతకు ఆశించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వరించబోతోంది విషయం తెలిసిన మధిర నియోజకవర్గ ప్రజలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. భట్టి విక్రమార్క వెంట గత 20 సంవత్సరాలుగా పార్టీ పిలుపుమేరకు విధేయతతో పనిచేస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య భూమిక పోషించారు. కాంగ్రెస్ పార్టీలో నీతి నిజాయితీగా నిబద్ధతగా పనిచేసిన వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి రాబోతుందన్న విషయాన్ని తెలుసుకున్న నాయకులు కార్యకర్తలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రాజకీయాలు మరింత మెరుగా తీర్చిదిద్దేందుకు బట్టి విక్రమార్క వారి ముఖ్య అనుచరులైన వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కట్టబెట్టబోతున్నందుకు ప్రజల్లో హర్షద్వానాలు రేకెత్తుతున్నాయి.

## తాగునీటి కోసం తండ్లాతున్న చంద్రుగొండ జిల్లా పరిషత్ విద్యార్థులు

- పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు

**చంద్రుగొండ, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** విద్యార్థులు పాఠశాలకు వస్తే కనీస సౌకర్యాలైన మంచినీరు ఆహ్లాదకరమైన వాతావరణం విద్యుత్ సౌకర్యం విద్యాహక్కు చట్టం ప్రకారం కచ్చితంగా ఉండాల్సిందే. అది తాగేందుకు మంచినీరు లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి. చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 350కి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా కనీస అవసరాలు అయిన మంచి నీటిని అందించడంలో అధికారులు విఫలమయ్యారు. నెలల తరబడి ఈ సమస్యను అటు అధికారులకు తెలియజేస్తున్న పట్టించుకోకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే జారి ఆదినారాయణ దృష్టికి విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తీసుకువెళ్లారు. స్థాని ఎమ్మెల్యే ఆదినారాయణ మిషన్ భగీరథ అధికారులకు దసరా సెలవుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు అధికారులు బేఖాతరు చేశారని కనీసం పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఉదయం తొమ్మిది గంటలకు వచ్చిన విద్యార్థులకు సాయంత్రం నాలుగు గంటల 15 నిమిషాల వరకు ఉండాల్సి ఉండగా పాఠశాల ఆవరణలో ఉన్న చేతి పంపు నీరు మురుకులుగా వస్తూ ఉండటంతో ఆ నీటిని తాగటం లేదు. ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్న లీటర్ బాటిల్ సరిపోక విద్యార్థులు మంచినీటి కోసం అల్లాడుతుంటే కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేరా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారిస్తే పాఠశాలలో మంచినీటి సౌకర్యం క్షణాల్లో పరిష్కరించవచ్చని ఆ దిశగా అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు వివిధ సంఘాల, పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతానికి పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులే బయటనుంచి మినరల్ వాటర్ తీసుకువచ్చి తాత్కారికంగా విద్యార్థుల దాహర్తిని తీరుస్తున్నారు.

## ఖిల్లా పార్క్ స్పీడ్‌బ్రేకర్..యమడేంజర్

- ఖిల్లాపై అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు తెలిపే స్పీడ్ బ్రేకర్

**దేవరకొండ, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణ ప్రజల ఆహ్లాదం కొరకు ఖిల్లా పార్క్ కు సొంత వాహన్నాలో వెళ్తున్నారా.. అయితే బీ కేర్ ఫుల్.. ఖిల్లా ముఖ ద్వారం వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన అతిపెద్ద స్పీడ్ బ్రేకర్ వాహన దారులా నష్టాలకు నిలయంగా మారింది. ఒక్కసారి ఆ స్పీడ్ బ్రేకర్ గుంట వెళ్లిన వాహనం.. షెడ్ కి వెళ్లాల్సిందే..నిత్యం వాహనదారులు ఖిల్లా పార్కుకు వెళ్లాలంటే స్పీడ్ బ్రేకర్ చాలా ఎత్తుగా వెడల్పుగా ఉండడంతో స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో వాహనాల బంపర్లు స్పీడ్ బ్రేకర్లకు తగిలి ఇందనం ట్యాంక్ కి చిల్లులు పడి వాహనదారులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. జనం సాక్షి గతంలో ఇదే సమస్య మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఖిల్లా పార్క్ పనులు పూర్తయ్యే లోపు స్పీడ్ బ్రేకర్ వద్ద పొడవాటి ర్యాంప్ ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి సంవత్సర కాలం గడిచిందని,పర్యాటకుల వాహనాలకు ఇంత నష్టం జరుగుతున్నా పట్టణ మున్సిపల్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టింపు లేకుండా చోద్యం చూస్తున్నారని వాహనదారులు తెలిపారు. ఇకనైనా ఖిల్లా పార్క్ సందర్శించడానికి వచ్చే పర్యాటకుల జేబుకు చిల్లులు పడకుండా, వాహనదారులకు జరిగే నష్టాలను దృష్టిలో ఉంచుకొని పార్కుకు వచ్చే వాహనాలకు స్పీడ్ బ్రేకర్ తగలకుండా, సంబంధిత శాఖ అధికారులు స్పీడ్ బ్రేకర్కు మరమ్మత్తులు చేపట్టాలని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



### మున్సిపల్ కమిషనర్ వివరణ

పై ప్రజా సమస్యపై మునిసిపల్ కమిషనర్ వై. సుదర్శన్ ను జనం సాక్షి వివరాణ కోరగా.. వర్షాపు నీరు, చెరువు నిండినప్పుడు చెరువు నీరు ఖిల్లా బయట కాలనీ వైపు రాకుండా ఉండేందుకు అండర్ గ్రౌండ్ సహాయంతో నీళ్లు కిందికి వెళ్లే విధంగా ఇనుప రాడ్ల సహాయంతో స్పీడ్ బ్రేకర్ ను ఎత్తుగా నిర్మించడం జరిగిందని, స్పీడ్ బ్రేకర్ పై వాహనాలు దాటే సమయంలో స్పీడ్ బ్రేకర్లు వాహనాలకు తగిలే విషయం వాస్తవమేనని, గతంలో తమ వాహనాలు కూడా స్పీడ్ బ్రేకర్ కు తగిలి తీవ్ర నష్టం కలిగిందని, ఖిల్లా పార్కు వచ్చే వాహనదారులకు నష్టం కలగకుండా స్పీడ్ బ్రేకర్ వద్ద పొడవాటి ర్యాంప్ ఏర్పాటు చేసి వాహనాలలు ఇబ్బంది లేకుండా చర్యలు తీస్కుంటామని తెలిపారు.

# అభివృద్ధికి చిరునామా ఉత్తమ్ కుమార్ రెడ్డి

- 150 ఫార్మా, ఐటీ కంపెనీలు హుజూర్ నగర్ రాక
- రెండు నియోజకవర్గాలలో విద్యారంగానికి మహార్దశ..

**కోదాడ, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** ఇది ప్రజల నోట నానుడి, రోడ్లు ,నీటిపారుదల, రెవిన్యూ, వైద్య, ఒకటేమిటి అన్ని రంగాలలో రెండు నియోజకవర్గాలు అభివృద్ధిలో మహర్దశను సాధిస్తున్నాయి.ఇప్పుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టి విద్యారంగంపై పడింది. అందుకే హుజూర్ నగర్ లో వ్యవసాయ కళాశాల, ప్రభుత్వ ఐటిఐ కళాశాల, కోదాడలో నవోదయవిద్యాలయ సమితి, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, మంజూరు చేయించారు. అదే మాదిరిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు అభివృద్ధిలో భాగంగా నిధులు కేటాయించారు. ఇప్పుడు నిరుద్యోగులకు బాసటగా నిలిచి భరోసా కల్పిస్తున్నారు .5000 కుటుంబాలలో వెలుగులు నింపాలని దృఢ నిశ్చయంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సహకారముతో ఈనెల 25వ తేదీన హుజూర్ నగర్ లో మెగా జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వనున్నారు .దేశంలో పేరొందిన ఫార్మా మరియు ఐటీ కంపెనీలు హుజూర్ నగర్ కు రానున్నాయి. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. పదవ తరగతి నుండి పీజీ వరకు, ఐటిఐ నుండి బీటెక్ వరకు ఏ కోర్సు చేసిన అర్హతను బట్టి ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుంది.





## పాకిస్థాన్‌లో కేజీ టమాటా @రూ.700

**ఇస్లామాబాద్:**నిత్యావసర కూరగాయల్లో ముఖ్యమైన టమాటా ధర పాకిస్థాన్‌లో సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. అక్కడ కిలో టమాటా ధర రూ.700 పలుకుతుందంటే ఆ దేశంలో ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.గత కొద్ది నెలలుగా పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులన్నీ కలిసి టమాటా ధరలను ఆకాశానికి చేర్చాయి. టమాటా ధరల పెరుగుదలకు ప్రధానంగా ఈ క్రింది కారణాలు దోహదపడుతున్నాయి. పాకిస్థాన్‌లో చుట్టూ ఉన్న సింధ్, బలూచిస్థాన్, దక్షిణ పంజాబ్ ప్రాంతాల్లో గతంలో సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా వేలాది ఎకరాల్లో టమాటా పంట నాశనమైంది. దీని ఫలితంగా దేశీయ మార్కెట్లోకి టమాటా సరఫరా గణనీయంగా తగ్గిపోయింది. వరదలు, వాతావరణ మార్పుల వల్ల రహదారులు దెబ్బతినడం, రవాణా ఆలస్యం కావడం వంటి కారణాల వల్ల కూడా పంట ఉన్న ప్రాంతాల నుంచి మార్కెట్లకు సరుకు చేరడంలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

**ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం:**పాకిస్థాన్ రూపాయి విలువ(భారత రూపాయితో పోలిస్తే పాక్ రూపాయి విలువ 0.31 పైసలుగా ఉంది) ఇతర కరెన్సీలతో పోలిస్తే భారీగా పడిపోతోంది. దీనివల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశీయంగా పంట నష్టం జరగడంతో టమాటా కొరతను తీర్చడానికి పాకిస్థాన్ ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ వంటి దేశాల దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుంది. అయితే పాక్ రూపాయి విలువ తగ్గడం, సరిహద్దుల్లో అనిశ్చితులు పెరగడం వల్ల దిగుమతి చేసుకునే టమా టా ధరలు అధికమయ్యాయి. గతంలో టమాటాకు సరైన ధరలు లభించకపోవడం, వాతావరణ మార్పుల వల్ల తరచుగా పంట నష్టాలు వాటిల్లడం వంటి కారణాల వల్ల రైతులు పంట సాగును తగ్గించారు.

**సీజనల్ కొరత:**టమాటా ధరలు సీజన్‌ను బట్టి తరచుగా మారుతుంటాయి. ముఖ్యంగా రెండు ప్రధాన పంటల సీజన్‌ల మధ్య కొద్దిపాటి కొరత ఏర్పడటం సర్వసాధారణం. అయితే ప్రస్తుత ఆర్థిక, వాతావరణ పరిస్థితులు ఈ సాధారణ కొరతను మరింత తీవ్రతరం చేశాయి. సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కొంతమంది వ్యాపారులు పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా తీసుకుని కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

# రియల్టీలో బ్లాక్‌మనీ చక్కర్లు..




### కొనుగోళ్లు, అమ్మకాలు, పెట్టుబడుల్లో గణనీయమైన భాగం నగదు రూపంలోనే



**రియల్ ఎస్టేట్ రంగాన్ని భారత ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైనదిగా పరిగణిస్తున్నారు. అయినప్పటికీ ఈ రంగం దశాబ్దాలుగా నల్లధనం లేదా లెక్కల్లో చూపని ధనం ప్రవాహానికి ప్రధాన వేదికగా మారిందనే వాదనలున్నాయి.ఇక్కడ జరిగే కొనుగోళ్లు, అమ్మకాలు, పెట్టుబడుల్లో గణనీయమైన భాగం నగదు రూపంలోనే జరుగుతుండటం దీనికి ముఖ్య కారణం. డిజిటలైజేషన్ అని చెప్పుకుంటున్న, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్లు వచ్చినా ఈ విభాగంలో ఇప్పటికీ చాలా వరకు నగదు రూపంలోనే లావాదేవీలు జరుగుతున్నాయనేది వాస్తవం. రియల్టీ రంగంలో నల్లధనం ఎలా ప్రవహిస్తుంది, అందుకు గల కారణాలు, దాని ప్రభావాలను విశ్లేషిద్దాం.**

**హైదరాబాద్:**సాధారణంగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు రెండు రకాలుగా విభజిస్తారు. అధికారిక లావాదేవీలు.. ఇది బ్యాంక్ ద్వారా చెక్, ఆన్‌లైన్ బదిలీ రూపంలో చెల్లిస్తారు. ఈ మొత్తం ప్రభుత్వ రికార్డులలో నమోదు చేయబడి, దీనిపై కొనుగోలుదారు, విక్రేత పన్నులు చెల్లిస్తారు. డాక్యుమెంట్లలో, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చూపించే ధర ఇదే. ఇది అధికారిక పత్రాల్లో చూపకుండా కొనుగోలుదారు నేరుగా విక్రేతకు నగదు రూపంలో ఇచ్చే మొత్తం. ఈ లావాదేవీ వివరాలను ఆదాయపు పన్ను శాఖకు లేదా ప్రభుత్వానికి తెలియజేయరు. మార్కెట్ ధర, డాక్యుమెంట్ ధర మధ్య ఉన్న వ్యత్యాసం ఈ నల్లధనం. ఒక కొనుగోలుదారు తాను దాచుకున్న నల్లధనాన్ని ఉపయోగించి ఒక ఆస్తిని కొనుగోలు చేయాలనుకున్నప్పుడు ఆస్తి యజమానికి డాక్యుమెంట్‌లో ఉన్న ధర కంటే ఎక్కువ మొత్తాన్ని (అదనపు నగదు) చెల్లిస్తారు. ఈ అదనపు మొత్తం కొనుగోలుదారు నల్లధనంగా ఉంటుంది. ఇదే తర్వాత కాలంలో ఆస్తి యజమానికి సైతం నల్లధనంగా మారుతుంది. అమ్మకం దశ: కొనుగోలుదారు ఆస్తిని అమ్మే సమయానికి ఆ ఆస్తి విలువ పెరిగి ఉంటుంది. అప్పుడు అతను కొత్త కొనుగోలుదారు నుంచి మార్కెట్ విలువ ప్రకారం ధరను తీసుకుంటాడు. ఇందులో కొంత భాగం అధికారికంగా లెక్క చూపినా పెరిగిన విలువలో ఎక్కువ భాగం నగదు రూపంలో (నల్లధనం) తీసుకునేందుకు మొగ్గు చూపుతాడు. ఆస్తి అమ్మే సమయానికి పన్ను ఎగవేత కోసం ఇది నల్లధనంగా మారుతుంది.నిర్మాణం/డెవలప్‌మెంట్: రియల్ ఎస్టేట్ డెవలపర్లు భూమి కొనుగోలు, నిర్మాణ సామగ్రి, కార్మికుల వేతనాలు వంటి వాటిలో పెద్ద మొత్తంలో నగదులావాదేవీలు నిర్వహిస్తారు. ఇది వారికి లెక్కల్లో చూపని ఆదాయం (నల్లధనం) సృష్టించడానికి అవకాశం ఇస్తుంది.

**ప్రధాన కారణాలు:**అధిక స్టాంప్ డ్యూటీ, పన్నులు ఆస్తుల రిజిస్ట్రేషన్, అమ్మకాలపై ప్రభుత్వాలు విధించే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మూలధన లాభాల పన్ను చాలా ఎక్కువగా ఉండటం. ఈ అధిక పన్నులను తప్పించుకోవడానికి కొనుగోలుదారులు, విక్రేతలు ఇద్దరూ డాక్యుమెంట్లలో ఆస్తి విలువను తక్కువగా చూపించి మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో లావాదేవీ చేస్తారు.

**ధరల్లో వ్యత్యాసం:**ప్రభుత్వం నిర్ణయించిన సర్కిల్ రేటు కంటే మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం. విక్రేత మార్కెట్ ధరను డిమాండ్ చేసినప్పుడు కొనుగోలుదారు స్టాంప్ డ్యూటీని ఆదా చేసుకోవడానికి సర్కిల్ రేటుకు మాత్రమే డాక్యుమెంట్ చేయించి మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో చెల్లిస్తాడు.

దాచుకునే అవకాశం

నల్లధనం (లెక్కల్లో చూపని ఆదాయం) ఉన్న వ్యక్తులకు ఆ డబ్బును సులభంగా, సురక్షితంగా దాచుకోవడానికి రియల్ ఎస్టేట్ ఒక ఉత్తమ మార్గంగా కనిపిస్తుంది. నల్లధనాన్ని ఆస్తి రూపంలోకి మార్చడం ద్వారా వారు దానిపై వడ్డీ లేదా పన్ను చెల్లించకుండా తప్పించుకుంటారు.రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో పూర్తి పారదర్శకత లేకపోవడం. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) వంటి వ్యవస్థలు ఉన్నా పాత లేదా వ్యక్తిగత ఆస్తుల కొనుగోలు, అమ్మకాలలో నగదు ప్రవాహాన్ని నియంత్రించే యంత్రాంగం బలహీనంగా ఉందనే వాదనలున్నాయి. రియల్ ఎస్టేట్‌లో తరచుగా ధరలు వేగంగా పెరుగుతుంటాయి. ఈ లాభాలపై పన్నులు కట్టకుండా ఉండటానికి విక్రేతలు నగదు రూపంలో అమ్మకాలు జరపడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

**పరిణామాలు ఇలా..:**రియల్ ఎస్టేట్‌లో నల్లధనం ప్రవాహం అనేక ఆర్థిక, సామాజిక సమస్యలకు దారితీస్తుంది. నల్లధనం వల్ల వాస్తవ మార్కెట్ ధర కృత్రిమంగా పెరుగుతుంది. మధ్యతరగతి, పేద ప్రజలకు ఇల్లు కొనుగోలు చేయడం కష్టమవుతుంది. పన్ను ఎగవేత కారణంగా ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, మూలధన లాభాల పన్ను రూపంలో రావాల్సిన ఆదాయం కోల్పోతుంది. నల్లధనం ప్రవాహం దేశ ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. ఈ రంగంలోని అధికారులకు లంచాలు ఇచ్చి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం వంటి అవినీతి కార్యకలాపాలకు ఇది ఆజ్యం పోస్తుంది.

### రిలయన్స్ రిటైల్ 600 డార్క్ స్టోర్లు ప్రారంభం

**న్యూఢిల్లీ:**రిలయన్స్ రిటైల్ దేశవ్యాప్తంగా 600కు పైగా డార్క్ స్టోర్‌లను ఇప్పటికే ప్రారంభిం చిందని ఇటీవల తెలిపింది. వినియోగదారులకు డెలివరీలను వేగవంతం చేయడానికి మరిన్నింటిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు పేర్కొంది.డార్క్ స్టోర్ అనేది రిటైల్ వ్యాపారానికి సంబంధించిన ఒక నూతన విధానం. దీన్నే 'డార్క్ షాప్', 'డార్క్ సూపర్ మార్కెట్' అని కూడా పిలుస్తారు. ఈ స్టోర్‌లు సాధారణంగా కస్టమర్‌ల కోసం ఏర్పాటు చేసినవి కావు. అంటే కస్టమర్‌లు లోపలికి వెళ్లి వస్తువులను కొనుగోలు చేయడానికి లేదా పరిశీలించడానికి అనుమతి ఉండదు.ఇది ప్రత్యేకంగా ఆన్‌లైన్ ఆర్డర్‌లను సిద్ధం చేయడానికి, ప్యాక్ చేయడానికి, డెలివరీ చేయడానికి ఉద్దేశించిన ఒక వేర్‌హౌస్ లేదా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లాగా పనిచేస్తుంది. వేర్‌హౌస్ లోపల వస్తువులను వేగంగా ఎంచుకోవడానికి, ప్యాక్ చేయడానికి అనుగుణంగా దీన్ని ఏర్పాటు చేస్తారు. సాధారణ సూపర్ మార్కెట్ లాగా అల్మారాలు ఉన్నప్పటికీ కస్టమర్‌లను ఆకర్షించే డిస్‌ప్లేలు, ప్రచార సైన్‌బోర్డ్‌లు ఇందులో ఉండవు.

### ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై:**దీపావళిసందర్భంగాదేశీయస్టాక్మార్కెట్లలోనిర్వహించినముహూరత్ ట్రేడింగ్ ఫ్లాట్‌గా ముగిసింది. భారత స్టాక్ మార్కెట్లు 'సంవత్ 2082'ను జాగ్రత్తగా ప్రారంభించాయి.సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు స్వల్పసానుకూలంవైపు స్థిరపడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 62.97 పాయింట్లు లేదా 0.07 శాతం పెరిగి 84,426.34 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 25.45 పాయింట్లు లేదా 0.1 శాతం పెరిగి 25,868.60 స్థాయిల వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లలో ఎన్ఎస్ఈ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.11 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.52 శాతం పెరిగాయి. నిఫ్టీ ఆటో, ఎనర్జీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, మీడియా, మెటల్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ స్వల్ప లాభాలతో ముగిశాయి.సెన్సెక్స్ లో బజాజ్ ఫిన్సర్వ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, పవర్ గ్రిడ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ గెయినర్లుగా నిలిచాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి సుజుకి, ఏషియన్ పెయింట్స్ టాప్ లూజర్స్.ట్రేడింగ్ సెషన్ లో 2,213 స్టాక్స్ లాభాలతో ముగిశాయి. 710 తగ్గుముఖం పట్టాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,21,700 (22 క్యారెట్లు) | ₹ 1,32,770 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,88,000

# మాతో పెట్టుకోకండి



## • చైనాకు యూఎస్ వార్నింగ్..

**వాషింగ్టన్:**ప్రపంచ వాణిజ్య వేదికపై అమెరికా చైనాల మధ్య టారిఫ్‌లు, వాణిజ్యపరమైన ఆంక్షల రూపంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అరుదైన అయస్కాంత లోహాల సరఫరాను అడ్డుకోవద్దని అమెరికా చైనాకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమెరికా విధించిన టారిఫ్‌లకు ప్రతిచర్యగా ఈ కీలక లోహాల ఎగుమతులను నియంత్రించాలని చైనా చూస్తోంది.ఈ అరుదైన లోహాల ఉత్పత్తి, శుద్ధి ప్రక్రియలో చైనా ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం చెలాయిస్తోంది.ప్రపంచంలోని అరుదైన ఖనిజాల తవ్వకంలో దాదాపు 70%, వాటి శుద్ధిలో 90% వరకు చైనా నియంత్రిస్తోంది. ఈ ఏకఛత్రాధిపత్యం కారణంగా ఈ లోహాలపై ఎగుమతి నియంత్రణలను విధిస్తే అమెరికాపై చైనా గణనీయమైన ప్రభావాన్ని చూపగలదు. ఈ నేపథ్యంలో చైనా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి, టారిఫ్‌లను తగ్గించుకోవడానికి ఈ లోహాల నియంత్రణను ఒక 'ట్రంప్ కార్డ్'గా ఉపయోగించుకోవాలని చూస్తోంది.అరుదైన అయస్కాంత లోహాల్లో ముఖ్యంగా నియోడైమియం ప్రెసోడైమియం డిస్ప్రోసియం వంటి



మిశ్రమాలతో తయారైన శాశ్వత అయస్కాంతాలు కీలకంగా ఉన్నాయి. ఇవి ఆధునిక సాంకేతికతకు, డిఫెన్స్ రంగానికి వెన్నెముకగా ఉన్నాయి. ఇవి చాలా చిన్నవిగా, తేలికగా ఉండి శక్తివంతమైన అయస్కాంత క్షేత్రాన్ని సృష్టిస్తాయి. వీటిని ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లలో, పవన విద్యుత్ టర్బైన్‌ల జనరేటర్లలో కీలకం. ఇవి అధిక సామర్థ్యంతో శక్తి మార్పిడిని సాధ్యం చేస్తాయి.కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, స్పీకర్లు, హెడ్‌ఫోన్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ఇవి తప్పనిసరి.అధునాతన ఆయుధ వ్యవస్థలైన ఫైటర్ జెట్‌లు, క్షిపణులు, ఇతర స్మార్ట్ బాంబులు వంటి వాటిలో ఉపయోగించే మోటార్లు, సెన్సార్లకు ఈ అయస్కాంత లోహాలు ఎంతో అవసరం. ఈ కారణం వల్లనే ఈ లోహాలను వ్యూహాత్మ కంగా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.ఎంఆర్ఐ యంత్రాలు (మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్), పేస్‌మేకర్లు, హియరింగ్ ఎక్విప్‌మెంట్లు వంటి వైద్య పరికరాల్లో వీటిని ఉపయోగిస్తారు.పవర్ టూల్స్, రోబోటిక్స్, హై-పెర్ఫార్మెన్స్ ఏసీ సర్వో మోటార్లతో సహా అనేక పారిశ్రామిక అనువర్తనాలలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.అరుదైన అయస్కాంత లోహాల వివాదం కేవలం వాణిజ్య పరమైన సమస్య కాకుండా ప్రపంచ భద్రత, సాంకేతిక ఆధిపత్యం, గ్రీన్ ఎనర్జీ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. ఈ లోహాలపై చైనాకున్న పట్టు దాన్ని ఒక శక్తివంతమైన భౌగోళిక రాజకీయ ఆయుధంగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇతర దేశాలు చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి తమ సొంత అరుదైన లోహాల సరఫరా గొలుసులను బలోపేతం చేసుకోవాలి.


## టపాసులా పేలిన బంగారం ధరలు

ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ?సోమవారంతో పోలిస్తే మంగళవారం బంగారం ధరలు మరింత అధికమయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.



## రాముడి స్ఫూర్తితోనే ఆపరేషన్ సిందూర్

ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.





## దీపావళి బోనస్ ఇవ్వలేదని భారీ నష్టం తెచ్చారు!

**లక్నో:**దీపావళి బోనస్ ఇవ్వకపోవడంపై నిరసనగా ఉద్యోగులు చేపట్టిన ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయ నష్టాన్ని కలిగించింది. ఆగ్రా-లక్నో ఎక్స్ ప్రెస్ వేలోని ఫతేహాబాద్ టోల్ ప్లాజా వద్ద ఆదివారం గంటలపాటు గేట్లు తెరిచి ఉంచడంతో వేలాది వాహనాలు టోల్ చెల్లించకుండా టోల్ గేట్ దాటి వెళ్లిపోయాయి.దేశమంతా ఘనంగా జరుపుకొనే అతిపెద్ద పండుగ దీపావళి. ఈ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో కార్పొరేట్ కంపెనీల నుంచి చిన్నాచితకా సంస్థల వరకు తమ ఉద్యోగులకు ఎంతో కొంత మొత్తాన్ని దీపావళి బోనస్‌ల కింద ఇస్తుంటాయి. శ్రీసాయి, దాతార్ టోల్ ఆపరేటింగ్ సంస్థలకు చెందిన ఉద్యోగులు కూడా తమకు దీపావళి బోనస్ లభిస్తుందని ఆశించారు.గత వారం దీపావళి సందర్భంగా తమ బోనస్ లు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని కంపెనీ హామీ ఇచ్చిందని, కానీ బోనస్‌లు జమ కాలేదని ఆందోళనకారులు తెలిపారు. దీంతో ఆగ్రహించిన ఉద్యోగులు ఆదివారం రాత్రి టోల్ బూత్ బూమ్ బారియర్ ను తెరిచి సమ్మెలో కూర్చున్నారు. 10 గంటల పాటు కొనసాగిన ధర్నా అధికారులు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన తరువాత విరమించారు."నేను ఏడాదిగా కంపెనీలో పనిచేస్తున్నాను. మాకు ఎటువంటి బోనస్ ఇవ్వలేదు. జీతాలు కూడా ఆలస్యంగా వస్తున్నాయి" అని ఒక ఉద్యోగి మీడియాకు తెలిపారు. బోనస్ ఇవ్వకపోగా కొత్త ఉద్యోగులను పెట్టుకుంటామని సంస్థ ప్రతినిధులు బెదిరించడం ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెప్పించాయి.ఫతేహాబాద్ టోల్ ప్లాజా ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ఉంది. ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాన ప్రవేశ మార్గంగా ఉంటోంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ను యమునా ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా లక్నోకు అనుసంధానించే ఈ మార్గం దేశానికి కీలకమైన వ్యూహాత్మక రహదారిగా గుర్తింపు పొందింది.

## మాజీ అధ్యక్షుడి జైలు జీవితం ప్రారంభం

**పారిస్:** అక్రమంగా భారీగా నిధులు స్వీకరించారనే ఆరోపణలకు సంబంధించి గత నెలలో జైలు శిక్ష ఖరారైన ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ జైలు జీవితం ప్రారంభమైంది.2007 ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల సమయంలో లిబియాకు చెందిన గడాఫీ నేతృత్వంలోని ప్రభుత్వ నుండి సర్కోజీ అక్రమంగా భారీగా నిధులు స్వీకరించారనే ఆరోపణల దరిమిలా నమోదైన ఈ కేసులోని కొన్ని అభియోగాలనను కొట్టివేయగా, ఒకదానిలో నికొలస్ సర్కోజీని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం ఆయనకు శిక్షను ఖరారు చేసింది.సర్కోజీకి జైలు శిక్షను తప్పనిసరిగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఆ సమయంలో జైలు శిక్ష తేదీ ఖరారు చేయని కోర్టు.. అటు తర్వాత ఆ తేదీని కూడా స్పష్టం చేయడంతో సర్కోజీకి తాజాగా జైలు జీవితం అనుభవించడానికి వెళ్లారు. పారిస్‌లోని లా సాంటే జైలులో సర్కోజీని ఉంచారు.నికొలస్ సర్కోజీ 2007 నుంచి 2012 వరకు ఫ్రాన్స్ అధ్యక్షునిగా పనిచేశారు. అయితే అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో గడాఫీ నేతృత్వంలోని లిబియా ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక సాయంపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నిధులను దౌత్య సహాయంగా చెప్పకుండా స్వీకరించారని, అవి తన ఎన్నికల ప్రచారానికి ఉపయోగించినట్లు పలువురు ఆరోపించారు. అవినీతి, ప్రచారానికి అక్రమ నిధుల వినియోగం, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం తదితర ఆరోపణలు రుజువు కానప్పటికీ.. నేరపూరిత కుట్రలో సర్కోజీని న్యాయస్థానం దోషిగా ప్రకటించి, ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.



## బొద్దింకను చంపబోయి.. అపార్ట్‌మెంట్‌కే నిప్పటించింది..!

**సియోల్:**ఒక్కోసారి మనం చేసే పనులు ఎంత సీరియస్‌గా మారుతాయో అనేందుకు ఈ ఉదంతమే ఉదాహరణ. బహుశా అందుకే కాబోలు ఏ పనైనా చేసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించండి అని అంటుంటారు పెద్దలు.ఈ ఘటన వింటే..ఎంత జాగురకతో ఉండాలో కచ్చితంగా అర్థమవుతుంది.అసలేం జరిగిందంటే..దక్షిణ కొరియాలో జరిగిన ఒక వింత ఘటన ప్రపంచవ్యాప్తంగా ఆకర్షించడమే కాదు, అందర్నీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అసలు ఇలా ఎలా జరిగిందని..అనుమానాలు లేవనెత్తేలా చర్చనీయాంశమైంది. ఒక మహిళ ప్రమాదవశాత్తు భవనానికి నిప్పంటిచడంతోనే ఈ ఘటన వార్తలో నిలిచింది. కేవలం బొద్దింకను చంపేందుకు ఫ్లేమ్ త్రోవర్(మండే స్ప్రే)ని ఉపయోగించడంతోనే ఈ దురదృష్టకర ఘటన చోటుచేసుకుంది. ఆమె బొద్దింకను చంపేందుకు ఎప్పుడైతే ఫ్లేమ్ త్రోవర్ ఉపయోగించిందో..ఆ మంటలు కాస్త వంటగదిలో ఉన్న వస్తువులకు వ్యాపించి..మొత్తం 32 అపార్ట్‌మెంట్‌ల రెసిడెన్సీ మంటల్లో చిక్కుకుపోయింది. రెండు నెలల శిశువుతో అదే ఫ్లోర్‌లో పొరుగున ఉన్న ఒక జంట ఈ ప్రమాదంలో చిక్కుకుపోయింది. పాపం వారు తమ బిడ్డను కాపాడుకునేందుకు పక్కంటి వారికి శిశువుని అప్పగించి కిటికీ గుండా తప్పించుకోవాలనుకున్నారు.ముందు భర్త బయటకు రాగా, ఆయన్నే అనుసరిస్తు వస్తున్న చైనాకు చెందిన మహిళ పట్టు తప్పి పడిపోయింది. హుటాహుటిన ఆస్పత్రికి తరలించిన ప్రయోజనం లేకుండా పోయింది. తీవ్ర గాయలపాలై మరణించిందామె. అంతేగాదు ఈ మంటలు గ్రౌండ్‌ఫ్లోర్‌లో వాణిజ్య యూనిట్లు, అక్కడే నివాసం ఉంటన్న కొన్ని కుటుంబాలు కూడా ప్రభావితమైనట్లు అధికారులు వెల్లడించారు. అంతేగాదు ఈ ప్రమాదం కారణంగా ఎనిమిదిమందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.ఈ దుర్ఘటనకు కారణం సదరు మహిళ నిర్లక్ష్యమే అంటూ ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయాలని భావిస్తున్నారు పోలీసులు. పాపం ఏదో బొద్దింకల బెడద వదిలించుకోబోయి..చివరికి జైలుపాలై పరిస్థితి ఎదురైంది. ఏదో చేయిబోయి..ఇంకేదో అయినట్లు పాపం ఆ మహిళ ఒక్క బొద్దింకను మట్టుబెట్టాలనుకుంటే..ఓ ప్రాణాన్ని పొట్టనుబెట్టుకోవడం, పలువులరు గాయపడటానికి దారితీసింది.

తెలంగాణ రైజింగ్ - 2047

## సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపు
- ఈనెల 25 తో ముగియనున్న సర్వే



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 21(జనంసాక్షి) :** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్‌ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించా ల్సిందిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## పోలీస్ అమరవీరులకు నివాళులు

**ముస్తాబాద్ (జనంసాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నీవల్ల అర్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలొడ్డి పోరాడిన పోలీస్ అమరుల సేవలను జాతి ఎన్నటికీ మరువదు. అమరుల స్ఫూర్తితో పోలీసు ఉద్యోగులు తమ విధి నిర్వహణకు పునరంకితం కావాలని ఆకాంక్షిస్తూ... విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' సందర్భంగా ఘన నివాళులు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- నక్సల్స్ ప్రభావ ప్రాంతంగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 47 మంది అధికారులకు నివాళులు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద మంగళవారంనాడు 'ఫ్లాగ్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పోలీసుల త్యాగం మరువలేనిదని కొనియాడారు. దేశమంతా ప్రజలు పండుగలు కుటుంబ సభ్యులతో జరుపుకుంటున్న సమయంలో పోలీసులు విధుల్లో నిమగ్నమై ప్రజలను రక్షిస్తారని తెలిపారు. అటువంటి చిన్న చిన్న త్యాగాల నుండి మొదలుకొని అవసరమైతే విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులందరికీ నమస్సుమాంజలి తెలిపారు.

పోలీసు కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేదని, ఎంతో మంది ప్రాణ త్యాగం ఫలితంగానే నేడు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో 47 మంది పోలీసు అధికారులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దేశ రక్షణకోసం, సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులను స్మరించుకుని నివాళులు అర్పించామని తెలిపారు. దేశవ్యాప్తంగా 191 మందికి పైగా అన్ని విభాగాల పోలీసులు అమరులయ్యారని, వారి త్యాగాలు ఎప్పటికీ వృధా కావని కమీషనర్ పేర్కొన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు ప్రశాంతంగా ఉండేలా, శాంతి భద్రతలు కాపాడే విధంగా విధులు నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వారిని స్మరించుకుంటూ ఈ నెల 31 వరకు 10 రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం అమరవీరుల విగ్రహానికి కరీంనగర్ సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. దేశవ్యాప్తంగా అమరులైన పోలీసులను స్మరించుకున్నారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ తో పాటు ఇతర పోలీసు అధికారులు , అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులు అర్పించారు.

కార్యక్రమానికి హాజరైనవారంతా పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన పోలీస్ కమీషనర్, వారి సేవలను కొనియాడి, వారికి గల సమస్యలను తెలుసుకున్నారు. అట్టి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు వెంకటరమణ, భీం రావు లతో పాటు కమీషనరేటులోని పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో పకడ్బందీ చర్యలు





### కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

**బోధన్, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు గాను సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బోధన్ మండలం పెగడాపల్లి, సాలురా మండలం సాలంపాడ్ క్యాంప్ లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు.

కౌలు రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, కేంద్రం నిర్వాహకులకు కలెక్టర్ స్పష్టమైన సూచనలు చేశారు. పంట సాగు చేసిన ప్రతి రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, క్రాప్ బుకింగ్ డేటాలో కౌలు రైతుల పేర్లు లేని పక్షంలో వారు వరి పంట సాగు చేశారా లేదా అన్నది వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ధృవీకరణ పత్రం అందించాలని, రైతుల వివరాలలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని కూడా సరిచేయాలని ఆదేశించారు. వరుస క్రమంలో రైతుల వివరాలు నమోదు చేసుకుని, ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయించాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం వేగంగా దిగుమతి చేసుకుని, సత్వరమే ట్రక్ షీట్లు అందించేలా చూడాలని తహసీల్దార్ ను ఆదేశించారు. కాగా, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎన్ని కొనుగోలు కేంద్రాలనైనా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ రైతులకు తెలిపారు.

గత సీజన్ లో 600 కేంద్రాలు ఉండగా, ఈసారి 670 కేంద్రాలు నెలకొల్పుతున్నామని, అవసరమైన చోట అదనంగా కూడా కేంద్రాలను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని అధికారులను ఆదేశించా రు. ప్రతి కేంద్రాన్ని సందర్శిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, తహసీల్దార్ విఠల్, ఏ.ఓ సంతోష్, పెంటాకలాన్ సహకార సంఘం చైర్మన్ దొనకంటి రాజారెడ్డి, సహకార సంఘం కార్యదర్శి బాబా, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, రైతులు కృష్ణారెడ్డి, మంద నాగరాజు, సాలంపాడ్ సహకార సంఘం కార్యదర్శి శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పించిన అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి



**వీణవంక అక్టోబర్ 21(జనం సాక్షి) :** వీణవంక మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలోమండల కేంద్రంలో పోలీస్ అమరవీరులకు కొవ్వొత్తులతో ర్యాలీ తీసి ఘనమైన నివాళులర్పించినారు. గతంలో వీణవంక మండలంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు నక్సలైట్లు కాల్చి చెప్పారు. అమరులైన టువంటి ఏఎస్ఐ కుమారస్వామి,కానిస్టేబుల్ రామారావులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్,ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజా శ్రేయస్సు కోసం,ప్రజల శాంతిభద్రతల రక్షణ కోసమే తమ కుటుంబాలను తమ ప్రాణాలను త్యాగం చేసినారని అమరులైన పోలీసులపై పాట పాడి నివాళులర్పించి ఈ విధంగా వారి సేవలను కొనియాడినారు. ఈ కార్యక్రమంలోమండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మేకల ఎల్లారెడ్డి,వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నల్లకొండాల్ రెడ్డి, రామకృష్ణ,అమ్మ ఫౌండేషన్ సభ్యులు దరిపెల్లి మురళి,అనిల్, గోనెల సాయిచరణ్,గంధం సుమన్,తాండ్ర లక్ష్మణ్, పల్లేర్ల కిరణ్, రాయణవేణి చిన్న అనిల్,గోనెల అఖిల్,అరవింద్ సాయి,రాజు, శ్రీ వెంకటేశ్వర కళాబృందం వీణవంక కళాకారులు,రాయిశెట్టి శ్రీనివాస్, సమ్మయ్య, దామోదర్,దుర్గయ్య రాజు,తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కలిపిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



**గోదావరిఖని , జనంసాక్షి :**
రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ త్వరలో ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి వరులు బట్టి విక్రమార్కను ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాగూర్ కోరారు. పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించడానికి లిఫ్ట్ మంజూరు చేయాలని తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా స్థానిక శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్చం అందించి దీపావళి పర్వదినం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిశ్రమల స్థాపన గురించి కొద్దిసేపు డిప్యూటీ సీఎం తో ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రధానంగా రామగుండంలో1×800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్ ప్లాంట్ త్వరలో పనులు ప్రారంభించాలని కోరారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. అయితే దీనిపై గత నెలలో బోర్డు ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడున్న వనరుల ఆధారంగా తప్పనిసరిగా పాత జెన్ కో పవర్ ప్లాంట్ స్థలంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తద్వారా పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్లాంటు ఏర్పాటు పై మొదటి నుండి ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకు వస్తూనే ఉన్నారు. తప్పనిసరిగా ప్లాంటు ఏర్పాటు అయ్యే దిశగా బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో భవిష్యత్తులో సూపర్ క్రిటికల్ విద్యుత్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. అంతే కాకుండా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడం వల్ల తాగు, సాగు నీటికి ఎలాంటి కొరత ఉండదని పేర్కొన్నారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తద్వారా గ్రామాలకు తాగు నీరు, పంటలు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు పై చర్చించారు.

## సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి: జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 (జనం సాక్షి) :**
తెలంగాణ రైజింగ్- 2047 సిటిజన్ సర్వే లో అందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు. ఈనెల 25 తో ముగియనున్న సర్వే తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## చట్ట విరుద్ధ కార్యక్రమాలు నిర్వహించే వారిపై కఠినమైన చర్యలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 (జనం సాక్షి) :**
జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పేకాట ఆడినందుకు ఇప్పటికే 469 మందిపై కేసులు నమోదు. జిల్లాలో 10,40,089- నగదు, 321 మొబైల్స్, 45 మోటార్ సైకిళ్లు స్వాధీనం. చేసుకున్నట్లు పేకాట స్థావరాలపై నిఘా కొనసాగుతోందని జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర వెల్లడించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా జూదం పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. తేదీ 18.10.2025 నుండి ఇప్పటివరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన ఈ దాడుల్లో మొత్తం 82 కేసులు నమోదు చేసి 469 వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి పోలీసులు 10,40,089 నగదు, 321 మొబైల్ ఫోన్లు, 45 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు వ్యక్తి, కుటుంబం మరియు సమాజానికి ఘోరమైన హాని కలిగిస్తాయి. ఇవి వ్యక్తులను అప్పుల్లో నింపి ఆర్థిక విధ్వంసానికి గురి చేస్తాయి. కుటుంబాల్లో ఘర్షణలు, నిరాశ, అనాథత్వ భావనలు ఏర్పడతాయి మరియు దారుణ పరిణామాలైన ఆత్మహత్యల వరకూ దారితీయవచ్చు. ఆత్మీయుల భావోద్వేగం, పిల్లల భవిష్యత్తు ఇవన్నీ జూదం వల్ల ప్రమాదంలో పడతాయి అని ఎస్పీ తెలిపారు.

జూదం మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యక్రమాలను నిరోధించడం అందరి సామాజిక బాధ్యత. కుటుంబ శ్రేయస్సు, సమాజ భద్రత కోసం ఇటువంటి కార్యకలాపాల నుండి పూర్తిగా దూరంగా ఉండాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే గ్రామాలు, పట్టణాలు, ఫామ్ హౌస్‌లు, ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో జూదం పేకాట లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిసినా లేదా ఎవరు ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉన్నా, వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 86133, 100 డయల్ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా ఉదయ్ ఏకగ్రీవ ఎన్నిక

**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 21 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో సోమవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రిక విలేకరుల సంఘం పెద్ద కొడప్గల్ నూతన అధ్యక్షుడిగా కల్లూరి ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా పుట్టల హన్మండ్లు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన పదాధికారులు మాట్లాడుతూ... తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

# అమరవీరుల త్యాగ ఫలితమే నేడు.. శాంతిసౌభ్రాతృత్వం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 (జనం సాక్షి) :**
అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేడు.. కనిపిస్తున్న శాంతి సౌభ్రాతృత్వమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, వారి ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, అన్నారు. పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీలు తెలియజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అమరవీరుల స్తూపం వద్ద అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు. కామారెడ్డి జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 07 మంది పోలీసులు అసువులు బాసారని,వారి త్యాగ ఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని,పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ప్రజల రక్షణ, భద్రత, శాంతి స్థాపన కోసం అంకితభావంతో సేవలందించే వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మన జిల్లాలో ఏడుగురు పోలీసు సిబ్బంది అమరులయ్యారని వారికి గౌరవప్రదంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి సంక్షేమానికి అన్ని విధాల సహాయం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల స్థాపన కోసం అసాంఘిక శక్తులతో పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమైనవి. వారు చూపిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ఆర్మీ జవానులు, పోలీసులు విధి నిర్వాహణలో ఎల్లప్పుడూ దేశ రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. 1959 అక్టోబర్ 21 న లడక్‌లోని అక్సాయ్ చిన్ వద్ద చైనా దళాల దాడిలో 10 మంది సి ఆర్ పి ఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన సందర్భాన్ని గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోందని చెప్పారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులతో పోరాటంలో 191 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ రాష్ట్రం నుండి 5 మంది అసిస్టెంట్ కమాండెంట్ బానోత్ జవహర్‌లాల్, కానిస్టేబుళ్లు టి. సందీప్, వడ్ల. శ్రీధర్, యం. పవన్ కళ్యాణ్ మరియు బి. సైదులు అమరులయ్యారని ఎస్పీ తెలిపారు. విధి నిర్వాహణలో ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నెరవేర్చడం, వారి కుటుంబాల సంక్షేమం కోసం కృషి చేయడం, ఆర్థిక పరమైన ప్రయోజనాలు సమయానికి అందేలా చూడడం, మానసిక బలాన్ని అందించడం ఇవే పోలీస్ అమరవీరులకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల స్మరణార్థం జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఈ రోజు నుండి అక్టోబర్ 31 వరకు రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, ఫోటో మరియు వీడియో పోటీలు నిర్వహించబడతాయని, అలాగే అమరవీరుల కుటుంబాలను స్వయంగా సందర్శించి వారికి గౌరవప్రదంగా నివాళులు అర్పిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కే నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, సిఐలు నరహరి, రామన్, సంతోష్ కుమార్, ఆర్ఐ కు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ జూనియర్ కళాశాల
## నిర్మాణ స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే

**గోదావరిఖని, అక్టోబర్ 21 (జనం సాక్షి) :**
రామగుండం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని రామగుండం శాసనసభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. గోదావరిఖనిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారు. ఇది స్థానిక యువతకు, విద్యార్థులకు విద్యా సౌకర్యాలు కల్పించడంలో ఓ కీలకమైన ముందడుగు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చాం. త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు అవసరమైన భౌగోళిక అంచనాలు, శాసనబద్ధ విషయాలన్నీ పరిశీలించామన్నారు. స్థల పరిశీలనలో రోడ్ వెడల్పు కోసం అవసరమైన సెట్ బ్యాక్ ప్రాంతాన్ని కూడా ఆయన పరిశీలించారు. నిర్మాణం తుది దశకు చేరుకునేలోపు, ప్రతి చిన్న అంశాన్ని పరిశీలిస్తూ, నిబంధనల ప్రకారంగా అభివృద్ధి పనులు సాగించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు , వివిధ విభాగల అధ్యక్షులు తదితరులున్నారు.

# మొహ్సిన్‌కు అల్టిమేటం

- నఖ్వీపై చర్యలు తీసుకోనున్న బీసీసీఐ!!
- ఐసీసీ సమావేశంలో సమస్య లేవనెత్తనున్న భారత్
- దుబాయ్‌లో ఏసీసీ కార్యాలయంలో ట్రోఫీ



**దుబాయ్, అక్టోబర్ 21, (జనంసాక్షి) :**
ఆసియా కప్ టోర్నమెంట్ ముగిసి చాలా కాలమైనా, విజేత భారత జట్టుకు ట్రోఫీ ఇంకా అందలేదు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ, ట్రోఫీని భారత జట్టు కెప్టెన్ చేతుల్లో అందజేయడానికి నిరాకరించి, తనతోనే దాన్ని తీసుకెళ్లిపోవడంతో ఈ వివాదం ఆరంభమైంది. ఫైనల్‌లో పాకిస్తాన్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించినప్పటికీ, నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి టీమ్ ఇండియా నిరాకరించింది. దీంతో ట్రోఫీ ప్రస్తుతం దుబాయ్ లోని ఏసీసీ కార్యాలయంలో ఉంది. భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) ఈ విషయంలో గట్టిగా స్పందిస్తోంది. గత వారం బీసీసీఐ ఒక లేఖను పంపి, ట్రోఫీని భారత జట్టుకు అప్పగించాలని కోరింది. అయితే, నఖ్వీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. టీమ్ ఇండియా దుబాయ్‌లోని ఏసీసీ కార్యాలయానికి వచ్చి, తన చేతుల మీదుగానే ట్రోఫీ తీసుకోవాలని నఖ్వీ షరతు విధించారు. ఈ షరతును బీసీసీఐ, టీమ్ ఇండియా అంగీకరించడం లేదు. ఈ వివాదాన్ని త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో లేవనెత్తేందుకు బీసీసీఐ సన్నద్ధమవుతోంది.
సెప్టెంబర్ 30న జరిగిన ఏసీసీ సమావేశంలో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ట్రోఫీ ఏసీసీ ఆస్తి అని, నఖ్వీకి దాన్ని వ్యక్తిగతంగా తీసుకెళ్లే హక్కు లేదని వాదించారు. క్షమాపణ చెప్పినప్పటికీ, నఖ్వీ ట్రోఫీని భారత జట్టుకు అందజేయడానికి నిరాకరించారు. బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా మాట్లాడుతూ, ఈ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ వివాదం వెనుక భారత్–పాకిస్తాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కూడా ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులను ఉదాహరణగా చూపిస్తూ, భారత జట్టు పాకిస్తాన్ క్రికెటర్లతో స్నేహపూర్వకంగా కలవడానికి, నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి నిరాకరించింది. ఈ నేపథ్యంలో నఖ్వీ తన అధికారాన్ని ఉపయోగించి ట్రోఫీని భారత్‌కు అందకుండా అడ్డుకుంటున్నారని బీసీసీఐ ఆరోపిస్తోంది. త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ సమస్యను అంతర్జాతీయ క్రికెట్ బోర్డు దృష్టికి తీసుకెళ్లేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. ట్రోఫీ వివాదం ఇలాగే కొనసాగితే, భారత్ మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.

# మీరే వచ్చి తీసుకెళ్లండి..

ఆసియా కప్ విజేతగా నిలిచిన తమకు ట్రోఫీని పంపించాలంటూ ఏసీసీ చీఫ్, పాక్ మంత్రి మోసిన్ నఖ్వీకి బీసీసీఐ ఈ–మెయిల్ చేసిన విషయం తెలిసింది. ఈ మెయిల్‌కు నఖ్వీ తాజాగా స్పందించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దుబాయ్‌కు వచ్చి తన వద్ద నుంచి ట్రోఫీ తీసుకెళ్లాలని నఖ్వీ స్పష్టం చేశారు. తాను ట్రోఫీని భారత్‌కు పంపించేది లేదని తేల్చి చెప్పారు. ఆసియా కప్ విజేత అయిన టీమిండియాకు ట్రోఫీ దక్కాలని మోసిన్ పేర్కొన్నారు. అయితే, నాటి ఫైనల్ మ్యాచ్ అనంతరం ట్రోఫీ ప్రదాన కార్యక్రమానికి హాజరు కావట్లేదనే విషయాన్ని బీసీసీఐ ముందుగా ఏసీసీ కార్యాలయానికి సమాచారం అందించలేదని మోసిన్ తన లేఖలో పేర్కొన్నారు. అప్పటికే మైదానంలో ట్రోఫీ ప్రదాన కార్యక్రమానికి సంబంధించిన వేదిక కూడా ఏర్పాటైందని చెప్పుకొచ్చారు. చివరి నిమిషంలో బీసీసీఐ ప్రతినిధి వచ్చి తమకు టీమిండియా రావట్లేదన్న సమాచారాన్ని అందించారని అన్నారు. క్రీడా సంప్రదాయాలను కాపాడేందుకు తాము ప్రయత్నించామని, విజేతలకు ట్రోఫీ అందించేందుకు సుమారు 40 నిమిషాలు అక్కడే వేచి చూశామని చెప్పుకొచ్చారు.
ప్రస్తుతం ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉందని అన్నారు. బీసీసీఐ అధికార ప్రతినిధితో పాటు మరో ప్లేయర్ వచ్చి తన నుంచి ట్రోఫీని తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అధికారికంగా అన్ని లాంఛనాలతో ఆనవాయితీలను కొనసాగించేలా జరగాలని కూడా చెప్పుకొచ్చారు. క్రీడాస్ఫూర్తికి విఘాతం కలిగించే ఏ చర్యకూ తాము అంగీకరించబోమని కూడా లేఖలో రాసుకొచ్చారు. అయితే, ఈ విషయంలో ఇప్పటికే అఫ్ఘానిస్థాన్, శ్రీలంక భారత్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ విషయంపై తేల్చుకునేందుకు భారత్ సిద్ధమవుతోంది.

# కవితా.. గానం

## వాగ్గేయకారుడు గాజోజు నాగభూషణం



తెలుగులో అనాటి అన్నమాచార్య మొదలు గద్దర్ వరకు అనేక మంది వాగ్గేయకారులున్నారు. ప్రస్తుత పరిస్థితిల్లోనూ అ పద్దతి కొనసాగుతూనే ఉంది. ఉమ్మడిజిల్లాకు చెందిన జ్ఞానపీఠ గ్రహిత డాక్టర్.సి. నారాయణరెడ్డి సైతం పాటలు రాయడంతో పాటు పాడడం వల్ల అకట్టుకున్న సందర్భాలు అనేకం. అదే కోవలో జిల్లాకు చెందిన గాజోజు నాగభూషణం పయనం సాగుతోంది.
గాజోజు నాగభూషణం 1962 జగిత్యాలలోని లక్ష్మిబాయి–బ్రహ్మయ్యలకు జన్మించారు. అక్కడే పదోతరగతి వరకు చదువు కొనసాగింది. అలిశెట్టి ప్రభాకర్ రచనల పై పెరిగిన ఆసక్తి తో పాటు రైతాంగపోరాటం ఆయనకు ప్రేరణగా నిలిచింది. అనంతరం శ్రీశ్రీ, తిలక్





కవిత్వానికి ఆకర్షితులైనారు. విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితుడు కావడంతో చదువు ఆగింది. కొంత కాలం అనంతరం తల్లిదండ్రుల ఒత్తిడితో ఒపెన్యూనివర్సిటిలో డిగ్రీ చేయడంతో పాటు కాకతీయ యూనివ ర్సిటీ నుంచి బీఎడ్ పట్టా పుచ్చుకున్నారు. ఈ క్రమంలో అప్పటికే ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శోభారాణితో 1992లో వివాహం జరిగింది. ఆమె ఉద్యోగ రిత్యా 1993లో కరీంనగర్కు మకాం మార్చారు. అనంతరం తాను కూడా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. కరీంనగర్లో నెలకొన్న సాహిత్య వాతావ రణమే తన ఎదుగుదలకు కారణంగా చెబుతారు. కథల పరంగా ఎన్ని చదివినా అల్లంరాజయ్య, పెద్దింటి ఆశోక్కు మార్ కథలే తనను కట్టి పడేశాయని నాగభూషణం పేర్కొన్నారు. నలిమెల భాస్కర్ గంద్ర లక్ష్మణరావు, గీట్ల జనార్ధన్రెడ్డి కవితలు ప్రసాంగాలు తనను ఆకర్షించాయని చెబుతారు. ఉద్యమ నేపథ్యంలోనే పాటలు రాయడంతో పాటు పాడడం కూడా అలవాటుగా మారిందన్నారు.
పేదరికం కారణంగా దేవాలయాల్లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో ఎవరైనా పది రూపాయలు ఇస్తే పాట పాడిన సందర్భాలను గుర్తు చేసుకున్న సమయంలో ఆయన కళ్లు చెమ్మగిల్లాయి. ప్రత్యేకించి తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తాను రాసి పాడిన 50పాటలు సిడిల రూపంలో ప్రజల్లోకి వెళ్లాయి. వీటితో పాటు బాలగేయాలు, కథలు సైతం రాశారు.

### పుస్తకాలు..

2007లో నెత్తుటి గాయాలు, 2020లో ప్రాణదీపం కవితా సంకాలనాలు వెలువడ్డాయి. త్వరలోనే మరో కథల పుస్తకం రానుంది. 2008లో తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులుగా సంకెపల్లి నాగేంద్రశర్మ అధ్యక్షులుగా, గాజోజు నాగభూషణం కార్యదర్శిగా పనిచేశారు. అప్పటి నుంచి రచనలు, కార్యక్రమాల నిర్వహణలో వేగం పెరిగింది. తాను తెలంగాణ రచయితల వేదికకు రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శిగా నూ పనిచేశారు.

### పురస్కారాలు ..

గాజోజు నాగభూషణం రచనలకుగానూ పలు రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. అందులో అలిశెట్టి ప్రభాకర్ పేర వచ్చిన పురస్కారం ప్రథమం. అనంతరం కందికొండ రామస్వామి స్మారక అవార్డు లభించింది. అ తరువాత పాలమూరు సాహిత్య వేదిక ద్వారా మరో పురస్కారం అందుకున్నారు. తాను రాసిన 25 కథలకు గానూ, 12 పురస్కారాలు రావడం విశేషం. దీంతో పాటు గురుజాడ పురస్కారం కూడా దక్కింది. జిల్లా స్థాయిలో ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆయనను ఉత్తమ కవిగా సత్కరించింది. గాయకునిగాను ఆయనకు గుర్తింపు లభించింది. జగిత్యాలకు చెందిన పండిత శిక్షణ కళాశాల నుంచి గాన కోకిల అవార్డు అందుకున్నారు. తెలంగాణ అవతరణ అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం లభించింది. లయన్స్ క్లబ్ ద్వారానూ మరో పురస్కారం అందుకున్నారు. 2009లో టీవి నంది అవార్డల జ్యూరీ సభ్యులుగా పనిచేశారు. తాను సాహిత్య రంగంలో నిలదొక్కుకునేందుఎకు విరసం వర్కషాప్తో పాటు ప్రముఖ రచియిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి ప్రోత్సహం కూడా కారణమైందన్నారు. పాటల పరంగా అరుణోదయ రామారావు స్ఫూర్తిగా చెప్పుకున్నారు. 2014లో పంచపాల జిల్లా కథసంకలనంలో పరిష్కారం కథకు తగిన గుర్తింపు పొందారు.
తన జీవనసహచరి శోభారాణి ప్రోత్సహం లేకుండా తన ప్రయాణం ఇంతదూరం సాగేదికాదన్నారు. ఒక్కమాటలో చెప్పలంటే ఆమె లేకుండా తాను లేనన్నారు. పిల్లలు డాక్టర్. ప్రత్యూష, అక్షయ్, కపిల్‌ల ప్రోత్సహం కూడా తోడైందన్నారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న దశలో శేష జీవితం పూర్తిగా సాహిత్యానికే అకింతం చేస్తానని పేర్కొన్నారు.

**పి.ఎస్.రవీంద్ర**
**కవి, సీనియర్ జర్నలిస్ట్**






# 20 బంతుల్లోనే వృద్ధిమాన్ సాహా సెంచరీ



టీ20 క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు సాహిల్ చౌహాన్ అనే ఆటగాడి పేరిట ఉంది. సైప్రస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఎస్టోనియా తరఫున ఆడిన సాహిల్ కేవలం 27 బంతుల్లోనే సెంచరీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. అయితే, ఓ టీమిండియా మాజీ ఆటగాడు కేవలం 20 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన సంగతి చాలామంది తెలియదు. ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో జరగలేదు. ఇది ప్రతిష్టాత్మక క్లబ్ మ్యాచ్‌లో జరిగింది. ఇంతటి విస్ఫోటక సెంచరీ సాధించిన బ్యాట్స్‌మెన్ మరెవరో కాదు వృద్ధిమాన్ సాహా. 2018లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ నిర్వహించిన %ు%20 టోర్నమెంట్‌లో వృద్ధిమాన్ సాహా కేవలం 20 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్, మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ జట్లు తలబడ్డాయి. మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన వృద్ధిమాన్ సాహా అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడు. అంతేకాదు ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు కొట్టి కేవలం 20 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తొలి బంతి నుంచే అద్భుతమైన బ్యాటింగ్ కనబరిచిన వృద్ధిమాన్ సాహా.. ఈ మ్యాచ్‌లో 14 సిక్సర్లు, 4 ఫోర్లు బాదాడు. దీని ద్వారా అతను 20 బంతుల్లో 102 పరుగులు సాధించాడు. వృద్ధిమాన్ సాహా చేసిన ఈ అద్భుతమైన సెంచరీ సహాయంతో, మోహన్ బగన్ క్రికెట్ క్లబ్ జట్టు బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్ నిర్దేశించిన 152 పరుగుల లక్ష్యాన్ని కేవలం 7 ఓవర్లలోనే ఛేదించి 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. 7 సంవత్సరాల క్రితం వృద్ధిమాన్ సాహా చేసిన ఈ పేలుడు సెంచరీ దేశీయ గడ్డపై ఇప్పటివరకు సాధించిన వేగవంతమైన సెంచరీగా రికార్డుల్లోకి ఎక్కింది. సాహా కెరీర్ విషయానికొస్తే.. 2010లో టీమ్ ఇండియా తరఫున అరంగేట్రం చేసిన వృద్ధిమాన్ సాహా 40 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఆడాడు. ఈ సమయంలో అతడు 56 ఇన్నింగ్స్‌లు ఆడి 3 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలతో మొత్తం 1353 పరుగులు సాధించాడు. అదేవిధంగా, భారత్ తరఫున 9 వన్డేలలోనూ వికెట్ కీపర్‌గా ఆడిన సాహా కేవలం 41 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అందువల్ల, 2014 తర్వాత అతనికి భారత వన్డే జట్టులో అవకాశం రాలేదు. ఈ సంవత్సరం ప్రారంభంలో అన్ని రకాల ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు వృద్ధిమాన్ సాహా. ఇప్పుడు బెంగాల్ అండర్–23 జట్టు కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేశాడు.

# బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు

జింబాబ్వే ఆల్ రౌండర్ బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు సృష్టించాడు. కేవలం 9.3 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే టాస్ గెలిచి ఆఫ్ఘనిస్తాన్‌పై బౌలింగ్ ఎంచుకుంది. దీని ప్రకారం, మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. కానీ 77 పరుగుల వద్ద 2వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్స్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా, ఆఫ్ఘనిస్తాన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 127 పరుగులకు ఆలౌట్ అయింది.ఆఫ్ఘనిస్తాన్ జట్టు తక్కువ స్కోరు సాధించడానికి ప్రధాన కారణం బ్రాడ్ ఎవాన్స్. ఈ మ్యాచ్‌లో ఇవాన్స్ 57 బంతులు వేసి కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, జింబాబ్వే తరఫున ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యల్పంగా 5 వికెట్లు తీసిన రికార్డును కూడా అతను సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ పేరిట ఉండేది. 2001లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్ట్రీక్ 27 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీనితో, జింబాబ్వే తరఫున ఒక టెస్ట్‌లో అతి తక్కువ పరుగులకు ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.24 సంవత్సరాల క్రితం నెలకొల్పిన రికార్డు ను బ్రాడ్ ఎవాన్స్ ఇప్పుడు బద్దలు కొట్టాడు. ఆఫ్ఘనిస్తాన్‌పై కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి అతను కొత్త చరిత్ర సృష్టించాడు. దీనితో, జింబాబ్వే తరఫున అతి తక్కువ పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసిన బౌలర్‌గా బ్రాడ్ ఎవాన్స్ నిలిచాడు.



# ఊచకోత..

## చెలరేగిన లారా, డీక్లెర్క్..

- 40 ఓవర్లకే మూడొందలు కొట్టిన దక్షిణాఫ్రికా
- ప్రేమదాస మైదానంలో సఫారీ బ్యాటర్ల దంచుకోలు
- లారా వొల్వార్డ్ 90, లుస్ 61తో శతక భాగస్వామ్యం
- మరినే కాప్ 68 నాటౌట్.. ఫినిషర్ డీక్లెర్క్ సిక్సర్ల మోత
- పాకిస్తాన్ బౌలర్లు ఊచకోత.. 9 వికెట్లకు 312 రన్స్





**కొలంబో, అక్టోబర్ 21, (జనంసాక్షి) :**
వరల్డ్ కప్‌లో నాలుగు విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లిన దక్షిణాఫ్రికా, ప్రేమదాస మైదానంలో పాకిస్తాన్‌పై భారీ స్కోర్‌తో విరుచుకుపడింది. వర్షం అంతరాయం తర్వాత డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 40 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో సఫారీ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. కెప్టెన్ లారా వొల్వార్డ్ (90), సునే లుస్ (61), మరినే కాప్ (68 నాటౌట్), నడినే డీక్లెర్క్ (41)లు కీలక ఇన్నింగ్స్‌లతో జట్టు స్కోర్‌ను 312/9కి ఊరించారు. పాకిస్తాన్ బౌలర్లను ఊచకోత చేసిన ఈ ప్రదర్శనతో దక్షిణాఫ్రికా మరోసారి తన బలాన్ని చాటుకుంది.
కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్ (0) సున్నాకే ఔటైనా, కెప్టెన్ లారా వొల్వార్డ్, సునే లుస్‌లు అర్ధశతకాలతో కదం తొక్కారు. వర్షం కారణంగా ఆగిన మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించగా, 6/1తో తిరిగి ఆరంభించిన దక్షిణాఫ్రికా భారీ స్కోర్ దిశగా సాగింది. రన్ రేట్‌ను 7కు పైనే ఉంచుతూ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగిన ఈ ద్వయం రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పింది. 123/2 వద్ద హాఫ్ సెంచరీ తర్వాత నష్రా బౌలింగ్‌లో దయానా చేతికి క్యాచ్ ఇచ్చి లుస్ వెనుదిరిగింది.
ఆ తర్వాత ఓవర్లోనే వొల్వార్డ్ బౌండరీతో అర్ధశతకం పూర్తి చేసుకుంది. అనెరీ డెర్క్‌సెన్ (8) తక్కువ స్కోర్‌తో వెనుదిరిగినా, ఆల్‌రౌండర్ మరినే కాప్ (68 నాటౌట్) వచ్చి ధనాధన్ ఆడింది. లుస్‌తో కలిసి ఫిఫ్టీ రన్స్ భాగస్వామ్యం పెట్టిన కాప్, దయానా ఓవర్లో సిక్సర్‌తో లారా సెంచరీకి చేరువయ్యింది. కానీ, నష్రా ఓవర్లో స్టంప్ అవుట్‌గా వొల్వార్డ్ 90లో చిక్కింది. అనంతరం చోలే ట్రయాన్ (21)తో కలిసి స్కోర్‌బోర్డును ఉరించిన కాప్, సడియా ఇక్బాల్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టినా, చివరిబంతికి స్టంప్ అవుట్‌గా 253/6 వద్ద ఆరో వికెట్ పడింది.
వరుసగా రెండు వికెట్లు పడడంతో 280కే పరిమితమవుతుందని అనిపించినా, ప్రపంచ కప్‌లో ఫినిషర్‌గా రాణిస్తున్న నడినే డీక్లెర్క్ (41) వస్తూ వస్తూనే పాక్ బౌలర్లకు చుక్కలు చూపెట్టింది. ఫాతిమా సనా వేసిన 39వ ఓవర్లో 6, 4, 6, 6తో 25 పరుగులు పిండుకున్న డీక్లెర్క్ స్కోర్‌ను మూడొందలు దాటించింది. చివరి ఓవర్ తొలి బంతిని బౌండరీకి పంపిన ఈ చిచ్చరపిడుగు, మరో షాట్‌కు యత్నించి పర్వేజ్ చేతికి దొరికింది. మరినే సిక్సర్ సంధించగా, 9 వికెట్ల నష్టానికి దక్షిణాఫ్రికా 312 పరుగులు చేసింది. ఈ భారీ స్కోర్‌తో సఫారీ జట్టు పాకిస్తాన్‌పై ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**మహిళల వన్డే ప్రపంచకప్2025లో భాగంగా పాకిస్థాన్ తో జరుగుతున్న మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. వర్షం కారణంగా 40 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 312 పరుగుల భారీ లక్ష్యాన్ని పాక్ ముందు ఉంచింది. ప్రొటీస్ కెప్టెన్ లారా వోల్వార్డ్ (90), సూన్ లస్ (68 నాటౌట్), మారిజన్ కాప్ (67 నాటౌట్), నదినే డి క్లెర్క్ (41) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆ జట్టు నిర్ణీత 40 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసింది.**

# ఆస్ట్రేలియా సిరీస్‌లో దిగ్గజాలు

- ఒత్తిడిలో రాణిస్తానన్న యువ కెప్టెన్
- రోహిత్, కోహ్లీ సలహాలు తీసుకుంటా: శుభ్‌మన్ గిల్



**పెర్త్, అక్టోబర్ 21, (జనంసాక్షి) :**
భారత వన్డే జట్టు కొత్త కెప్టెన్‌గా నియమితుడైన శుభ్‌మన్ గిల్, మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తన అనుబంధం గురించి స్పష్టమైన వ్యాఖ్యలు చేశాడు. ఆదివారం పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గిల్, రోహిత్, కోహ్లీలతో తన సంబంధం గతంలోలాగే ఉందని, అవసరమైతే వారి సలహాలు తీసుకోవడానికి వెనుకాడనని తెలిపాడు. సోషల్ మీడియాలో రోహిత్, కోహ్లీల భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను ఖండిస్తూ, ఈ యువ కెప్టెన్ తన నాయకత్వ దృక్పథాన్ని వెల్లడించాడు.
రోహిత్ శర్మ స్థానంలో వన్డే జట్టు సారథిగా బాధ్యతలు చేపట్టిన గిల్, తన తొలి సిరీస్‌లో ఆస్ట్రేలియా సవాల్‌ను ఎదుర్కొననున్నాడు. స్వాన్ నది ఒడ్డున జరిగిన మీడియా సమావేశంలో గిల్ మాట్లాడుతూ, "రోహిత్‌తో నా బంధంలో ఎలాంటి మార్పు లేదు. అవసరమైతే సలహా కోసం రోహిత్‌ను సంప్రదిస్తాను. పిచ్ స్వభావం, మ్యాచ్ వ్యూహాల గురించి అతని సహాయం తీసుకుంటాను" అని అన్నాడు. విరాట్ కోహ్లీతో కూడా తనకు మంచి అనుబంధం ఉందని, ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు ఎప్పుడూ సలహాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారని చెప్పాడు.
25 ఏళ్ల ఈ యువ కెప్టెన్, జట్టుపై ఉన్న బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ధీమా వ్యక్తం చేశాడు. "విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌ల నుంచి జట్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలో చాలా నేర్చుకున్నాను. వారి అనుభవం మాకు స్ఫూర్తినిస్తుంది. ఎంఎస్ ధోని, విరాట్, రోహిత్‌ల వారసత్వం నుంచి నేర్చుకోవడానికి చాలా ఉంది. వారి ఆటను చూస్తూ పెరిగాను, వారిని ఆరాధించాను. అలాంటి దిగ్గజాలు నా సారథ్యంలో ఆడటం గౌరవంగా భావిస్తున్నాను" అని గిల్ పేర్కొన్నాడు. ఒత్తిడిలో తాను రాణిస్తానని, కెప్టెన్సీ బాధ్యత తన ఆటను మరింత మెరుగుపరుస్తుందని గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. "బ్యాటింగ్ చేసేటప్పుడు బ్యాటర్‌గా ఆలోచిస్తాను, కెప్టెన్‌లా కాదు. అలా చేస్తే ఒత్తిడి పెరుగుతుంది, స్వేచ్ఛగా ఆడలేం. రోహిత్, కోహ్లీలు దాదాపు రెండు దశాబ్దాలుగా భారత క్రికెట్‌కు సేవలందించారు. వారి అనుభవాన్ని రిపీట్ చేయలేం. కానీ, వారి సలహాలతో జట్టును సమర్థవంతంగా నడిపిస్తాను" అని గిల్ తెలిపాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో రోహిత్, కోహ్లీలు కీలక పాత్ర పోషిస్తారని, వారి అనుభవం జట్టుకు బలాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

# దీపావళి నాడు విషాదం

- బైకర్‌ను ఢీకొట్టిన కారు.. బాలుడు మృతి



**హైదరాబాద్, అక్టోబర్21 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలంలోని పుప్పాలగూడ అల్కాపూరీ కాలనీలో సోమవారం రాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది. టపాసులు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వస్తున్న తండ్రికొడుకుపై వేగంగా దూసుకొచ్చిన కారు బీభత్సం సృష్టించింది. పుప్పాలగూడ ప్రాంతానికి చెందిన వ్యక్తి తన కుమారుడు కుశల జోయల్‌తో కలిసి బైక్‌పై ఇంటికి వస్తుండగా, ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. వేగంగా ఢీకొనడంతో బాలుడు రోడ్డుపై పడిపోగా, అదే కారు అతనిపై నుంచి దూసుకెళ్లింది. తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. తక్షణమే స్థానికులు స్పందించి, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. కారు నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

# అడ్డూఅదుపులేని బంగారం ధరలు

- తులం ధర మరో మూడువేలు పెరుగుదల



**హైదరాబాద్, అక్టోబర్21 (జనంసాక్షి) :** దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగలశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. మంగళవారం ఆ మొత్తం రూ.1,34,500కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర సోమవారం రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. ఔన్సు వెండి ధర 51 డాలర్ల పైనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా టారిఫ్‌లు, డాలర్ విలువ తగ్గిపోతుండటం వంటి పరిణామాలతో పసిడిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక, పలు దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## రూ.6.05 లక్షల కోట్ల టపాసుల అమ్మకాలు..!

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఈ ఏడాది దేశవ్యాప్తంగా దీపావళి అమ్మకాలు రూ.6.05లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో రూ.5.40 కోట్ల విలువైన వస్తువ వ్యాపారం.. రూ.65వేల కోట్ల విలువైన సర్వీసెస్ వ్యాపారం జరిగిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ నివేదికను విడుదల చేసింది. ఇదే ఇప్పటి వరకు దేశ వాణిజ్య చరిత్రలో అతిపెద్ద పండుగగా నిలిచింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానులతో పాటు టైర్-2, టైర్-3 నగరాలతో సహా దేశవ్యాప్తంగా 60 ప్రధాన కేంద్రాల్లో సీఏఐటీ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహించిన సర్వే ఆధారంగా 'డిటైర్డ్ దీపావళి పండుగ అమ్మకాలు 2025' పేరుతో నివేదికను విడుదల చేసింది. సీఏఐటీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు, స్వదేశీ స్వీకరణకు బలమైన బ్రాండ్ అంబాసిడర్‌గా ఎదిగారని నివేదిక చూపిస్తుందని పేర్కొంది. ఇది వ్యాపారులు, వినియోగదారులు ఇద్దరిని అపూర్వమైన రీతిలో ప్రేరేపించిందని అన్నారు. 87శాతం మంది వినియోగదారులు విదేశీ వస్తువుల కంటే భారతీయ వస్తువులను కొనుగోలు చేసేందుకు ఇష్టపడ్డారని.. తత్ఫలితంగా చైనా ఉత్పత్తులకు డిమాండ్ భారీగా తగ్గిందని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే భారత్‌లో తయారైన అమ్మకాలు 25శాతం పెరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా అమ్మకాల్లో కిరాణా, ఎఫ్ఎంసీజీ 12శాతం, బంగారం-వెండి 10శాతం, ఎలక్ట్రానిక్స్ 8శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 7శాతం, రెడీమేడ్ దుస్తులు 7శాతం, గిఫ్ట్ ఐటమ్స్ 7శాతం, హోమ్ డేకర్ 5శాతం, ఫర్నిషింగ్-ఫర్నీచర్ 5శాతం, స్వీట్లు-స్నాక్స్ 5శాతం, వస్త్రాలు 4శాతం, పూజ వస్తువులు 3శాతం, పండ్లు- గింజలు 3శాతం, బేకరీ-మిఠాయిలు 3శాతం, పాదరక్షలు 2శాతం, ఇతర వస్తువులు 19శాతం అమ్మకాలు జరిగాయని క్యాట్ జాతీయ అధ్యక్షుడు బీసీ భారతీయ పేర్కొన్నారు.

# ఆరోగ్య రంగంలో హుస్నాబాద్ అభివృద్ధి

- ఆసుపత్రి నిర్మాణం తరవాత పూర్తిస్థాయి స్టాఫ్
- మంత్రి పన్నం ప్రభాకర్ వెల్లడి



**సిద్దిపేట, అక్టోబర్21 (జనంసాక్షి) :** హుస్నాబాద్‌ను ఆరోగ్యరంగంలో నెంబర్ వన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు పనిచేస్తున్నారని, కొత్త భవనం పూర్తి కాగానే 38 మంది డాక్టర్లు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సందర్శించారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న 250 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సుమారు 82 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునాతన సదుపాయాలతో కూడిన 250 పడకల హాస్పటల్ నిర్మాణం జరుగుతోంది. హుస్నాబాద్‌లో నర్సింగ్ కాలేజీ స్థాపనకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'మహాసముద్రం గండి పనులు టూరిజం అభివృద్ధి కోసం వేగంగా కొనసాగుతున్నాయి. గౌరవెల్లి కాలువల పనులకు భూసేకరణ జరుగుతోంది. రైతులు అందరూ సహకరించాలని కోరుతున్నాను అని తెలిపారు. ఇక మహిళా సంఘాల అభ్యున్నతికి పొన్నం సత్తయ్య ట్రస్టు ద్వారా 13 రకాల వస్తువులతో కూడిన స్టీల్ పాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 'ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, ప్రాజెక్టులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్.. అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం' అని మంత్రి స్పష్టం చేశారు.

# నగల కోసం దుర్మార్గం

- ఒంటరి మహిళను చంపి నగలతో ఉడాయింపు

**కామారెడ్డి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** ఒంటిపై ఉన్న ఆభరణాల కోసం వృద్ధురాలిని హత్య చేసాడో దుండగుడు. ఒంటరి మహిళను చూసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండాలో మంగళవారం కలకలం రేపింది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. అంకోల్ తండాకు చెందిన రాధిబాయి (67)ఒంటరిగా నివసిస్తోంది. సోమవారం దీపావళి పండుగ సందర్భంగా అదే గ్రామానికి చెందిన తన సోదరి లక్ష్మి.. తనను పూజకు తీసుకెళ్లేందుకు ఇంటికి వెళ్లింది. తలుపులు కొట్టి పిలిచినా ఆమె స్పందించకపోవడంతో కిటికీ నుంచి చూసింది. అదే గ్రామానికి చెందిన వ్యక్తి మెగవాత్ సవాయిసింగ్ రాధిబాయి ఇంట్లో ఉండడాన్ని గమనించింది. అతడు రాధిబాయి తలపై మూడు సార్లు కొట్టి ఆమె రెండు చేతులకు ఉన్న కడియాలను లాక్కొని తలుపులు తెరిచాడు. అప్పటికే అక్కడికి వచ్చిన లక్ష్మిని గమనించాడు. ఆమెను కొట్టి అక్కడి నుంచి పారిపోయాడు. గమనించిన బంధువులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. రాధిబాయి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాధిబాయి భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 6 నెలల క్రితం ఓ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేపట్టారు.

# హాస్టల్‌లో ఉంటున్న బాలికను తీసుకెళ్లి లైంగికదాడి

**రాజమండ్రి, అక్టోబర్ 21 (జనంసాక్షి) :** రాజమండ్రిలో దారుణం చోటుచేసుకుంది. మాయమాటలతో బయటకు తీసుకువెళ్లి పదో తరగతి హాస్టల్ విద్యార్థినిపై ఓ యువకుడు అత్యాచారం చేసిన ఘటన కలకలం రేపుతుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజమండ్రి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదైంది. నిందితుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన అజయ్‌గా పోలీసులు గుర్తించారు. రాజమండ్రి టూ టౌన్ సీఐ శివ గణెశిష్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రిలోని ఓ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని సోమవారం సాయంత్రం అన్నయ్య వచ్చాడని, సబ్బులు తెచ్చుకోవాలని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి బయటకు వెళ్ళింది. పరిచయం ఉన్న అజయ్ అనే యువకుడు మాయమాటలు చెప్పి గోదావరి గట్టుకు బైక్‌పై తీసుకువెళ్లాడు. అజయ్ వెంట బైక్‌పై మరో యువకుడు వచ్చాడు. ఆ బాలిక పట్ల అసభ్య ప్రవర్తిస్తూ, మాయమాటలతో అజయ్ రైల్వే స్టేషన్ రోడ్లో ఓ లాడ్జికు తీసుకువెళ్లాడు. రూమ్‌లో బాలికపై అజయ్ అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఆ అమ్మాయిని బైక్‌పై తీసుకువచ్చి దేవీచౌక్‌లో దింపివేశాడు. విద్యార్థిని హాస్టల్ లోనికి వెళ్లిపోయింది. అమ్మాయి కంగారు పడటం సహా మెడ, పెదాల పైన గాట్లు ఉండేసరికి అనుమానం వచ్చి వార్డెన్ ప్రశ్నించింది. దాంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక జరిగిన విషయం చెప్పడంతో కంగారుపడి వెంటనే వారి తల్లిదండ్రులకు హాస్టల్ వార్డెన్ సమాచారం ఇచ్చింది. ముందుగా బాలికని ఆసుపత్రికి తీసుకువెళ్లి.. ఆ తర్వాత వార్డెన్ సహా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి బంధువులు పిర్యాదు చేశారు. అనుమానిత వ్యక్తి సెల్ నెంబర్ ఆధారంగా.. రావులపాలెంకు చెందిన అజయ్ గా పోలీసులు భావిస్తున్నారు. రాజమండ్రి పోలీసులు నిందితుడిపై ఫోక్సో, అత్యాచారం సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గూగుల్ ఆఫీస్‌లో నల్లుల బెడద.. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్

**న్యూయార్క్ (జనంసాక్షి) :** న్యూయార్క్ నగరంలోని గూగుల్ కార్యాలయంలో మరోసారి నల్లుల బెడద తలెత్తింది. దాంతో ఆ కార్యాలయం తాత్కాలికంగా మూతపడింది. ఉద్యోగులందరూ వర్క్ ఫ్రమ్ హెూమ్ చేయాలని కంపెనీ మెయిల్ పెట్టింది. నల్లుల బెడదను పరిష్కించే వరకు ఉద్యోగులు ఆఫీసుకు రావద్దని సూచించింది. మాన్ హట్టన్ చెల్సియా క్యాంపస్‌లోని ఆఫీసులో ఇటీవల నల్లుల బెడద పెరిగిపోయిందని, వాటిని నిర్మూలించేందుకు ఆఫీసును తాత్కాలికంగా మూసివేస్తున్నామని గూగుల్ సంస్థ తెలిపింది. ఈ నెల 19న ఆఫీసును మూసివేసి నల్లుల నివారణకు చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి ఆయా ఉద్యోగులు తిరిగి కార్యాలయానికి వచ్చేందుకు అనుమతి ఇచ్చింది. ఉద్యోగులలో ఎవరికైనా దురద లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని కంపెనీ మెయిల్ చేసింది. పనిచేసే ప్రాంతంలో ఎక్కడైనా నల్లులు కనిపిస్తే తెలుపాలని కోరింది. ఆఫీసులో పెద్ద సంఖ్యలో జంతువుల బొమ్మలు ఉంచడం వల్లే నల్లులు వ్యాపించి ఉండవచ్చని కార్యాలయ వర్గాలు భావిస్తున్నాయి. కాగా 2010లో కూడా ఇదేవిధంగా నల్లుల బెడదతో గూగుల్ కార్యాలయం తాత్కాలికంగా మూతపడింది.

# డికెతో కిరణ్ మజుందార్ షా భేటీ


- మేనల్లుడి వివాహానికి ఆహ్వానం అందజేత



**బెంగళూరు, అక్టోబర్21 (జనంసాక్షి) :** భారత సిలికాన్ వ్యాలీగా అభివర్ణించే బెంగళూరులో రోడ్ల దుస్థితిపై పారిశ్రామికవేత్తల విమర్శలు, నేతల వ్యంగ్యాస్త్రాలతో ఇటీవల కర్ణాటకలో రాజకీయ దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా మంగళవారం భేటీ అయ్యారు. ఉదయం డిప్యూటీ సీఎం నివాసానికి వచ్చిన కిరణ్ మజుందార్ షా.. తన మేనల్లుడి వివాహానికి డీకేను ఆహ్వానించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి ఆయనను కూడా పెళ్లికి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్‌తో భేటీ అనంతరం కిరణ్ మజుందార్ షా మీడియాతో మాట్లాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి ఈ సమావేశం గురించి డీకే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. బెంగళూరు పురోగతి, సృజనాత్మక, రాష్ట్ర అభివృద్ధి మార్గాలపై ఆమెతో చర్చించి నట్లు డీకే వెల్లడించారు. గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని కిరణ్ మజుందార్ షా ఓ పోస్టులో వెల్లడించారు. ఇది కాస్తా వైరల్‌గా మారింది. దీనిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆమె రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చన్నారు. అందుకోసం నిధులు కూడా ఇస్తామన్నారు. వ్యక్తిగత అజెండాతోనే ఆమె ఈ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆమెకు పలువురు పారిశ్రామికవేత్తలు మద్దతుగా నిలిచారు. సమస్యకు పరిష్కారం వెతకడం మాని రాజకీయాలు చేస్తున్నారంటూ హర్ష్ గొయెంకా అసహనం వ్యక్తంచేశారు. బెంగళూరు కోసం గళమెత్తే వారిపై దాడులు చేసే ట్రెండ్ సరికాదని, దాన్ని మానుకోవాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

# అమరావతి నిర్మాణంలో అమృత్ పథకం

- 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు
- ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ శాఖ



**అమరావతి, అక్టోబర్21 (జనంసాక్షి) :** రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పట్టణాలలో తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అమృత్ 2.0 పథకం కింద 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏపీయూఎఫ్ఐడీసీ, పబ్లిక్ హెల్త్, గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్లకు ఈ పనుల నిర్మాణంతోపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జారీ చేసి ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మరోవైపు ఈ పనులు తీసుకునే సంస్థలు.. ఒప్పందం సమయంలో కొంత మొత్తం సెక్యూరిటీగా చెల్లించాలనే నిబంధనను విధించింది. ఈ పనులు సాగుతున్న సమయంలో ఈ నిధులు కట్ చేయకుండా మాఫీ చేసేందుకు అనుమతి సైతం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాల వాటా కోసం అవసరమైన నిధులను సేకరించేందుకు ంఖజఈఎఆఅకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది రాష్ట్ర పట్టణాభివృద్ధి చరిత్రలోనే అతి పెద్ద పెట్టుబడి పెట్టిన ప్రాజెక్ట్‌గా రికార్డుల్లో నమోదవనుంది. అయితే మొత్తం ప్రాజెక్టు ఖర్చులో కేంద్రం రూ. 2, 470 కోట్లు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2, 490 కోట్లు విడుదల చేయను న్నాయి. ఇక ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 925 కోట్లు విడుదల చేయనుంది. పట్టణాల వాటా రూ. 590 కోట్లుగా నిర్ధారించింది. అంతా కలిపి ప్రాజెక్టు క్యాపెక్స్ రూ.6, 477 కోట్లుగా.. దీనికి 10 ఏళ్ల నిర్వహణ ఖర్చు రూ.1, 499 కోట్లుగా నిర్ణయించింది. క వడ్డీ ఖర్చు కింద రూ. 2,344 కోట్లు భారం పడనుంది. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.10, 319. 93 కోట్లు.

## మృతుల కుటుంబాలకు 15 లక్షల చొప్పన పరిహారం

- సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశం




**అమరావతి, అక్టోబర్21 (జనంసాక్షి) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన హోం మంత్రి అనిత, అధికారులు సురేష్, ఆకే రవికృష్ణ బాణసంచా పేలుడు ఘటనకు సంబంధించిన నివేదికను సీఎంకు అందించారు. ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు మెటీరియల్ మాన్యుఫాక్చరింగ్ చేశారని, హార్డ్ మెటీరియల్ వాడటం వల్లే స్పార్క్ వచ్చి, మాన్యుఫాక్చరింగ్ జరుగుతున్న ప్రాంతంపై పడిందని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఏ మాత్రం నిబంధనలు పాటించలేదని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఎక్స్‌ప్లోజివ్ మెటీరియల్ పై నియంత్రణ కోసం ఇక నుంచి ఆన్ లైన్ ద్వారానే కొనుగోళ్లు జరిగేలా చూడాలన్న ముఖ్యమంత్రి బాణసంచా కోసం ఉపయోగించే పదార్థాల కొనుగోళ్లు, తయారీపై పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం లేని తయారీ కేంద్రాలను, ఆథరైజేషన్ లేని వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని సీఎం పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. బాణసంచా తయారీ కేంద్రాలన్నీ నిబంధనల ప్రకారమే ఉండాలన్నారు. అలాగే, పనిచేసే వారికి వ్యక్తిగత బీమా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370